


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX


## రేపు వారాణసికి సీఎం చంద్రబాబు




ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 249 | బుధవారం 16 - 09 -2026 | పేజీలు : 12 | వెల-3


## శ్రీవారికి లాంఛనంగా పట్టువస్త్రాలు సమర్పించడం నా అదృష్టం



సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

రాష్ట్రం సుభిక్షంగా, దేశం అగ్రగామిగా నిలవాలని శ్రీవారిని ప్రార్థించినట్లు వెల్లడి

తిరుమలలో క్రమశిక్షణతో కూడిన ఆలయ నిర్వహణ దేశంలోని ఇతర ఆలయాలకు స్ఫూర్తి అని వెల్లడి

2లో

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలంటూ టీటీడీకి కీలక సూచనలు

కుటుంబ సమేతంగా బ్రహ్మోత్సవ వేడుకల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి

## కుటుంబంతో కలిసి శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మంత్రి లోకేశ్..



ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

శ్రీవారిని దర్శించుకున్న చంద్రబాబు, లోకేశ్, భువనేశ్వరి, నారా బ్రహ్మణి

పెద్దశేష వాహన సేవలో పాల్గొన్న చంద్రబాబు, లోకేశ్

2027 టీటీడీ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించిన సీఎం

2లో

తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల తొలిరోజున రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కుటుంబ సమేతంగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించడం తెలిసిందే. ఈ పవిత్ర వేడుకలలో మంత్రి నారా లోకేశ్ కూడా





2027 మార్చి నాటికి 5.52 లక్షల గృహాలు పూర్తి చేయాలని సీఎం ఆదేశం

ఉచిత ఇళ్ల స్థలాల కోసం పారదర్శక విధానం అమలు చేయాలని సూచన

కేంద్ర సహకారంతో రాష్ట్రంలో పారిశ్రామిక టౌన్‌షిప్‌ల ఏర్పాటుకు ప్రణాళిక

కుప్పం నియోజకవర్గంలో సంతృప్త స్థాయిలో ఇళ్ల నిర్మాణం చేపట్టాలని నిర్దేశం

# 2029 నాటికి అర్హులందరికీ సొంతిల్లు..



## పాకిస్థాన్ ద్వంద్వ నీతి: అమెరికాతో శాంతి మంత్రం... ఇరాన్‌కు ఆయుధ సాయం!



అమెరికా-ఇరాన్ మధ్య శాంతి దూతగా పాకిస్థాన్ నటన

ఇరాన్‌కు చైనా ఆయుధాలు చేరవేయడంలో సాయపడుతున్నట్టు ఆరోపణలు

పాక్ ద్వంద్వ వైఖరిపై కెనడా సంస్థ నివేదిక

శాంతి ప్రయత్నాల పేరుతో అమెరికా నుంచి భారీగా నిధులు కోరుతున్న పాక్

## ఆళ్ల నాని హఠాన్మరణం.. పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి



మాజీ ఉప ముఖ్యమంత్రి, టీడీపీ నేత ఆళ్ల నాని ఆకస్మిక మృతి

ఏలూరు నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా పనిచేసిన నాని

ఆయన మరణం పట్ల ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర విచారం

నాని కుటుంబ సభ్యులకు పవన్ కల్యాణ్ ప్రగాఢ సానుభూతి

ఆంధ్రప్రదేశ్ మాజీ ఉప ముఖ్యమంత్రి, టీడీపీ నేత ఆళ్ల నాని హఠాన్మరణం చెందడం తెలిసిందే. ఆయన ఆకస్మిక మరణ వార్త రాష్ట్ర రాజకీయ వర్గాలను విషాదంలో ముంచింది. ఏలూరుకు చెందిన కీలక నేతగా, సౌమ్యుడిగా పేరున్న ఆళ్ల నాని మృతి పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం తెలుపుతున్నారు. ఆళ్ల నాని మృతి పట్ల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన హఠాన్మరణం తనను ఎంతో బాధించిందని అన్నారు. "మూడు పర్యాయాలు ఏలూరు శాసనసభ్యునిగా, ఒకసారి ఎమ్మెల్సీగా ప్రజలకు

# ఏపీలో స్థానిక ఎన్నికలకు వేగంగా అడుగులు..

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తును వేగవంతం చేసింది. మున్సిపల్ ఎన్నికలను పూర్తి చేసే దిశగా కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా తాజాగా 41 పట్టణ స్థానిక సంస్థలకు ఫోటో ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని ఆదేశిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ పరిధిలో రాష్ట్రంలోని 12 మున్సిపల్ కార్పొరేషన్లు, 29 మున్సిపాలిటీలు మరియు నగర్ పంచాయతీలు ఉన్నాయి. ఈ సంస్థలన్నింటికీ ఓటర్ల జాబితాలను రూపొందించే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఎస్ఈసీ ఆదేశించింది. అసెంబ్లీ ఎన్నికల కోసం రూపొందించిన తాజా ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకుని ఈ జాబితాలను తయారు చేయనున్నారు. 2026 జనవరి 1వ తేదీని అర్హత తేదీగా ఎస్ఈసీ నిర్ణయించింది. ఈ తేదీ నాటికి ఓటు హక్కు పొందిన వారి పేర్లతో జాబితాలను సిద్ధం చేస్తారు. ఈ ప్రక్రియను పూర్తి చేసి, తుది ఓటర్ల జాబితాలను ఈ నెల 22న ప్రచురించనున్నట్లు ఎన్నికల సంఘం తన నోటిఫికేషన్‌లో



ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ వేగవంతం


41 పట్టణ స్థానిక సంస్థలకు ఓటర్ల జాబితాల రూపకల్పనకు ఆదేశాలు

ఈ నెల 22న తుది ఓటర్ల జాబితాలను ప్రచురించనున్న ఎన్నికల సంఘం

2026 జనవరి 1ని అర్హత తేదీగా నిర్ణయించిన ఎస్ఈసీ

ఇటీవలే 59 మున్సిపాలిటీలకు కూడా ఇదే తరహా నోటిఫికేషన్ జారీ

## వీడని జ్ఞానేశ్వరి మిస్టరీ!..100 రోజులైనా దొరకని ఆచూకీ



చిన్నారి సుంకర జ్ఞానేశ్వరి అదృశ్యమై వంద రోజులు దాటినా మిస్టరీ వీడలేదు. ఇంతకాలం గడిచినా ఆ చిన్నారి ఎక్కడ ఉంది? ఏం జరిగింది? అనే ప్రశ్నలకు సమాధానం లభించడం లేదు. ఈ విషయంలో పోలీసుల దర్యాప్తు కొనసాగుతున్నప్పటికీ.. పాప ఆచూకీపై ఎలాంటి క్లూ రావట్లేదు. ఈ ఏడాది జూన్ 6న కాకినాడ జిల్లా తుని మండలం సీహెచ్.అగ్రహారంలోని పామాయిల్ తోటలో ఆడుకుంటున్న జ్ఞానేశ్వరి అదృశ్యమైన విషయం తెలిసిందే. కిడ్నాప్, అడవి జంతువుల దాడి తదితర కోణాల్లో దర్యాప్తు కొనసాగించారు. ఈ మిస్సింగ్ కేసు దర్యాప్తు వివరాలతో పోలీసులు హైకోర్టుకు నివేదిక సమర్పించారు.

## ఆళ్ల నాని హఠాన్మరణం.. పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి

సేవలు అందించారు నాని గారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. నాని గారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను" అని పవన్ కల్యాణ్ తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. ఆళ్ల నాని రాజకీయ ప్రస్థానం ఏలూరు కేంద్రంగా కొనసాగింది. ఆయన ఏలూరు శాసనసభ నియోజకవర్గం నుంచి మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. గతంలో ఒకసారి ఎమ్మెల్సీగా కూడా ప్రజాసేవ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో కీలకమైన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించడంతో పాటు, ఉప ముఖ్యమంత్రిగా కూడా పనిచేశారు.

## ఏపీలో స్థానిక ఎన్నికలకు వేగంగా అడుగులు.. ఈనెల 22న ఓటర్ల జాబితా

స్పష్టంగా పేర్కొంది. ఇటీవలే మరో 59 మున్సిపాలిటీలలో ఓటర్ల జాబితాల తయారీకి కూడా ఎస్ఈసీ ఇదే తరహాలో నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. తాజా నోటిఫికేషన్‌తో ఎన్నికల నిర్వహణ ప్రక్రియ మరింత వేగం పుంజుకుంది. వరుస నోటిఫికేషన్ల నేపథ్యంలో త్వరలోనే రాష్ట్రంలో పురపాలక ఎన్నికల నగారా మోగనుందని స్పష్టమవుతోంది.

## అంతరిక్షంలో అమెరికా ఆయుధాలు.. తీవ్రంగా స్పందించిన చైనా

అంతరిక్షంలో అమెరికా ఆయుధాలను మోహరించడాన్ని చైనా తీవ్రంగా ఖండించింది. అంతరిక్షంలో సైనిక కార్యకలాపాలను, ఆయుధ సమీకరణను తక్షణమే నిలిపివేయాలని వాషింగ్టన్‌ను డిమాండ్ చేసింది. ఈ మేరకు చైనా విదేశాంగ శాఖ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అంతరిక్షంలో తమ వద్ద "కక్ష్య నియంత్రణ ఆయుధాలు" ఉన్నాయని యూఎస్ ఎయిర్ ఫోర్స్ సెక్రటరీ ట్రాయ్ మీంక్ బహిరంగంగా అంగీకరించిన మరుసటి రోజే చైనా ఈ విధంగా స్పందించింది. తమ బలగాలపై జరిగే శత్రు దాడులను తిప్పికొట్టేందుకే ఈ ఆయుధాలను మోహరించినట్లు ఆయన వెల్లడించారు. అయితే, ఇవి ఎలాంటి ఆయుధాలు, వాటి సామర్థ్యాలేమిటనే వివరాలను మాత్రం ఆయన బహిర్గతం చేయలేదు. ఆ వివరాలు వెల్లడిస్తే వాటి వ్యూహాత్మక ప్రాధాన్యత దెబ్బతింటుందని ఆయన పేర్కొన్నారు. "అంతరిక్షాన్ని కేవలం శాంతియుత ప్రయోజనాలకే వినియోగించాలి. దానిని యుద్ధ క్షేత్రంగా మార్చే ఏ ప్రయత్నాన్నైనా చైనా వ్యతిరేకిస్తుంది. స్పేస్‌లో ఆయుధ పోటీని మేం నిరోధిస్తాం. అమెరికా తన సైనిక కార్యకలాపాలను నిలిపివేసి, ప్రపంచ వ్యూహాత్మక స్థిరత్వాన్ని కాపాడాలి" అని చైనా తన ప్రకటనలో స్పష్టం చేసింది.

## శ్రీవారికి లాంఛనంగా పట్టువస్త్రాలు సమర్పించడం నా అదృష్టం:

తిరుమలలోని క్రమశిక్షణతో కూడిన, పారదర్శకమైన ఆలయ నిర్వహణ దేశంలోని ఇతర దేవాలయాలకు ఒక స్ఫూర్తి అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసించారు. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం ఆయన రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించే ఈ పవిత్ర కార్యం తన అదృష్టమని ఆయన పేర్కొన్నారు.కుటుంబ సమేతంగా తిరుమల చేరుకున్న చంద్రబాబు, తొలుత బేడీ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, మంగళ వాయిద్యాల నడుమ పట్టువస్త్రాలను శిరస్సుపై ఉంచుకుని శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు. స్వామివారికి వస్త్రాలు సమర్పించి, దర్శనం చేసుకున్నారు. ఆ తర్వాత, ఆలయ పండితులు ముఖ్యమంత్రికి, ఆయన కుటుంబ సభ్యులకు వేదాశీర్వచనాలు అందించగా, అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "రాష్ట్రంలో పుష్కలంగా వర్షాలు కురిసి, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆ దేవదేవుడిని ప్రార్థించాను. ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా, భారత్ ప్రపంచంలో అగ్రగామిగా నిలవాలని కోరుకున్నాను" అని తెలిపారు.ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది హిందువులకు కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామిపై అపారమైన విశ్వాసం ఉందని చంద్రబాబు అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా, దేశ వ్యాప్తంగా ఉన్న హిందువులు ఒక్కసారైనా శ్రీవారిని దర్శించుకోవాలని కోరుకుంటారని.. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన ఆలయాన్ని చక్కగా నిర్వహిస్తున్న టీటీడీ పాలకమండలిని, అధికారులను అభినందిస్తున్నానని తెలిపారు. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని సూచించారు. ఈ గొప్ప సంప్రదాయాన్ని, సంస్కృతిని భావితరాలకు అందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేశ్, ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, ఇతర బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

## కుటుంబంతో కలిసి శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మంత్రి లోకేశ్..



పాల్గొన్నారు.మంగళవారం సాయంత్రం తిరుమల చేరుకున్న మంత్రి లోకేశ్, ఆయన కుటుంబ సభ్యులు తొలుత బేడి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీవారి ఆలయానికి చేరుకోగా, అధికారులు మంగళవాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన అర్ధాంగి భువనేశ్వరి దంపతులు రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీవారికి పట్టువస్త్రాలను అందజేశారు.అనంతరం సీఎం చంద్రబాబు, నారా భువనేశ్వరి, మంత్రి లోకేశ్, నారా బ్రహ్మణి స్వామివారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో పండితులు వారికి వేదాశీర్వచనం అందించగా, అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు 2027 సంవత్సరానికి సంబంధించిన టీటీడీ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. దర్శనానంతరం ఆలయం వెలుపల జరిగిన పెద్దశేష వాహనసేవలో పాల్గొని మలయప్ప స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, అనగాని సత్యప్రసాద్, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, ఇతర ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## 2029 నాటికి అర్హులందరికీ సొంతిల్లు..

రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి 2029 నాటికి సురక్షితమైన, శాశ్వతమైన గృహాన్ని అందించడమే లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 'హౌసింగ్ ఫర్ ఆల్' కార్యక్రమాన్ని సాచురేషన్ విధానంలో అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా 2027 మార్చి నాటికి 5.52 లక్షల ఇళ్లను పూర్తి చేయాలని గడువు నిర్దేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథితో పాటు ఆ శాఖ, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ్), పీఎం జన్ మన్ వంటి వివిధ పథకాల కింద చేపట్టాల్సిన ఇళ్ల నిర్మాణ పనులను వచ్చే నెలలోగా గ్రౌండింగ్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. పట్టణ ప్రాంతాల్లో 1.5 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. డిసెంబరు 2026 నాటికి 2.05 లక్షల ఇళ్లు, 2027 మార్చి నాటికి మరో 2.74 లక్షల ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారుల గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో పీఎంఏవై 1.0, 2.0, పీఎం జన్ మన్ పథకాల కింద మొత్తం 18.72 లక్షల ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 13.20 లక్షలు పూర్తయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ పరిధిలో 16.11 లక్షల ఇళ్లకు గాను 11.31 లక్షలు, ఏపీ టిడ్కో పరిధిలో 2.61 లక్షల ఇళ్లకు గాను 1.88 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు.

**ఉచిత ఇళ్ల స్థలాలపై ప్రత్యేక కార్యాచరణ** ఇంటి స్థలం లేని అర్హులైన కుటుంబాలను కచ్చితంగా గుర్తించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఆవాస్ ప్లస్, హౌసింగ్, రెవెన్యూ శాఖలతో పాటు ఆర్టీజీఎస్ నుంచి డేటాను అనుసంధానం చేసి, డూప్లికేషన్ లేకుండా లబ్ధిదారులను గుర్తించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో ప్రాథమిక జాబితాలు ప్రచురించి, అభ్యంతరాలు స్వీకరించి, పారదర్శకంగా పరిష్కరించిన తర్వాతే తుది జాబితాలను ఖరారు చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే ఉన్న లేఅవుట్లలో నిర్మాణాలు చేపట్టని భూమిని అవసరాన్ని బట్టి 2 లేదా 3 సెంట్ల ప్లాట్లుగా పునర్వ్యవస్థీకరించాలని నిర్దేశించారు. కుప్పం నియోజకవర్గంలో సాచురేషన్ విధానంలో గృహ నిర్మాణం చేపట్టాలని ప్రత్యేకంగా ఆదేశించారు.

**పారిశ్రామిక టౌన్‌షిప్‌ల ఏర్పాటుకు ప్రణాళిక** రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలను పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో పారిశ్రామిక టౌన్‌షిప్‌లను నిర్మించే అంశంపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి గృహ నిర్మాణ శాఖను ఆదేశించారు. శ్రీసిటీ సహా ఇతర పారిశ్రామిక ప్రాంతాల్లో ఈ టౌన్‌షిప్‌ల ఏర్పాటు ద్వారా ఆర్థిక లావాదేవీలు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. ఇందుకోసం ఏపీ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ)తో సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. 2027 డిసెంబరు నాటికి మరో 75 వేల కొత్త గృహాలు మంజూరయ్యేలా, 1.5 లక్షల ఇళ్లను పైప్‌లైన్‌లో ఉంచేలా చూడాలని, ఇందుకు అవసరమైన నిధుల కోసం కేంద్ర గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి శాఖలతో సమన్వయం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.

## పాకిస్థాన్ ద్వంద్వ నీతి: అమెరికాతో శాంతి మంత్రం... ఇరాన్‌కు ఆయుధ సాయం!

అమెరికా-ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించేందుకు అంతర్జాతీయ వేదికలపై 'నిజాయితీ గల మధ్యవర్తి'గా వ్యవహరిస్తున్నట్లు చెప్పుకుంటున్న పాకిస్థాన్, తెరవెనుక అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందంటూ సంచలన ఆరోపణలు వెల్లువెత్తాయి. చైనా ఆయుధాలను ఇరాన్‌కు తరలించడంలో పాకిస్థాన్ రహస్యంగా సహకరిస్తోందని, ఇది ఆ దేశపు శాంతి ప్రయత్నాల చిత్తశుద్ధిని తీవ్రంగా దెబ్బతీస్తోందని ఒక నివేదిక వెల్లడించింది. కెనడాకు చెందిన 'జియోపొలిటికల్ మానిటర్' అనే సంస్థ విడుదల చేసిన నివేదిక ప్రకారం.. సుమారు 300 నుంచి 400 చైనా తయారీ వాయు రక్షణ వ్యవస్థలను (ఎయిర్-డిఫెన్స్ సిస్టమ్స్) పాకిస్థాన్ మీదుగా ఇరాన్‌కు తరలించారు. వీటి విలువ సుమారు 70 మిలియన్ డాలర్ల వరకు ఉంటుందని అంచనా. ఈ పరిణామం ఇరాన్ శాంతికి సిద్ధంగా లేదని, సుదీర్ఘ యుద్ధానికి కావాల్సిన ఆయుధ సంపత్తిని సమకూర్చుకుంటోందనడానికి నిదర్శనమని ఆ నివేదిక పేర్కొంది. ఒకవైపు శాంతి కోసం పిలుపునిస్తూనే, మరోవైపు ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని పెంపొందించేలా పాక్ వ్యవహరించడం దాని ద్వంద్వ వైఖరిని స్పష్టం చేస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. గతంలో ఇరాన్‌కు చెందిన సైనిక విమానాలకు తమ 'నూర్ ఖాన్' ఎయిర్‌బేస్‌లో ఆశ్రయం కల్పించిందన్న ఆరోపణలను పాకిస్థాన్ ఖండించింది. శాంతి చర్చల కోసం వచ్చిన దౌత్యవేత్తల కోసమే ఆ విమానాలు వచ్చాయని సమర్థించుకున్నప్పటికీ, ఆ వివరణపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# బీజేపీ రాజకీయాలకు బ్రిక్స్ పాఠం!

'లోకంలో బలవంతుడైనవాడు చెబితే అధర్మం కూడా ధర్మం అవుతుంది. అదే బలహీనుడు చెప్పే ధర్మం ఎంత గొప్పదైనా దాన్ని ఎవడూ అంగీకరించడు' అని మహాభారతంలో భీష్ముడు కురుసభలో ద్రౌపది వస్త్రాపహరణ ఘట్టంలో చెబుతాడు. 'పాండవులకు జరిగిన అవమానమే భవిష్యత్తులో కౌరవులకు వ్యతిరేకంగా ప్రత్యర్థులందర్నీ ఏకం చేస్తుంది' అని అదే సభలో విదురుడు హెచ్చరిస్తాడు. 'బలవంతుడి శక్తి కంటే భయంతో ఏకమైన బలహీనుల కూటమి శక్తిమంతమైనది' అని విదురుడు చెప్పినట్లుగానే పాంచాల, మత్స్య, యాదవ, మగధ, ఛేది, కాశీ, పాండ్య, చోళ, కేకయ తదితర రాజ్యాలన్నీ పాండవుల తరఫున ఏకం అవుతాయి. చాణక్యుడైనా, ఇటాలియన్ రాజనీతిజ్ఞుడు మాకియవెల్లి అయినా ఇంతకంటే భిన్నంగా ఏమీ ఆలోచించలేదు. న్యూఢిల్లీలో గతవారం ముగిసిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో మహాభారతంలోని దౌత్యనీతి ప్రస్ఫుటించింది. తాను అత్యంత బలవంతుడిననుకున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను వ్యక్తిగతంగా బ్రిక్స్ దేశాలు పైకి పల్లెత్తు మాట అనకుండానే ఆయనకు ఒక స్పష్టమైన సందేశాన్ని పంపించాయి. ఏక పక్ష దౌర్జన్య చర్యలు, వర్తకాన్ని దెబ్బతీసే టారిఫ్ లను న్యూఢిల్లీ డిక్లరేషన్ తీవ్రంగా ఖండించింది. బ్రిక్స్ వేదికపై విభిన్న ప్రయోజనాలను ఆశిస్తున్న అనేక దేశాలు ఏకమయ్యేందుకు అవసరమైన వాతావరణాన్ని ట్రంప్ అనాలోచితంగానే అందించారు. సంక్షుభిత ప్రజాస్వామ్య భారత్, నియంతృత్వ చైనా, రష్యా దేశాలు, అమెరికాతో సన్నిహిత భద్రతా సంబంధాలు ఉన్న గల్ఫ్ దేశాలు, అమెరికా దాడిని ఎదుర్కొంటున్న ఇరాన్.. ఇవన్నీ ఒక వ్యూహాత్మక ప్రాపంచిక దృక్పథాన్ని పంచుకునేందుకు అవకాశాన్ని ట్రంప్ కల్పించారు. అమెరికా అధ్యక్షుడి దూకుడు విధానాల వల్ల ఈ దేశాలన్నీ ఒత్తిడి ఎదుర్కోవడమే ఇందుకు కారణం. డాలర్ ఆధిపత్యాన్ని సవాల్ చేసే దేశాలపై అత్యధిక సుంకాలు విధిస్తామని ట్రంప్ హెచ్చరించినప్పటికీ బ్రిక్స్ దేశాలు ప్రత్యామ్నాయ చెల్లింపు విధానాలను వెతుక్కునేందుకు ఆయనే దోహదం చేశారు. వాణిజ్యం కోసం, స్థానిక జాతీయ కరెన్సీల వాడకాన్ని న్యూఢిల్లీ డిక్లరేషన్ సమర్థించింది. పాశ్చాత్య ఆర్థిక వ్యవస్థలపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు ఇది సభ్య దేశాలకు ఊతమిచ్చింది. భిన్న రాజకీయ వ్యవస్థలు, భద్రతా ప్రయోజనాలు కలిగిన కూటమి అయినప్పటికీ ఎలాంటి రణగొణ ధ్వనులు లేకుండా బ్రిక్స్ సమావేశంలో అత్యంత సమగ్రమైన, ప్రభావదాయక ఏకగ్రీవ డిక్లరేషన్‌ను విడుదల చేయగలగడమే ఆ దేశాల మధ్య ఏర్పడిన ఉమ్మడి అవగాహనకు నిదర్శనం. ప్రస్తుత అంతర్జాతీయ వ్యవస్థ ఏకపక్ష ఆర్థిక ఒత్తిళ్లకు గురవుతోందనే సాధారణ భావనే వీటన్నింటినీ ఒక తాటిపైకి తెచ్చింది. ఈ సదస్సుకు భారత్ నాయకత్వం వహించినందువల్ల సహజంగానే రెండు రోజుల పాటు జరిగిన సదస్సుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ కేంద్ర బిందువుగా నిలిచారు. భారత్ ప్రస్తుత పరిస్థితి కత్తి మీద సాము లాంటిది. పలు వైరుధ్యాలతో కూడిన సంబంధాలను ఏకకాలంలో సమన్వయం చేసేందుకు భారత్ ప్రయత్నించాల్సి వచ్చింది. చైనాతో సరిహద్దు ఘర్షణలు, ఆర్థిక ఆధిపత్యం నేపథ్యంలో ఆ దేశాధినేతతో సుహృద్భావ వాతావరణంలో చర్చించడం, రష్యాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొనసాగించడం, సంక్షుభిత పశ్చిమాసియాలో ఇరాన్‌తో చర్చలు జరపడం, అభివృద్ధి చెందిన దేశాల గళంగా, గ్లోబల్ సౌత్ నేతగా అవతరించేందుకు ప్రయత్నించడం ఇందులో ముఖ్యమైనవి. అంతేకాదు, రష్యాతో రక్షణ, ఇంధన రంగ సహకారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోబోమని భారత్ స్పష్టం చేసింది. పాశ్చాత్య కూటములతో చేతులు కలుపుతూనే, సంప్రదాయ మిత్రులను విస్మరించబోమనే వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని ప్రకటించింది. అదే సమయంలో, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ న్యూఢిల్లీ సదస్సులో ఒక సున్నితమైన దౌత్య వ్యూహాన్ని అవలంబించారు. పశ్చిమ దేశాలను తిరస్కరించడం పూర్తిగా తమ వ్యూహం కాదని, ఆ దేశాలతో సంబంధాలు కొనసాగిస్తూనే అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాలను ఏకకాలంలో కాపాడుకోవాలన్నదే భారత్ వైఖరి అని ఆయన స్పష్టం చేశారు. అమెరికా ఒత్తిడి, చైనా ఆధిపత్యం మధ్య భారత్ తనను తాను ఒక ఆచరణాత్మక ప్రత్యామ్నాయంగా ప్రదర్శించుకోవడానికి ప్రయత్నించింది. అదే సమయంలో వాషింగ్టన్ ఎంత గట్టిగా ఒత్తిడి తెచ్చినా, దానిపై ఆధారపడకుండా యంత్రాంగాలను అభివృద్ధి చేయగలమని చెప్పగలగడమే ఈ బ్రిక్స్ సమావేశాల ప్రత్యేకత. చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ ఈ సదస్సులో చేసిన ప్రసంగం అత్యంత శక్తిమంతమైనది. 'నియమాలు లేని ప్రపంచం అంటే ట్రాఫిక్ సిగ్నల్స్ లేని కూడలి వంటిది. అంతర్జాతీయ నియమాలను అన్ని దేశాల భాగస్వామ్యంతోనే, అందరికీ ఒకే విధంగా ఉండేలా రూపొందించాలి. బలవంతుడిదే న్యాయం అనే సిద్ధాంతానికి అంతర్జాతీయ వ్యవహారాల్లో ఎలాంటి స్థానం ఉండకూడదు. ప్రపంచ దక్షిణ దేశాలు అంతర్జాతీయ వ్యవహారాల్లో చట్టబద్ధ పాలనను (రూల్ ఆఫ్ లా) సమష్టిగా పరిరక్షించాలి' అని జిన్ పింగ్ అన్నారు. బహుళ ధ్రువ ప్రపంచం అనే దాన్ని ఎవరూ మార్చలేరని, ప్రపంచాన్ని తమకోసం సుందరవనంగా, ఇతరులకు కీకారణ్యాలుగా మార్చేందుకు చేసే ప్రయత్నాలు చెల్లవని రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. జారిపోతున్న తమ నాయకత్వాన్ని కాపాడుకోవడానికి పాత నేతలు కొందరు ఆంక్షలు, అడ్డంకులు సృష్టిస్తున్నారని, కానీ ఇవి ప్రత్యామ్నాయ, స్వతంత్ర వాణిజ్య మార్గాలను వేగవంతం చేస్తున్నాయని ఆయన అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగంలోనూ బలమైన వ్యాఖ్యలు లేకపోలేదు. 'మనం నిబంధనలను పాటించేవారిగా (రూల్‌టేకర్స్) కాకుండా, నిబంధనలను నిర్దేశించేవారిగా (రూల్‌షేపర్స్) ఎదగాల్సిన అవసరం ఉంది' అని మోదీ చెప్పారు. టెక్నాలజీని, కీలక ఖనిజాలను ఆయుధాలుగా వాడుకోవద్దని ఆయన హెచ్చరించారు.బ్రిక్స్ సదస్సులో అన్నిటికన్నా ముఖ్యమైనది ప్రధానమంత్రి నరేంద్రమోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ మధ్య దాదాపు 45 నిమిషాల పాటు ద్వైపాక్షిక సమావేశం. వ్యూహాత్మక భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ పరస్పర ఆర్థిక ప్రయోజనాలకోసం పనిచేసేందుకు వారు సిద్ధంగా ఉన్నారన్న సంకేతాలు వెలువడ్డాయి. గల్వాన్ ఘర్షణల చేదు జ్ఞాపకాలను మరిచి, వాస్తవాధీన రేఖ వద్ద శాంతిని నెలకొల్పేందుకు, ఆర్థిక, దౌత్య మార్గాలను పునరుద్ధరించేందుకు భారత్ సుముఖత చూపింది. ఈ ఘట్టం ఏ పరిణామాల్ని సూచిస్తోంది? చైనాతో కొన్ని దశాబ్దాలుగా నెలకొన్న శత్రుత్వ వాతావరణం మారనుందా? భారత్‌చైనా సంబంధాల పునరుద్ధరణ అనేది దౌత్యపరమైన విజయానికంటే వ్యూహాత్మక రాజీని సూచిస్తోందా? అని కాంగ్రెస్ పార్టీ ప్రశ్నించింది. రాజీ అనడం కన్నా ప్రస్తుత అల్లకల్లోల అంతర్జాతీయ వాతావరణంలో అదొక చారిత్రక అవసరం కూడా కావచ్చని మరికొందరు భావిస్తున్నారు. ఈ సమావేశంలో భారత్, చైనాల మధ్య అత్యంత ముఖ్యమైన ఏకాభిప్రాయం ఏర్పడిందని, వ్యూహాత్మక, దీర్ఘకాలిక, దిశానిర్దేశం చేసే అంశాలపై ఇరువురు నేతలు స్పష్టమైన, లోతైన చర్చలు జరిపారని చైనా విదేశాంగ మంత్రి, కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వాంగ్ యీ అనడం విస్మరించదగిన విషయం కాదు. బ్రిక్స్ సమావేశాలు మారుతున్న ప్రపంచ వ్యవస్థను, అంతర్జాతీయ సంబంధాల మార్పును సూచిస్తున్నాయని అమెరికన్ మీడియా వ్యాఖ్యానించింది. అమెరికాతో ఉద్రిక్తతలు ఉన్న ఇరాన్‌కు బ్రిక్స్‌లో ప్రముఖ స్థానం లభించడం గ్లోబల్ ఆర్డర్‌లో మారుతున్న సమీకరణాలకు అద్దం పడుతోందని అమెరికా పత్రికలు ప్రత్యేకంగా విశ్లేషించాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరించిన సుంకాల విధానాలే అంతర్గతంగా గణనీయమైన భేదాభిప్రాయాలు ఉన్న దేశాలను ఒకచోటకు చేర్చే అనుసంధానంగా (బైండింగ్ ఏజెంట్) పనిచేశాయని అమెరికన్ మీడియా భావించింది. నిశితంగా విశ్లేషించాలంటే అమెరికాయే బ్రిక్స్‌కు సానుకూల పవనాలను (టెయిల్ విండ్) సృష్టించింది. వాషింగ్టన్ విధానాలు, అంతర్జాతీయ సంబంధాలు శాశ్వతంగా ఇలాగే ఉంటాయని చెప్పలేం. బహుళ ధ్రువ ప్రపంచంగా మారేందుకు, భద్రతా మండలి, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు తీరుతెన్నుల్లో మార్పులు ఏర్పడేందుకు సమయం ఆసన్నమైందని, లేకపోతే బ్రిక్స్ మరింత బలమైన ప్రత్యామ్నాయ వ్యవస్థగా మారుతుందని చెప్పేందుకు ఆస్కారం ఏర్పడింది.

దేశ రాజకీయాల్లో కూడా తమ వ్యవహారశైలే ప్రత్యర్థుల బలాబలాలను నిర్ణయిస్తుందని బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో పాలక పక్షం నేతలు గ్రహించాల్సిన అవసరం ఉన్నది. ట్రంప్ ధాటితో పలు దేశాలు ఏకమైనట్లు గడచిన కొన్ని సంవత్సరాలుగా ప్రధానమంత్రి మోదీ, ఆయన కుడిభుజం అమిత్ షా ధాటికి తట్టుకోలేక ప్రత్యర్థి శక్తులన్నీ ఏకమయ్యేందుకు ప్రయత్నిస్తున్నాయి. తాజాగా ఉమ్మడి పౌరస్మృతిపై ఎన్డీఏ మిత్రపక్షాలు కూడా అసమ్మతి ప్రకటిస్తున్నాయి. తన 25 సంవత్సరాల పాలన పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని తన పుట్టిన రోజు సెప్టెంబర్ 17 నుంచి సేవా సంకల్ప్ అభియాన్ జరుపుకోవాలని ఎన్డీఏ పార్టీలను నిర్దేశిస్తున్న మోదీ వైఖరిలో బ్రిక్స్ అనుభవం తర్వాతనైనా మార్పు వస్తుందా? చెప్పలేం.

# యుద్ధంతో శాంతి అసాధ్యం!



"కేశవా! నాకు అపశకునములు కనిపిస్తున్నాయి. యుద్ధంలో స్వజన సమూహాన్ని సంహరించడం వల్ల శ్రేయస్సు కలుగుతుందని నాకు అనిపించడం లేదు. విజయం, రాజ్యం, సుఖాలు నాకు అవసరం లేదు. ఈ భోగాలు, ఈ జీవితం వల్ల ప్రయోజనం ఏమిటి?"ఐదు వేల ఏళ్ల క్రితం అర్జునుని హృదయంలో కలిగిన ఆవేదన, కరుణ, మానవత్వ భావనలు నేటికీ వర్తిస్తాయి. యుద్ధం వల్ల కలిగే వినాశనాన్ని అతడు ముందుగానే ఊహించాడు. ఇరుపక్షాల వారినీ స్వజనులుగానే భావించాడు. మరి నేడు? చరిత్రను పరిశీలిస్తే, యుద్ధాలు మానవాళికి అపారమైన నష్టాన్ని మిగిల్చాయి. మొదటి ప్రపంచ యుద్ధంలో కోట్లాది మంది సైనికులు, ప్రజలు మరణించారు. రెండో ప్రపంచ యుద్ధంలో అణుశక్తి, సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో మరింత భయంకరమైన విధ్వంసం జరిగింది. దాదాపు ఎనిమిది కోట్ల మంది ప్రాణ నష్టం, లక్షల కోట్ల ధన నష్టం జరిగింది. దేశాల ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలాయి. అయినా, ప్రపంచానికి శాశ్వత శాంతి లభించలేదు.లీగ్ ఆఫ్ నేషన్స్, ఐక్యరాజ్యసమితి, భద్రతా మండలి వంటి సంస్థలు ఏర్పడినా ప్రపంచంలో యుద్ధాలు ఆగలేదు. సామ్రాజ్యవాదం, ఆర్థిక ఆధిపత్యం, మతపరమైన విద్వేషాలు, పరోక్ష యుద్ధాలు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. రెండు ప్రపంచ యుద్ధాల అనంతరం కొరియా, వియత్నాం యుద్ధాలు కూడా లక్షలాది ప్రాణాలను బలి తీసుకున్నాయి. పాలస్తీనాఇజ్రాయెల్ ఘర్షణలు, ఉక్రెయిన్ యుద్ధం వంటి సంఘటనలు ప్రపంచాన్ని అశాంతి వైపు నెడుతున్నాయి. గతం నుంచి పాఠాలు నేర్చుకోవడంలో మానవజాతి విఫలమవుతోంది.

కళింగ యుద్ధానంతరం పశ్చాత్తాపం చెందిన అశోకుడు.. ప్రజల సంక్షేమం, శాంతి, అభివృద్ధి కోసం కృషి చేశాడు. ప్రస్తుతం ప్రపంచంలో అలాంటి పరివర్తన ఎంతవరకు కనిపిస్తోంది?! వసుధైవ కుటుంబకంలో ప్రపంచమంతా ఒక కుటుంబమే. అయినప్పటికీ, ఆధిపత్య ధోరణులు, ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే శక్తులు, మతపరమైన ద్వేషాన్ని రెచ్చగొట్టే వర్గాలు యుద్ధానంతర సమాజ దుస్థితిని మరిచిపోతున్నాయి.అణ్వాయుధాలు, ఖండాంతర క్షిపణులు, అపారమైన ఆయుధ సంపత్తి శాంతిని తీసుకురాలేవు. అదే సంపదను పేదరికం, ఆకలి, వైద్యం, విద్య కోసం వినియోగిస్తే ప్రపంచం మరింత సంతోషంగా మారుతుంది. యెమెన్, సూడాన్, అఫ్ఘానిస్థాన్ వంటి దేశాల్లో ప్రజలు నేటికీ ఆకలి, నిరాశ్రయం, అనారోగ్యంతో బాధపడుతున్నారు. మానవాళిపై దయ, ప్రేమ, సహానుభూతి పెరిగినప్పుడే సుస్థిర శాంతి సాధ్యమవుతుంది. శాంతి చర్చలు కేవలం రాజకీయ ప్రయోజనాలకే పరిమితం కాకుండా మానవ సంక్షేమానికి దారి తీయాలి. ప్రపంచ శాంతి స్థాపనలో భారతదేశం తన సాంస్కృతిక వారసత్వం, అహింసా సిద్ధాంతం, "వసుధైవ కుటుంబకం" భావనల ద్వారా మార్గదర్శకత్వం వహించగలదని ఆశిద్దాం.

# షామీరీయ మసీదు వద్ద బుగ్గ వంక మీద నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణంలో ఆలస్యాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన

2024 అసెంబ్లీ ఎన్నికల హామీ మేరకు, ప్రజల సౌకర్యార్థం స్థానిక ఎమ్మెల్యే మాధవి రెడ్డి జోక్యం చేసుకొని బ్రిడ్జిని త్వరగా పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవాలి.బండి జకరయ్య, కాంగ్రెస్ పార్టీ కడప అసెంబ్లీ కోఆర్డినేటర్.జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి ఎన్ . డి. విజయ జ్యోతి గారి ఆదేశాల మేరకు, 41 వ డివిజన్ బాధ్యులు హమీద్ గారి ఆధ్వర్యంలో, కడప అసెంబ్లీ కోఆర్డినేటర్బండి జకరయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మంగళవారం కడప నగరంలోని షామీరీయ మసీదు సమీపంలో బుగ్గ వంక మీద నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణంలో ఆలస్యాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో 2004-09, కాంగ్రెస్ పార్టీ హయాంలో నగరంలో ఐదు బ్రిడ్జిలు నిర్మించారన్నారు. అందులో ఎస్ వి డిగ్రీ కాలేజ్ దగ్గర, రైతు బజార్ దగ్గర రెండు బ్రిడ్జిలు, మురళి హాలు దగ్గర ఒక బ్రిడ్జి, మోచంపేటలో ఒక బ్రిడ్జి, అల్మాస్ పేటలో ఒక బ్రిడ్జి నిర్మించారని గుర్తు చేశారు. ప్రస్తుతం రవీంద్ర నగర్ లో సమీపంలో షామీర్య మసీదు వద్ద బ్రిడ్జి నిర్మాణానికి కూటమి ప్రభుత్వం నానా కష్టాలు పడుతుందన్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ గతంలో రిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం, నూతన కలెక్టర్ ఆఫీస్ నిర్మాణం, ఎయిర్పోర్ట్ అభివృద్ధికి చర్యలు, యోగి వేమన యూనివర్సిటీ అభివృద్ధి, విశాలమైన రోడ్లు వెడల్పు, ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్, రాష్ట్ర అతిథి గృహం, డెంటల్ కాలేజ్, క్రీడా పాఠశాల, కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ స్కూల్, జిల్లా పరిషత్ నూతన భవన నిర్మాణం, కడప మున్సిపల్ కార్పొరేషన్ నూతన భవన నిర్మాణం మొదలైనవి కాంగ్రెస్ హయాంలో జరిగిన గుర్తు చేశారు. ప్రభుత్వం, గత వైయస్సార్ ప్రభుత్వం ఏమి చేసిందో ప్రజలకు తెలపాలని ఎద్దేవా చేశారు. కాబట్టి ప్రజలు వాస్తవాలు గమనించి కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని సూచించారు. అదేవిధంగా షామీర్య బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయుటకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అబ్దుల్




సత్తార్, పిసిసి మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమాల్ భాష, డిసిసి ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్, డిసిసి ప్రధాన కార్యదర్శి సుధాకర్, డిసిసి కార్యదర్శి అభూతలహ, సమీవుల్లా, జిల్లా అధ్యక్షులు ఆసిఫ్ అలీ ఖాన్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్ రౌఫ్, మహమ్మద్ భాష, మక్బూల్, హైదర్ వలీ, రఫీఖ్ ఖాన్ (ఎన్నారై), షేక్ మహబూబ్ బాషా, దినకర్, టి.సి. రాయుడు, రెడ్డి బాబు, కటిక జిలాన్ భాష, అక్బర్ బాషా, ప్రభు కుమార్, వన్నూరప్ప, చక్రి, నిఖిలేష్, పవన్, మైలు, సుబ్బరాయుడు, జగదీష్, వెంగ, అచ్చి, శీను, బబ్లు తదితరులు పాల్గొన్నారు.

# ఏకగ్రీవాల పేరుతో ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చెయ్యాలని చూస్తే కాంగ్రెస్ చూస్తూ ఊరుకోదు




**కడప మేయర్ కాంగ్రెస్‌దే 66 డివిజన్లలో 35 డివిజన్లను కాంగ్రెస్ గెలుస్తుంది**

**సయ్యద్ గౌస్ పీర్, కడప నగర కాంగ్రెస్ అధ్యక్షులు**

కడప నగరంలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా నిర్వహించా ల్సిందేనని కడప నగర కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ గౌస్ పీర్ స్పష్టం చేశారు. ఈరోజు టీడీపీ మాజీ జిల్లా అధ్యక్షులు వాసు గారికి, వైసీపీ మాజీ డిప్యూటీ సీఎం ఎస్.బి. అంజాద్ బాషా గారికి ఒక విషయాన్ని స్పష్టంగా హెచ్చరించానని ఆయన తెలిపారు. “మేము ఏకగ్రీవాలు చేస్తాం” అంటూ టీడీపీ, వైసీపీ నాయకులు ఒకరిపై ఒకరు సవాళ్లు చేసుకుంటున్నారని, అయితే ఎన్నికలు ఏకగ్రీవాల కోసం కాదని, ప్రజలు తమ ఓటు హక్కుతో తమ ప్రతినిధులను ఎన్నుకోవడం కోసం అని గౌస్ పీర్ అన్నారు. కడప నగరంలో కాంగ్రెస్ పార్టీ ఉన్నంతకాలం ప్రజల ఓటు హక్కును కాలరాసే విధంగా ఏకగ్రీవాలు చేసుకోవడానికి ఎవరినీ అనుమతించబోమని ఆయన స్పష్టం చేశారు. “ఎన్నికలు ప్రజల ద్వారా, ఓటు ద్వారా, రాజ్యాంగం ప్రకారం జరగాలి. ప్రజలకు తమ నాయకులను ఎన్నుకునే హక్కు ఉండాలి. ఆ హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ చివరి వరకు పోరాడుతుంది. అవసరమైతే రాజ్యాంగబద్ధంగా, న్యాయపరంగా కూడా పోరాడి ఎన్నికలు జరిగేలా చేస్తాం.” అని గౌస్ పీర్ తెలిపారు. కడప నగర మేయర్ పదవిపై కూడా గౌస్ పీర్ ధీమా వ్యక్తం చేశారు. “కడప మేయర్ కాంగ్రెస్‌దే. 66 డివిజన్లలో 35 డివిజన్లను కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా గెలుచుకుంటుంది. మిగిలిన 31 డివిజన్లలో టీడీపీ, వైసీపీలు ఎవరు ఎంత గెలుస్తారో వారు చూసుకోవాలి. కానీ ప్రజల ఓటుతో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజల తీర్పుతో మేయర్ స్థానాన్ని సాధిస్తుంది.” అని ఆయన అన్నారు.ఏకగ్రీవాల పేరుతో ప్రజలకు ఎన్నికల హక్కును దూరం చేయాలని ఎవరైనా ప్రయత్నిస్తే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని ఆయన హెచ్చరించారు.“ప్రజల తరఫున కాంగ్రెస్ నిలబడుతుంది. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ఓటు హక్కు కోసం ఎంతటి పోరాటానికైనా కాంగ్రెస్ సిద్ధంగా ఉంది. ప్రాణాలు పోయినా ప్రజల ఓటు హక్కు కోసం వెనక్కి తగ్గేది లేదు.” అని గౌస్ పీర్ స్పష్టం చేశారు.కడప ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకుని, తమకు నచ్చిన నాయకులను ఎన్నుకునే అవకాశం పొందే వరకు కాంగ్రెస్ పార్టీ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో నగర ఉపాధ్యక్షులు సౌదాగర్ సాదిక్, ఫజరుల్లా, యూత్ కాంగ్రెస్ నాయకులు సిద్ధిక్, డివిజన్ ఇంచార్జిలు షేక్ అన్వర్, మహబూబ్ బాషా, సయ్యద్ అన్వర్, గఫార్, హాజీ, మురాద్ భాష, సుబ్రహ్మణ్యం తదితరులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# వ్యతిరేకంగా వ్యవహరిస్తే మీసేవా బ్రాంచ్ లను రద్దు చేస్తాం

**ఉమ్మడి రాష్ట్రాల ప్రాజెక్టు మేనేజర్ సత్యనారాయణ**



**బండి ఆత్మకూరు నంది పత్రిక సెప్టెంబర్ 15 :** ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే మీసేవ బ్రాంచ్లను రద్దు చేస్తామని మీసేవా ఉమ్మడి రాష్ట్రాల ప్రాజెక్టు మేనేజర్ ఎన్ వి సత్యనారాయణ హెచ్చరించారు. మంగళవారం బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఏ కోడూరు, బండి ఆత్మకూరు లోని రెండు మీసేవ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. మీసేవ కేంద్రాలలో సర్వీసులకు సంబంధించి ధరల పట్టికలు రికార్డులను మీసేవ ఫీడ్ బ్యాక్ బార్ కోడ్ ను పరిశీలించారు. మీసేవ కేంద్రాలలో సర్వీసులను ప్రజలకు వేగవంతంగా అందజేయాలని సూచించారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ప్రభుత్వం నిర్దేశించిన ప్రభుత్వ ఫీజులను నిర్ణయించిన ధరలకు మాత్రమే వసూలు చేయాలని అన్నారు. ఆదాయ కుల నివాస ధ్రువీకరణ పత్రాలు వన్ బి అడంగల్ జనన మరణ పత్రాలు, కొత్త పాన్ కార్డులు ఈ డబ్ల్యూ ఎస్, లకు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ఫీజులు వసూలు చేయాలన్నారు. ఫీజులు వసూలు సమయంలో ప్రజలకు కచ్చితంగా రసీదు ఇవ్వాలని అన్నారు. సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పేర్కొన్నారు. అధిక ఫీజులు వసూలు చేసి ప్రజలను దోచుకునేలా వ్యవహరిస్తే మీసేవ కేంద్రాల బ్రాంచ్లను రద్దు చేస్తామని హెచ్చరించారు. మీసేవ కేంద్రాలకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణను కూడా వారు సేకరించారు. ఆయన వెంట కర్నూలు జిల్లా మేనేజర్ మహమ్మద్ రఫీ, నంద్యాల జిల్లా మేనేజర్ చెన్నయ్య, మీసేవ కేంద్రాల మండల ఉపాధ్యక్షుడు షౌకత్ అలీ రఫీ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఎం సి ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్

**బండి ఆత్మకూరు నంది పత్రిక సెప్టెంబర్ 15:** బండి ఆత్మకూరు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ల పునర్వ్యవస్థీకరణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని మండల విద్యాశాఖ అధికారి యశోద పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు మంగళవారం నోటిఫికేషన్ జారీ అయిందని పేర్కొన్నారు. ఈనెల 18న ఓటర్ల జాబితా ప్రదర్శన, చెప్పే మరి 25న ఓటరు జాబితా ఖరారు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 29న ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు షెడ్యూల్ ప్రకారము అందరూ తల్లిదండ్రులకు తెలియజేసి స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలను పారదర్శకంగా నిబంధన ప్రకారం నిర్వహించి ఎన్నికైన సభ్యుల జాబితా ఈనెల 30 లోపున ప్రకటించాలని, మండల విద్యాశాఖ అధికారులు యశోద,మోహన్ రెడ్డి తెలిపారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల నమోదు గడువును ఈ నెలాఖరు వరకు పొడిగించాలి

**అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలి సిపిఐ**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకంలో నూతన పెన్షన్ల నమోదుకు ఇచ్చిన గడువును ఈ నెలాఖరు వరకు పొడిగించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) పత్తికొండ పట్టణ సమితి డిమాండ్ చేసింది. సిపిఐ పత్తికొండ పట్టణ కార్యదర్శి ఎన్. రామాంజనేయులు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు సురేంద్ర కుమార్ ఆధ్వర్యంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఇన్‌చార్జి) కి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నూతన పెన్షన్ల నమోదుకు ఈ నెల 16వ తేదీ వరకు గడువు విధించడం వల్ల అర్హులైన అనేక మంది పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకంలో నూతనంగా నమోదు చేసుకునే వృద్ధులు, వితంతువులు, చర్మకారులు, డప్పు కళాకారులు తదితర అర్హులైన లబ్ధిదారులు అవసరమైన కుల, ఆదాయ మరియు ఇతర ధ్రువీకరణ పత్రాలను సమకూర్చుకోవడానికి తగిన సమయం లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇటీవల వరుస సెలవులు రావడం, రెండవ శనివారం, ఆదివారం, సోమవారం మరియు చవితి చవితి కారణంగా ప్రభుత్వ కార్యాలయాలు, సంబంధిత సేవలు అందుబాటులో లేకపోవడంతో అనేక మంది అర్హులు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోలేకపోయే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 50 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హుడైన పేదవారికి పెన్షన్ అందించే హామీని అమలు చేయాలని సిపిఐ డిమాండ్ చేసింది.అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎటువంటి రాజకీయ జోక్యం లేకుండా పారదర్శకంగా పెన్షన్ ప్రక్రియను అమలు చేయాలని, అవినీతికి తావులేకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు.అలాగే, నూతన పెన్షన్ల నమోదుకు ఈ నెలాఖరు వరకు గడువు పొడిగించి, పెన్షన్‌కు అర్హులైన ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, అధికారులు స్పందించని పక్షంలో అర్హులైన పెన్షన్ లబ్ధిదారులను సమీకరించి సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి ఎం.కె. సుంకన్న, ప్రజాసంఘాల నాయకులు పెద్దయ్య, చిన్నాముని, జయరాముడు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన యస్.పి ”

**కడప బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 15 నంది పత్రిక**

కడప జిల్లాకు నూతనంగా నియమితులై బాధ్యతలు స్వీకరించిన జిల్లా ప్రధాన మరియు సెషన్స్ న్యాయమూర్తిని జి .రామ గోపాల్ ను, కడప జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు షెల్కే నచికేత్ విశ్వనాథ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తదితర అంశాలపై పరస్పరం చర్చించారు.

# రెండు నెలల లోపు సమస్యను పరిష్కరిస్తాం

**మున్సిపల్ కమిషనర్ పి కిశోర్**




**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 15 నంది పత్రిక** ఆళ్లగడ్డ మున్సిపాలిటీ వద్ద గోవుల సంరక్షణ గురించి గత మూడు రోజులుగా నిరసన దీక్ష చేపట్టిన జంతు సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సామాజిక కార్యకర్త ఈపనగండ్ల శ్రీనివాసులు మంగళవారం తమ దీక్షను విరమించారు. మున్సిపల్ కమిషనర్ పి కిశోర్ ఆయనకు పండ్ల రసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు.రెండు నెలల్లోపు గోమాతల సమస్యను పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇవ్వడంతో శ్రీనివాసులు దీక్షను విరమించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఆనంద్, శానిటరీ ఇన్స్పెక్టర్ బాలస్వామి బిల్ కలెక్టర్ యేసురత్నం తదితరులు పాల్గొన్నారు

## నగరపాలక సంస్థలో ఘనంగా చవితి వేడుకలు.



**తిరుపతి బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 15 నంది పత్రిక** తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయక ప్రతిమకు కమిషనర్ ఎం.జయకృష్ణ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలకు అధిపతి అయినా గణనాదుడి ఆశీస్సులతో అందరి జీవితాలు చల్లగా ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. అందరికీ స్వామివారి ప్రసాదాలు పంపిణీ చేశారు. వినాయక చవితి వేడుకల్లో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, మేనేజర్ హాసిమ్, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# వినాయక సాగర్లో నిమజ్జనానికి ఏర్పాట్లు పక్కాగా చేపట్టండి.

**ఏర్పాట్లు పరిశీలించిన కమిషనర్ ఎం.జయకృష్ణ.**



**తిరుపతి బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 15 నంది పత్రిక** వినాయక సాగర్ లో జరగనున్న నిమజ్జనానికి కావలసిన అన్ని ఏర్పాట్లను పక్కాగా చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ అధికారులకు ఆదేశించారు. వినాయక విగ్రహాల నిమజ్జనానికి వినాయక సాగర్ లో జరుగుతున్న ఏర్పాట్లను సోమవారం రాత్రి కమిషనర్ పరిశీలించారు. మొదటి రోజు నిమజ్జనానికి వచ్చిన విగ్రహాల నిమజ్జనం ను పరిశీలించారు. నిమజ్జనానికి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లను జాగ్రత్తగా చేయాలని తెలిపారు. పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. విగ్రహాలను తీసుకు వచ్చే మార్గాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఎక్కడికక్కడ తగు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సాగర్లో నీటిలో చెత్త లేకుండా ఎప్పటికప్పుడు తొలగించి శుభ్రంగా ఉంచాలని తెలిపారు. తెప్పలపైన గజ ఈతగాళ్ళను ఉంచి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. విగ్రహాల నిమజ్జనానికి వినియోగించే క్రేన్ల కండిషన్ ను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని అధికారులకు సూచించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని తెలిపారు. మూడవ రోజు మరిన్ని ఎక్కువ విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నందున మరింత అప్రమతంగా ఉండాలని అధికారులకు సూచించారు. కమిషనర్ వెంట టీటిడి బోర్డు సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, డి.ఈ. రమణ, నిమజ్జన కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, సభ్యులు ఆర్. సి. మునికృష్ణ, గుండాల గోపి, తదితరులు ఉన్నారు.



# బాల సంజీవని టెండర్లలో అవకతవకలు, నిబంధనల ఉల్లంఘనలపై సమగ్ర విచారణ జరిపించాలి ఏఐవైఎఫ్

**కర్నూల్ సిటీ నంది పత్రిక** బాల సంజీవని టెండర్లలో అవకతవకలపై డిఆర్ఓ సి వెంకటనారాయణమ్మ కి ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు బాల సంజీవని, బాల సంజీవని ట్రైబల్ పథకాలను అమలు చేస్తోంది. రాష్ట్రంలోని 26 జిల్లాలను నాలుగు యూనిట్లుగా విభజించి నిర్వహించిన తాజా టెండర్లలో పారదర్శకత, పోటీ, నిబంధనల అమలుపై అనేక అనుమానాలు, ఫిర్యాదులు వెలువడుతున్నాయి. టెండర్లలో స్థానిక మహిళా స్వయం సహాయక సంఘాలు, చిన్నమధ్య తరహా పరిశ్రమలకు అవకాశం లేకుండా, 5,583 డెలివరీ పాయింట్ల వంటి అర్హతలను విధించడం ద్వారా కొద్దిమంది పెద్ద సంస్థలకే ప్రయోజనం కలిగేలా నిబంధనలు రూపొందించారనే ఆరోపణలు ఉన్నాయి. పోషణ పథకాలలో యస్ హెచ్ జి ల భాగస్వామ్యానికి ఉన్న విధానపరమైన ప్రాధాన్యతను ప్రభుత్వం విస్మరించకూడదు.టెండర్‌లో సొంత తయారీ యూనిట్, ఫుడ్ సేఫ్టీ లైసెన్స్, ఉత్పత్తి సామర్థ్యం వంటి అర్హతలు ఉన్నప్పటికీ, సొంత తయారీ యూనిట్లు లేని కేంద్రీయ భండార్, యన్ సీ సీ యఫ్ వంటి సంస్థలకు ఏ ప్రాతిపదికన అర్హత కల్పించారో ప్రభుత్వం స్పష్టం చేయాలని గతంలో ఇదే కారణాలతో అనర్హతకు గురైన సంస్థలు ఇప్పుడు ఎలా అర్హత సాధించాయో ప్రజలకు వివరించాలి అన్నారు అదేవిధంగా సాధారణ కిట్ ధర రూ.241 నుంచి రూ.283.19కు, ట్రైబల్ కిట్ ధర రూ.350 నుంచి రూ.446కు పెరిగినట్లు ఉన్న నేపథ్యంలో, ధరల పెరుగుదలకు సంబంధించిన పూర్తి కాస్ట్ షీట్ , టెక్నికల్ /ఫైనాన్సియల్ ఇవాల్యుయేషన్ వివరాలను బహిర్గతం చేయడంతో పాటు పలువురు బిడ్డర్లు ఒకే ధరను కోట్ చేసినట్లయితే, పోటీ నిజంగా జరిగిందా లేదా సిండికేషన్ జరిగిందా అనే అంశంపై ఈ -ప్రొకర్మెంట్ రికార్డులతో సహా విచారణ జరిపి ప్రస్తుత బాల సంజీవని టెండర్లపై స్వతంత్ర సమగ్ర విచారణ,నిబంధనలకు విరుద్ధంగా అర్హత పొందిన సంస్థల కాంట్రాక్టులను రద్దు చేసితయారీ యూనిట్, ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ తదితర అర్హతలను అందరికీ సమానంగా అమలు చేయాలి.జోన్ విధానాన్ని రద్దు/పునఃపరిశీలించి జిల్లాల వారీగా టెండర్లు నిర్వహించాలి.మహిళా యస్ హెచ్ జి లు, స్థానిక చిన్నమధ్య తరహా పరిశ్రమలకు సమాన అవకాశం కల్పించాలి. రూ.283.19, రూ.446 ధరల పెరుగుదలకు పూర్తి ఆధారాలను వెల్లడించి, అవసరమైతే రీ-టెండర్ నిర్వహించాలి.టెండర్‌లో కుమ్మక్కు, నిబంధనల ఉల్లంఘన లేదా ప్రజాధనానికి నష్టం జరిగినట్లు తేలితే బాధ్యులైన అధికారులు, కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి.పౌష్టికాహార కిట్ల నాణ్యతను బ్యాచ్ వారీగా పరీక్షించి, నివేదికలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి.బాలల పౌష్టికాహారం కొద్దిమంది కాంట్రాక్టర్ల లాభాల కోసం కాకుండా, పారదర్శకంగా, నాణ్యతతో, స్థానిక మహిళా సంఘాల భాగస్వామ్యంతో అమలు కావాలి.కావున ప్రజాధనం మరియు బాలల పౌష్టికాహార ప్రయోజనాలను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు బి నాగరాజు, నగర నాయకులు శివ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు




## వెలుగోడులో వినాయక నిమజ్జన ఘాట్‌ను పరిశీలించిన జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్



**వెలుగోడు, సెప్టెంబర్ 15 (నంది పత్రిక)**:వెలుగోడు మండలంలో వినాయక నిమజ్జనం కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జరిగేలా పటిష్ట భద్రతా చర్యలు చేపడుతున్నట్లు నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ తెలిపారు. మంగళవారం ఆయన వెలుగోడు మండల పరిధిలోని వినాయక నిమజ్జన ఘాట్‌ను, విగ్రహాల ఊరేగింపు జరిగే ప్రధాన మార్గాలను స్వయంగా సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా నిమజ్జన ఘాట్ వద్ద చేపట్టిన లైటింగ్, రక్షణ చర్యలు, వాహనాల రాకపోకల నియంత్రణ మరియు బందోబస్తు వివరాలను స్థానిక పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

**ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఆదేశాలు & సూచనలు:**

**నిరంతర నిఘా**: నిమజ్జనం ముగిసే వరకు ఘాట్ వద్ద పోలీస్ సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ రద్దీని క్రమబద్ధీకరించాలని ఆదేశించారు.

**భక్తుల భద్రత:** ఘాట్ వద్దకు వచ్చే భక్తులకు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని సూచించారు.

**నిబంధనల నిర్వహణ:** ఉత్సవ కమిటీ నిర్వాహకులు, ప్రజలు పోలీస్ శాఖ సూచించిన భద్రతా నిబంధనలను పాటిస్తూ, పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు ఆత్మకూరు డిఎస్పి రామంజి నాయక్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ అశోక్, వెలుగోడు ఎస్సై బి సురేష్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతుల అభివృద్ధి - సమృద్ధి ఆంధ్రప్రదేశే లక్ష్యం: ఏ ఓ. స్వాతి



**వెలుగోడు, సెప్టెంబర్ 15 (నంది పత్రిక)**:నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతీ ఒక్క రైతు సమతుల్య పోషక యాజమాన్యాన్ని పాటించాలని వెలుగోడు మండల వ్యవసాయాధికారి ఎస్. స్వాతి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని రేగడ గూడూరు, వేల్పనూరు గ్రామాలలో "మిషన్ ఆత్మనిర్భరత" మరియు "పొలం పిలుస్తోంది" కార్యక్రమాలలో భాగంగా రైతులకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ.. పప్పు దినుసులు, సోయా చిక్కుడు మరియు నూనె గింజల జాతీయ మిషన్ కింద రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

**ముఖ్య అంశాలు:** సమతుల్య పోషకాలు: పంటలకు సరైన సమయంలో, సరైన పద్ధతిలో పోషకాలను అందించడం వల్ల నేల సారం దెబ్బతినకుండా స్థిరమైన, అధిక దిగుబడులు సాధించవచ్చు. ఆధునిక సాంకేతికత: జాతీయ ఆహార భద్రతలో భాగంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సరైన పంటల యాజమాన్య పద్ధతులను రైతులు అలవర్చుకోవాలి. పొలం పిలుస్తోంది: నేరుగా రైతుల పొలాల వద్దకే వెళ్లి పంటల పరిస్థితిని పరిశీలిస్తూ, సందేహాలను నివృత్తి చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## 9 వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం



**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 15, నంది పత్రిక** 9 వ జాతీయ పోషణ మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆళ్లగడ్డ పట్టణంలోని 11 వ అంగన్వాడీ కేంద్రంలో పిల్లల ఆహారంలో ప్రోటీన్ పై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ అర్బన్ సూపర్వైజర్ దస్తగిరమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు:

**వెలుగోడు మండలంలో 80 గణేష్ విగ్రహాల ఏర్పాటు**

**మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన దాత షేక్ ఖాదర్ వలీ ఆర్థిక సాయం.**





**వెలుగోడు సెప్టెంబర్ 15 నంది పత్రిక:** వెలుగోడు మండలవ్యాప్తంగా వినాయక చవితి-2026 వేడుకలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. మండలంలో శోభాయమానంగా వెలసిన గణేష్ మండపాలను నిర్వాహకులు అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా వెలుగోడు ఎస్ఐ బి. సురేష్ మాట్లాడుతూ.. మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ముందస్తుగా ఆన్‌లైన్ ద్వారా మొత్తం 80 వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందులో వెలుగోడు పట్టణంలో 43 విగ్రహాలు, వెలుగోడు మండలంలోని వివిధ గ్రామాల్లో 37 విగ్రహాలు ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

**మతసామరస్య చాటిన విరాళం:** వెలుగోడు పట్టణంలోని పోస్టాఫీస్ సమీపంలో (ద్వారకానగర్) త్రిశూల్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపానికి స్థానిక దాత షేక్ ఖాదర్ వలీ తమ ఉదారతను చాటుకున్నారు. వినాయక చవితి నైవేద్యం, అన్నదానం మరియు 50 కేజీల లడ్డు ఏర్పాటు నిమిత్తం ఆయన రూ.35,000 (ముప్పై ఐదు వేల రూపాయల) నగదు సాయాన్ని నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా త్రిశూల్ యూత్ సభ్యులు దాత షేక్ ఖాదర్ వలీ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కులమతాలకు అతీతంగా వినాయక చవితి ఉత్సవాల్లో పాల్గొని ఆర్థిక సాయం అందించడం మండలంలో మతసామరస్యానికి నిదర్శనంగా నిలిచిందని పలువురు కొనియాడారు.

## "జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన కడప జిల్లా కలెక్టర్ "శ్రీధర్ చెరుకూరి



**కడప బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 15 నంది పత్రిక** కడప జిల్లాకు నూతనంగా నియమితులై బాధ్యతలు స్వీకరించిన జిల్లా ప్రధాన మరియు సెషన్స్ న్యాయమూర్తిని జి .రామ గోపాల్ ను, కడప జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, నూతన ప్రధాన జిల్లా న్యాయమూర్తికి పూలబోకె అందజేసి స్వాగతం పలికారు. అనంతరం తదితర అంశాలపై పరస్పరం చర్చించారు.

## పది ఎంపిటిసి స్థానాలకు డ్రాఫ్ట్ పబ్లికేషన్ ఎంపీడీవో నూర్జహాన్ బేగం




**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 15 నంది పత్రిక** ఆళ్లగడ్డ మండలంలో 17 గ్రామ పంచాయతీలలోని 10 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన డ్రాఫ్ట్ పబ్లికేషన్ పోలింగ్ స్టేషన్లో, అన్ని గ్రామ పంచాయతీలలో చేయడం జరిగినదని ఆళ్లగడ్డ ఎంపిడిఓ నూర్జహాన్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపిడిఓ కర్యాలయంలో ఆమె మాట్లాడుతూ తాసిల్దార్ కార్యాలయం నందు అలాగే మండల పరిషత్ కార్యాలయంలో డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేయడం జరిగిందన్నారు. అలాగే ఎంపీటీసీ స్థానాలపై పోలీస్ స్టేషన్ లో ఏమైనా అభ్యంతరాలు, సూచనలు, సలహాల కొరకు అన్ని పార్టీలతో బుధవారం ఉదయం 11.00 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని, అన్ని పార్టీల సభ్యులు హాజరు కావాలని ఆమె తెలిపారు.

## వినాయక నిమజ్జన ఘాట్‌లను పరిశీలించిన జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్

**అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశం.....**



**నంది పత్రిక ఆత్మకూరు...** వినాయక నిమజ్జనం కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ ముందస్తు చర్యలు చేపడుతోంది.ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ నేడు ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలో భాగంగా ఆత్మకూరు, పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న వినాయక నిమజ్జన ఘాట్‌లను, మరియు ఊరేగింపు జరిగే ప్రధాన ప్రాంతాలను స్వయంగా ఎస్పీ సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.నిమజ్జన ఘాట్‌ల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా చర్యలు, ప్రజల రాకపోకలు, వాహనాల నియంత్రణ, పోలీస్ బందోబస్తు తదితర అంశాలపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.వినాయక నిమజ్జనం సందర్భంగా భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. నిమజ్జన కార్యక్రమాలు సజావుగా జరిగేలా ఘాట్‌ల వద్ద నిరంతరం పోలీస్ సిబ్బంది అందుబాటులో ఉండాలని, రద్దీని క్రమబద్ధీకరించడంతో పాటు ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.అలాగే నిమజ్జన కార్యక్రమాల్లో పాల్గొనే ప్రజలు పోలీసులకు సహకరించి, పోలీస్ శాఖ సూచించిన భద్రతా నిబంధనలను పాటించాలని జిల్లా ఎస్పీ కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు ఆత్మకూరు డిఎస్పి రామంజి నాయక్ ,స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ అశోక్, ఆత్మకూరు అర్బన్ సిఐ ఓ మహేశ్వర్ రెడ్డి రూరల్ సీఐ సురేష్ కుమార్రెడ్డిసంబంధిత పోలీస్అధికారులుపాల్గొన్నారు.

## పేదలకు సీఎం సహాయనిధి కొండంత అండ.

**రూ.53 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి**



**వెలుగోడు, సెప్టెంబర్ 15 (నంది పత్రిక)**:అత్యవసర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి సీఎంఆర్ఎఫ్ ఎంతో భరోసా కల్పిస్తోందని శ్రీశైలం నియోజకవర్గ శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర రెడ్డి అన్నారు. ఖరీదైన వైద్యం చేయించుకునే ఆర్థిక స్తోమత లేని నిరుపేదలకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం ఆపద సమయంలో కొండంత అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. మంగళవారం వేల్పనూరు వేల్పనూరులో ఆయన స్వగృహం నందు నిర్వహించిన కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 76 మంది లబ్ధిదారులకు రూ.53 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకు అతీతంగా, పారదర్శకంగా సహాయం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.వైద్యం అందక ఏ ఒక్క పేద కుటుంబం ఇబ్బంది పడకూడదనే లక్ష్యంతో సీఎంఆర్ఎఫ్ దరఖాస్తుల పరిశీలన, నిధుల మంజూరు ప్రక్రియ వేగవంతమయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అత్యవసర వైద్య చికిత్సలకు ఆర్థిక సహాయం అవసరమైన వారు సీఎంఆర్ఎఫ్ ద్వారా లబ్ధి పొందేలా తమ కార్యాలయం ద్వారా సహకారం అందిస్తామని చెప్పారు.సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు తమ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు సీఎం సహాయ నిధి కొండంత అండ : కోట్ల సూర్య



**డోన్ నంది పత్రిక సెప్టెంబర్ 15** డోన్ పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఉదయం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన అక్షరాలా ఏభై ఐదు లక్షల రూపాయల విలువైన చెక్కులను గౌరవనీయులు డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి, మరియు యువ నాయకులు కోట్ల రాఘవేంద్ర రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఆరోగ్య చికిత్సలు, అత్యవసర వైద్య అవసరాలు, ప్రమాదాలు మరియు ఇతర సంక్షేమ కారణాల నిమిత్తం పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయం ఎంతో ఉపశమనం కలిగించిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అవసరంలో ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్న దానికి ఇది నిదర్శనమని ఎమ్మెల్యే అన్నారు.భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సాయం అందేలా తగిన చర్యలు తీసుకుంటామని, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# గుంతలమయమైన ప్రధాన రహదారి.. పట్టించుకోని అధికారులు!






### కాలువకట్ట వద్ద అధ్వానంగా రోడ్డు.. దుమ్ము ధూళితో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు
### వెంటనే మరమ్మతులు చేయాలని ఆలిండియా యూమారైడ్ సభ్యుల డిమాండ్

**పోరుమామిళ్ల, సెప్టెంబర్ 15 (నంది పత్రిక ):** వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల పట్టణ పరిధిలోని కడప విజయవాడ ప్రధాన రహదారిపై కాలువకట్ట సమీపంలో రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రధాన రహదారి కావడంతో నిత్యం ఈ మార్గంలో పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే కాలువకట్ట సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలు ప్రమాదాలకు కారణమయ్యేలా మారాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.స్థానికుల వివరాల ప్రకారం.. గుంతలను తప్పించుకునే క్రమంలో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడిన ఘటనలు చోటుచేసుకుని పలువురు గాయపడినట్లు తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంతలు సరిగా కనిపించక వాహనదారులు మరింత ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

**రోడ్డుపక్క నివాసితులకు దుమ్ము ధూళి కష్టాలు**

రోడ్డుపై వాహనాలు ప్రయాణించే సమయంలో గుంతల కారణంగా దుమ్ము, ధూళి పెద్దఎత్తున ఎగసిపడుతోందని రోడ్డుకు ఇరువైపులా నివసిస్తున్న ప్రజలు వాపోతున్నారు. ఇళ్లలోకి దుమ్ము చేరడంతో పాటు, రహదారి వెంట నడిచే పాదచారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు.వాహనాల రాకపోకలతో ఎగిసే దుమ్ము కారణంగా రోడ్డు పక్కన ఉన్న వ్యాపారులు, నివాసితులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు తెలిపారు. చిన్నపిల్లలు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులు మరింత జాగ్రత్తగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఏడాది కూడా గడవకముందే అధ్వాన స్థితి ఎందుకు?**

ఇటీవలే రోడ్డు మరమ్మతులు జరిగినప్పటికీ సంవత్సరం కూడా పూర్తికాకముందే రహదారి మళ్లీ గుంతలమయంగా మారడం పట్ల స్థానికులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. రహదారి నిర్మాణం, మరమ్మతుల నాణ్యతపై సంబంధిత అధికారులు పరిశీలన చేయాలని వారు కోరుతున్నారు.

ప్రధాన రహదారిపై ఇలాంటి పరిస్థితి ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి గుంతలను పూడ్చడంతో పాటు రహదారికి పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

**హ్యూమన్ రైట్స్ సభ్యుల ఆగ్రహం** ఈ సమస్యపై ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ సభ్యులు స్పందిస్తూ.. ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్న రహదారి సమస్యపై ఉన్నతాధికారులు వెంటనే దృష్టి సారించాలని కోరారు. రహదారి పరిస్థితిని స్వయంగా పరిశీలించి తక్షణమే మరమ్మతులు చేపట్టి వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలనుపట్టించుకోకుండా కార్యాలయాల్లో కూర్చుంటే సరిపోదని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించాల్సిన బాధ్యత ఉందని వారు పేర్కొన్నారు.రోడ్డు మరమ్మతుల విషయంలో ఆర్అండ్‌బీ శాఖ అధికారులు, సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని, ప్రమాదాలకు అవకాశం లేకుండా గుంతలను పూడ్చి రహదారిని సురక్షితంగా మార్చాలని కోరారు.లేని పక్షం లో ఈ విషయంపై కలెక్టరేట్‌కు ఫిర్యాదు చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకునేలా అధికారుల దృష్టికితీసుకెళ్లనున్నట్లు ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ సెక్రటరీ ఫణి రావు, ఆఫీస్ సెక్రటరీ ప్రవీణ్, కిసాన్ మోక్ష జిల్లా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

**ప్రజలు ప్రమాదాలకు గురైన తర్వాత స్పందిస్తారా?**

ప్రధాన రహదారిపై గుంతలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు ఇకనైనా నిర్లక్ష్యం వీడి తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. మరిన్ని ప్రమాదాలు జరగకముందే రహదారి మరమ్మతులు చేపట్టి ప్రజలకు, వాహనదారులకు భద్రమైన రాకపోకలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**- టీడీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంచార్జీల సమావేశంలో జోన్5 కోఆర్డినేటర్ పెళ్ళకూరు శ్రీనివాస రెడ్డి**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు, నియోజకవర్గ ఇంచార్జీల సమావేశం మంగళవారం ఉదయం 11.30 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జోన్5 కోఆర్డినేటర్, స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులు పెళ్ళకూరు శ్రీనివాస రెడ్డి హాజరయ్యారు. సమావేశానికి ఎమ్మిగనూరు శాసనసభ్యులు డాక్టర్ బి.వి. జయనాగేశ్వర రెడ్డి, కోడుమూరు శాసన సభ్యులు బొగ్గుల దస్తగిరి, ఆదోని నియోజకవర్గ ఇంచార్జి కె. మీనాక్షి నాయుడు, ఆలూరు నియోజకవర్గ ఇంచార్జి వైకుంఠం జ్యోతి, జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పి. నాగరాజు యాదవ్, పత్తికొండ నియోజకవర్గ పార్టీ ముఖ్య నాయకులు నరసింహులు చౌదరి తదితరులు హాజరయ్యారు.సమావేశం ప్రారంభానికి ముందు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జోన్5 కోఆర్డినేటర్, స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులు పెళ్ళకూరు శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇందుకోసం ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంచార్జీలు తమ తమ పరిధిలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ, అభ్యర్థుల విజయానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు వార్డు మరియు గ్రామస్థాయి నుంచి పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు.అనంతరం సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంచార్జీలు స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి తమ నియోజకవర్గాల్లో ఉన్న పరిస్థితులు, పార్టీ పరంగా చేపట్టాల్సిన చర్యలు, తమ సూచనలు మరియు అభిప్రాయాలను ఎన్నికల పరిశీలకులు పెళ్ళకూరు శ్రీనివాస రెడ్డి కి వివరించారు.

## మిట్టపల్లిలో 9వ రాష్ట్రీయ పోషణమాసం కార్యక్రమం



**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 15 నంది పత్రిక** ఆళ్లగడ్డ మండలం మిట్టపల్లి గ్రామ అంగన్వాడి కేంద్రంలో 9 రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం ఐసిడిఎస్ సూపర్వైజర్ పార్వతి ఆధ్వర్యంలో మంగళవారం నాడు నిర్వహించారు .ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ పోషణ అంటే మన శరీరానికి కావలసిన అన్ని రకాల పోషకాలు ప్రోటీన్లు పిండి పదార్థాలు విటమిన్లు మినరల్స్ అన్ని కూడా సమపాలలో అందినప్పుడే పోషక ఆహారం మన శరీరానికి అందుతుంది లేకపోతే లోప పోషణ ఏర్పడి తద్వారా బలహీనమై వ్యాధులను ఎదుర్కొనే శక్తి తగ్గిపోతుంది తొందరగా రోగాల బారిన పడే అవకాశం ఉంది కాబట్టి ప్రతి ఒక్కరూ పోషకాహార లోపం లేకుండా ప్రతిరోజు ఏదో ఆకలి తీరాలి అని కడుపు నిండాలని ఆహారం తినకుండా ప్రతిరోజు ఎన్ని రకాల పోషకాలు మన శరీరానికి అందుతున్నాయ అని ఆలోచనతో మన ప్రతిరోజు తినే ఆహారం అలవాట్లలో మార్పులు చేసుకోవాలని అన్ని రకాల ఆకుకూరలు తినడం ద్వారా మంచి పోషకాలు శరీరానికి అందుతాయి గర్భవతిగా ఉన్నప్పటి నుంచే అన్ని రకాల ఆకుకూరలు పండ్లు కూరగాయలు చిరుధాన్యాలు తినడం ద్వారా మంచి పోషణ లభించి తల్లి బిడ్డ క్షేమంగా ఉంటారు పుట్టబోయే బిడ్డ కూడా పోషణ లోపం లేకుండా చేస్తారని తెలిపారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు మౌనిక బాలమ్మ ఏఎన్ఎం స్వర్ణలత ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## వీడియోలో మతపరమైన పదాలు.. ఫిర్యాదుతో మహిళా ఐపీఎస్ అధికారి బదిలీ

పశ్చిమ బెంగాల్‌లో ఒక ఐపీఎస్ అధికారిణి బదిలీ వ్యవహారం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఒక వీడియోలో ఇస్లామిక్ పలకరింపులను ఉపయోగించారన్న ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం ఆమెపై ఈ చర్య తీసుకుంది. ఖరగ్‌పూర్ అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న బుష్రా బానోను బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.యూపీఎస్సీ సివిల్స్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకు బుష్రా బానో ఆదివారం 'ఎక్స్' వేదికగా ఒక వీడియోను పంచుకున్నారు. సౌదీ అరేబియాలో బోధన వృత్తిని వదులుకుని స్వదేశానికి తిరిగి రావడం, పీహెచ్‌డీ పూర్తి చేసిన అనంతరం అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ కోచింగ్ అకాడమీలో శిక్షణ పొందిన తన ప్రయాణాన్ని అందులో వివరించారు. అయితే, ఆ వీడియోలో ఆమె "అస్సలాము అలైకుం"తో ప్రసంగాన్ని ప్రారంభించడంతో పాటు, మధ్యలో "ఇన్షా అల్లా", ముగింపులో "జజాకల్లా" వంటి పదాలను ఉపయోగించడం వివాదానికి దారితీసింది. దీనిపై హిందూ లీగల్ ఫండ్ అనే సంస్థ పశ్చిమ బెంగాల్ హోం సెక్రటరీకి ఫిర్యాదు చేసింది. బాధ్యతాయుతమైన ప్రభుత్వ హోదాలో ఉన్న అధికారిణి "జై హింద్" లేదా "వందేమాతరం" వంటి జాతీయ నినాదాలకు బదులుగా, మతపరమైన పలకరింపులను ఉపయోగించడం నిబంధనలకు విరుద్ధమని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ బదిలీ వ్యవహారం సోషల్ మీడియా వేదికగా తీవ్ర దుమారం రేపింది. ప్రభుత్వ అధికారులు మతాలకు అతీతంగా వ్యవహరించాలని కొందరు నెటిజన్లు విమర్శించగా, మరికొందరు ఆమెకు మద్దతుగా నిలిచారు. రెండుసార్లు యూపీఎస్సీలో విజయం సాధించిన అత్యంత ప్రతిభావంతురాలైన అధికారిణిపై కేవలం పలకరింపుల పేరుతో చర్యలు తీసుకోవడం సమంజసం కాదని వారు అభిప్రాయపడుతున్నారు. వివిధ మతాలకు చెందిన అధికారులు తమ విశ్వాసాలను వ్యక్తం చేసినప్పుడు వేర్వేరు నిబంధనలు వర్తింపజేయడం ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని సోషల్ మీడియాలో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది.

## ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థుల ఓరియెంటేషన్ కార్యక్రమం

**"వైద్య విద్య మీకు వృత్తిని మాత్రమే కాదుడగొప్ప జీవిత లక్ష్యాన్ని, సమాజసేవకు అవకాశాన్ని అందిస్తుంది" ... అడిషనల్ డీఎంఈ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కే చిట్టి నరసమ్మ**




**కర్నూల్ సిటీ నంది పత్రిక** 2026-27 సం. ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం కర్నూల్ మెడికల్ కాలేజీ యందు మంగళవారం (సెప్టెంబర్ 15) నాడు 202627 విద్యా సంవత్సరానికి కాలేజీలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందిన నూతన విద్యార్థులకు న్యూ లెక్చరర్ గ్యాలరీ అందు ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అడిషనల్ డీఎంఈ, కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె. చిట్టి నరసమ్మ అధ్యక్షత వహించి, నూతన విద్యార్థులను ఉద్దేశించి విలువైన మరియు స్ఫూర్తిదాయకమైన సందేశాన్ని అందించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ "వైద్య విద్య మీకు ఒక వృత్తిని మాత్రమే కాదుడ ఒక జీవిత లక్ష్యాన్ని, సమాజానికి సేవ చేసే గొప్ప అవకాశాన్ని అందిస్తుంది" అని అన్నారు. వైద్య వృత్తిలో జ్ఞానంతో పాటు "మానవత్వం, సేవాభావం, నైతిక విలువలు" " అత్యంత ముఖ్యమని" తెలిపారు."మీ చేతుల్లో భవిష్యత్తులో ఎన్నో ప్రాణాల బాధ్యత ఉంటుంది. అందుకే ఈరోజు నుంచే మంచి విద్యార్థులుగా మాత్రమే కాకుండా మంచి సామాజిక బాధ్యత కలిగిన మనుషులుగా ఎదగడానికి కృషి చేయాలి" అని విద్యార్థులకు సూచించారు.అలాగే "రోగి మీ వద్దకు వచ్చినప్పుడు అతనిలో ఒక వ్యాధిని మాత్రమే చూడకండిడ ఒక మనిషిని చూడండి. మీ జ్ఞానానికి మానవత్వం తోడైతేనే మీరు సంపూర్ణ వైద్యులుగా ఎదుగుతారు" అని ప్రిన్సిపల్ పేర్కొన్నారు.విద్యార్థులు మొదటి సంవత్సరం నుంచే క్రమశిక్షణ, సమయపాలన, నిరంతర అధ్యయనం, పరిశీలనా దృక్పథం, కమ్యూనికేషన్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కర్నూలు మెడికల్ కాలేజీకి ఉన్న ఘనమైన చరిత్ర, వైద్య రంగంలో ఉన్న ప్రత్యేక గుర్తింపును నూతన విద్యార్థులు మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆమె ఆకాంక్షించారు.ఓరియెంటేషన్ కార్యక్రమంలో విద్యార్థులకు కళాశాలలోని వివిధ విభాగాలు, బోధనా విధానం, విద్యా ప్రణాళిక, పరీక్షా విధానం, విద్యార్థుల క్రమశిక్షణ, కళాశాలలో అందుబాటులో ఉన్న విద్యా మరియు ఇతర సౌకర్యాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమం ద్వారా నూతన విద్యార్థులకు వైద్య విద్యపై స్పష్టమైన అవగాహన కల్పించడంతో పాటు, బాధ్యతాయుతమైన వైద్యులుగా ఎదగాలనే స్ఫూర్తిని నింపారు. ఈ కార్యక్రమంలో క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ సీ.ఎస్.కె. ప్రకాష్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ హరి చరణ్,డా. శ్రీరాములు, డిప్యూటీ సూపరింటెంట్ డా. నాగేశ్వరరావు, వివిధ విభాగాధిపతులు డా. బ్రహ్మాజీ మాస్టర్, డా. రాజేష్, డా.ఎలిజిబెత్ రాణి,డా.బాలేశ్వరి,డా. కిరణ్మయి,డా. నాగజ్యోతి, ప్రొఫెసర్, అసోసియేట్ లు డా.మాధవి శ్యామల, డా రాజయ్య, డా. ఉమ, డా. రాధిక, డా. అరుణ,డా. చక్రపాణి, డాక్టర్ ప్రవీణ, డా.రవి నాయక్,డా. శరణ్య తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ అభివృద్ధి పనులకు భూమి పూజ చేసిన కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు మండలం వెంకయపల్లి గ్రామంలోని ఎల్లమ్మ టెంపుల్ సమీపంలో శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ ఈఓ రాధాకృష్ణ , ఆలయ చైర్మన్ బోగిని నాగేంద్ర ఆహ్వానం మేరకు కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఆలయ నిధులతో నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్ మరియు టాయిలెట్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను ఆయన అభినందించారు. భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆలయ నిర్వాహకులకు సూచించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ కర్నూలు మండల కన్వీనర్ బుర్ర వెంకటేష్ నాయుడు, సొసైటీ చైర్మన్ వెంకట్రాముడు,ఆలయ అధికారులు, సిబ్బంది, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి

### పట్టణ ప్రజల గొంతులు తడిపేందుకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ను ఏర్పాటు చేయాలి: సిపిఎం

**నంది పత్రిక ఆత్మకూరు..** ఆత్మకూరు పట్టణం మరియు మండల పరిధిలోనిగ్రామాలలోజనాభాను దృష్టిలో ఉంచుకొని నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలుతీసుకోవాలి. వేసవికాలం ముగిసి వర్షాకాలం ముగియడానికి వచ్చిన వేసవినితలపించేలా ఎండలు ఉన్నాయి. పట్టణ ప్రజలగొంతులుతడిపేందుకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించాలని సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్ డిమాండ్చేశారు. మంగళవారం పట్టణంలోని సుదర్శన వర్మ భవన్ నందు సిపిఎం పార్టీపట్టణకమిటీసమావేశం పట్టణ నాయకులు డి. రామ్ నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏ.రణధీర్ మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణం లో పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం పట్టణంలో 32 వార్డులు ఉన్నాయని సంవత్సరంలో 365 రోజులు ఐదు రూపాయలకు రెండు బిందెలు చొప్పున కొనుక్కొని తాగాల్సిన పరిస్థితి నెలకొంది అన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న కాలనీ కాలనీలకు అనుగుణంగా దాదాపు 60 వేల నుంచి 70 వేల వరకు పట్టణ జనాభా ఉందని ఈ జనాభాను దృష్టిలో ఉంచుకొని నీటి సమస్య లేకుండా చేసేందుకు పట్టణంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును ఏర్పాటు చేయాలని అన్నారు. అధికారులు తాగునీటి సమస్యపై ముందస్తు చర్యలు తీసుకోకపోతే పట్టణ ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పవని ముందస్తు చర్యలు తీసుకొని తాగునీటి సమస్య లేకుండాచర్యలుతీసుకోవాలన్నారు.ఈ సమావేశంలో సిపిఎం పార్టీ పట్టణ నాయకులు ఏ సురేంద్ర,ఎన్ వీరన్న,సద్దాం హుస్సేన్, గుంజ నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



# మట్టి గణపతిని పూజిద్దాం...పర్యావరణం కాపాడుకుందాం





## పాత్రికేయ గణపతికి ఘనంగా రెండవ రోజు వేడుకలు

## కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి చేతులమీదుగా ప్ర సాద వితరణ

## కందనవోలు దినపత్రిక వ్యవస్థాపకులు కురువ శ్రీనువాసులు అన్నదానం

**కర్నూలు సిటీ, నంది పత్రిక** కర్నూలు జిల్లా కలెక్టరేట్,సమాచారం శా ఖ ఆవరణలో పాత్రికేయ గణేష్ ఉత్సవ స మితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ ణనాథుడికి మంగళవారం రెండవ రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పూజారి వ్యాపారి శ్రీకాంత్ ప్రత్యేక పూజలు జరిపించారు.పూజల్లో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి,జేసీ నూరుల్ ఖమర్ లు హాజరై పూజలు చేశారు.అనం తరం కందనవోలు దినపత్రిక వ్యవస్థాప కులు కురువ శ్రీనువాసులు అన్నదానం ఏ ర్పాటుచేశారు.ఈ సందర్భంగా కురువ శ్రీ నువాసులు మాట్లాడుతూ వినాయక చ వితి ఉత్సవాలు భక్తి,ఆధ్యాత్మికతతో పా టు సేవా భావాన్ని పెంపొందించేలా ఉం డాలని అన్నారు.అంతేకాకుండా ప్లాస్టిక్ నివారణకు సహకరిస్తూ మట్టి గణపతి విగ్రహాలను పూజంచడం ద్వారా పర్యావ రణంను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలనీ సూచించారు.గణనాథు డి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతో షాలతో ఉండాలని ఆకాంక్షించారు.సమాజంలో సేవా కార్యక్ర మాలకు ప్రతి ఒక్కరూ తమవంతు సహ కారం అందించాలని కోరారు.పాత్రికేయ గ ణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న కార్యక్రమాలు భక్తులు,ప్రజలను ఆకట్టు కుంటున్నాయని తెలిపారు.గణ నాథుడి సన్నిధిలో అన్నదానం చేయడం ఎంతో పుణ్యకార్యమని,భక్తులకు అన్న ప్రసాదం అందించడం సంతోషంగా ఉంద ని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సమా చార శాఖ అధికారిని కె.జయమ్మ,హరి నాథ్ రెడ్డి,రామకృష్ణ,పాత్రికేయ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు మంజునాథ్ యాదవ్,శ్రీనాథ్ రెడ్డి,అవినాష్,సాగర్,రా ఘవేంద్రగౌడ్,పరశురాం,వి.విజయ్ కు మార్ యాదవ్,గిలిగిత్త విజయ్ కుమార్, కిషోర్ కుమార్ రెడ్డి,ప్రకాష్,పుల్లం రాజు, గంగాధర్,అంజి, రమేష్,చెన్నయ్య, నర సింహ,పాత్రికేయులు,భక్తులు,తదితరులు పాల్గొన్నారు.

# బాల సంజీవని టెండర్లలో అవకతవకలు, నిబంధనల ఉల్లంఘనలపై సమగ్ర విచారణ జరిపించాలి ఏఐవైఎఫ్

డిఆర్ఓ సి వెంకటనారాయణమ్మ కి ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు మాట్లాడుతూ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు బాల సంజీవని, బాల సంజీవని ట్రైబల్ పథకాలను అమలు చేస్తోంది. రాష్ట్రంలోని 26 జిల్లాలను నాలుగు యూనిట్లుగా విభజించి నిర్వహించిన తాజా టెండర్లలో పారదర్శకత, పోటీ, నిబంధనల అమలుపై అనేక అనుమానాలు, ఫిర్యాదులు వెలువడుతున్నాయి.టెండర్లలో స్థానిక మహిళా స్వయం సహాయక సంఘాలు, చిన్నమధ్య తరహా పరిశ్రమలకు అవకాశం లేకుండా, 5,583 డెలివరీ పాయింట్ల వంటి అర్హతలను విధించడం ద్వారా కొద్దిమంది పెద్ద సంస్థలకే ప్రయోజనం కలిగేలా నిబంధనలు రూపొందించారనే ఆరోపణలు ఉన్నాయి. పోషణ పథకాలలో యస్ హెచ్ జి ల భాగస్వామ్యానికి ఉన్న విధానపరమైన ప్రాధాన్యతను ప్రభుత్వం విస్మరించకూడదు.టెండర్‌లో సొంత తయారీ యూనిట్, ఫుడ్ సేఫ్టీ లైసెన్స్, ఉత్పత్తి సామర్థ్యం వంటి అర్హతలు ఉన్నప్పటికీ, సొంత తయారీ యూనిట్లు లేని కేంద్రీయ భండార్, యన్ సీ సీ యఫ్ వంటి సంస్థలకు ఏ ప్రాతిపదికన అర్హత కల్పించారో ప్రభుత్వం స్పష్టం చేయాలని గతంలో ఇదే కారణాలతో అనర్హతకు గురైన సంస్థలు ఇప్పుడు ఎలా అర్హత సాధించాయో ప్రజలకు వివరించాలి అన్నారు అదేవిధంగా సాధారణ కిట్ ధర రూ.241 నుంచి రూ.283.19కు, ట్రైబల్ కిట్ ధర రూ.350 నుంచి రూ.446కు పెరిగినట్లు ఉన్న నేపథ్యంలో, ధరల పెరుగుదలకు సంబంధించిన పూర్తి కాస్ట్ షీట్ , టెక్నికల్ /ఫైనాన్సియల్ ఇవాల్యుయేషన్ వివరాలను బహిర్గతం చేయడంతో పాటు పలువురు బిడ్డర్లు ఒకే ధరను కోట్ చేసినట్లయితే, పోటీ నిజంగా జరిగిందా లేదా సిండికేషన్ జరిగిందా అనే అంశంపై ఈ -ప్రొకర్మెంట్ రికార్డులతో సహా విచారణ జరిపి ప్రస్తుత బాల సంజీవని టెండర్లపై స్వతంత్ర సమగ్ర విచారణ, నిబంధనలకు విరుద్ధంగా అర్హత పొందిన సంస్థల కాంట్రాక్టులను రద్దు చేసి తయారీ యూనిట్, ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ తదితర అర్హతలను అందరికీ సమానంగా అమలు చేయాలి.జోన్ విధానాన్ని రద్దు/పునఃపరిశీలించి జిల్లాల వారీగా టెండర్లు నిర్వహించాలి.మహిళా యస్ హెచ్ జి లు, స్థానిక చిన్నమధ్య తరహా పరిశ్రమలకు సమాన అవకాశం కల్పించాలి. రూ.283.19, రూ.446 ధరల పెరుగుదలకు పూర్తి ఆధారాలను వెల్లడించి, అవసరమైతే రీ-టెండర్ నిర్వహించాలి.టెండర్‌లో కుమ్మక్కు, నిబంధనల ఉల్లంఘన లేదా ప్రజాధనానికి నష్టం జరిగినట్లు తెలితే




బాధ్యులైన అధికారులు, కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి.పౌష్టికాహార కిట్ల నాణ్యతను బ్యాచ్ వారీగా పరీక్షించి, నివేదికలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి.బాలల పౌష్టికాహారం కొద్దిమంది కాంట్రాక్టర్ల లాభాల కోసం కాకుండా, పారదర్శకంగా, నాణ్యతతో, స్థానిక మహిళా సంఘాల భాగస్వామ్యంతో అమలు కావాలి.కావున ప్రజాధనం మరియు బాలల పౌష్టికాహార ప్రయోజనాలను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు బి నాగరాజు, నగర నాయకులు శివ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు

# అబద్దపు మాటలు చెప్పి ఓట్లు వేయించుకున్నారు.. ఇప్పుడు హామీలను మరిచిపోయారు

## వైఎస్ఆర్సిపి నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి

**కర్నూల్ సిటీ నంది పత్రిక** స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి. కర్నూలు నగరంలోని కె యస్ ఆర్ కన్వెన్షన్ హాల్ (హ్యాంగ్ అవుట్) నందు కల్లూరు మండలం, కల్లూరు అర్బన్ 22 వార్డుల విస్తృత స్థాయి సమావేశం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ గుర్తింపు కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా కాటసాని రామభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.గతంలో ఏ విధంగా కష్టపడి పనిచేసి వైఎస్సార్‌సీపీని గెలిపించుకున్నామో, అదే స్ఫూర్తితో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. అధికారం ఉన్నా లేకపోయినా ప్రజల మధ్య ఉండటం, వారి సమస్యలను తెలుసుకోవడం, వారికి అండగా నిలవడం వైఎస్సార్‌సీపీ బాధ్యత అన్నారు.ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ఎన్నో హామీలు ఇచ్చి ప్రజలను నమ్మించారు. జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాల కంటే మెరుగ్గా 'సూపర్ సిక్స్' అమలు చేస్తామని చెప్పి ఓట్లు వేయించుకున్నారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా మరిచిపోతున్నారు.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పేదలు, రైతులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, నిరుద్యోగులు.. ఇలా ప్రతి వర్గానికి సంక్షేమాన్ని అందించామని కాటసాని తెలిపారు. నేడు కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేక ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. మెగా డి యస్ సి పేరుతో నిరుద్యోగ యువతకు అన్యాయం ఉద్యోగాల కోసం సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు మెగా డి యస్ సి పేరుతో ఎన్నో ఆశలు కల్పించారని, కానీ నియామక ప్రక్రియపై యువతలో తీవ్ర ఆందోళన నెలకొందని అన్నారు. ఉద్యోగాలు ఇవ్వలేకపోతే నెలకు ₹3,000 నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. ఆ హామీ ఏమైంది? ఇప్పటివరకు ఎంతమంది నిరుద్యోగులకు ₹3,000 చొప్పున భృతి ఇచ్చారో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలి అని డిమాండ్ చేశారు. ప్రజలను ఓట్ల కోసం మభ్యపెట్టి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన మాటను మరిచిపోవడం సరికాదని, రాజకీయ నాయకుడు అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని కాటసాని అన్నారు.



**అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గొద్దు.** పోలీస్, ప్రభుత్వ అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లోబడి వ్యవహరించకుండా నిష్పక్షపాతంగా, చట్టబద్ధంగా పనిచేయాలని కాటసాని సూచించారు.అధికారం శాశ్వతం కాదు.. ప్రభుత్వాలు శాశ్వతం కాదు. అధికారంలో ఉన్నవారు రేపు ప్రతిపక్షంలో ఉండొచ్చు. 2029లో ఎవరు అధికారంలో ఉంటారో ఎవరికీ తెలియదు. కానీ అధికారులు ఈరోజు చేసిన పనులను ప్రజలు మాత్రం గుర్తుంచుకుంటారు. అందువల్ల ప్రజలకు, రాజ్యాంగానికి, చట్టానికి కట్టుబడి పనిచేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.కష్టకాలంలో పార్టీ కోసం నిలిచిన కార్యకర్తలను మరచిపోంగత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నప్పటికీ, జగన్‌మోహన్ రెడ్డి ని నమ్మి పార్టీ కోసం నిలిచిన నాయకులు, కార్యకర్తలు ఎంతోమంది ఉన్నారని కాటసాని అన్నారు.పదవులు లేకపోయినా.. అధికారం లేకపోయినా.. పార్టీ జెండాను మోస్తూ మనతో నిలిచిన ప్రతి కార్యకర్తను వైఎస్సార్‌సీపీ మరచిపోదు. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు భవిష్యత్తులో తప్పకుండా అండగా ఉంటాం కల్లూరు అర్బన్‌లో పార్టీ కోసం కష్టపడ్డ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, వార్డు స్థాయి పార్టీ శ్రేణుల సేవలను మరచిపోమని తెలిపారు.కష్టకాలంలో మనతో ఉన్నవారే మన బలం.. వారిని కాపాడుకోవడం మన బాధ్యత అని అన్నారు.నాయకులు, కార్యకర్తలు విభేదాలను పక్కనపెట్టి ఐక్యంగా పనిచేయాలని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వాన్ని బలపరచాలని పిలుపునిచ్చారు.స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త ప్రజల మధ్యకు వెళ్లాలని కాటసాని పిలుపునిచ్చారు.మాట ఇచ్చి మోసం చేసిన వారిని ప్రజలే ప్రశ్నించే రోజు రావాలి.. ప్రజల కోసం నిలిచిన వైఎస్సార్‌సీపీని మళ్లీ బలోపేతం చేయాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కర్నూలు నగర మాజీ మేయర్,డిప్యూటీ మేయర్,కల్లూరు మండలం నాయకులు, కల్లూరు అర్బన్ మాజీ కార్పొరేటర్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీ లు, రాష్ట్ర పార్టీ కమిటీ సభ్యులు,జిల్లా పార్టీ కమిటీ సభ్యులు,నియోజకవర్గ పార్టీ కమిటీ సభ్యులు,అనుబంధ విభాగాలలో వివిధ హోదాలలో ఉన్న నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మద్దులేటీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ ధర్మ కర్తల మండలి సభ్యుల ప్రధమ సమావేశం.

## నిర్వహించిన ఉప కమీషనర్ & ఈఓ ఎం. రామాంజనేయులు.

## హాజరైన ధర్మ కర్తల మండలి చైర్మన్ ఉన్నం ఎల్ల నాగయ్య.



**బేతంచెర్ల సెప్టెంబర్ 15 ( నందిపత్రిక ).** నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం ఆర్ఎస్.రంగాపురం గ్రామ పరిధిలో వెలసి ఉన్న, ప్రముఖ వైష్ణవ క్షేత్రం అగు శ్రీ మద్దులేటి లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం సదనము భవనము నందు, డిప్యూటీ కమీషనర్ మరియు శ్రీ మద్దులేటీ లక్ష్మీ నరసింహ శ్రీ దేవస్థానం కార్య నిర్వహణ అధికారి ఎం. రామాంజనేయులు ఆధ్వర్యంలో, శ్రీ మద్దులేటీ స్వామి ధర్మ కర్తల పాలక మండలి( ట్రస్ట్ బోర్డ్ ) సభ్యుల ప్రధమ సమావేశం మంగళవారం నాడు నిర్వహించడం జరిగింది.ఈ సమావేశంలో ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాలే లక్ష్యంగా మొత్తం 6 ముఖ్యమైన అజెండా అంశాలపై సుదీర్ఘంగా చర్చించడ మైనది.ఇందులో దేవ స్థానం నకు సంభందించిన, 210 ఎకరాల భూములను సర్వే చేయుటకై, తహసీల్దార్ వారికి లేఖ వ్రాయుట,శ్రీ మద్దులేటీ నరసింహ స్వామి ఆలయ ప్రాకారం, అమ్మ వారి ఆలయం ప్రక్కనే ఉన్న కొండను 40 అడుగులు తొలగించుటకు కమీషనర్ వారికి లేఖ వ్రాయుట,శ్రీ మద్దులేటి నరసింహ స్వామి దేవస్థానంనకు, గోరుకల్లు రిజర్వాయర్ నుండి డోన్ కు పోయే నీటి పైపు లైన్ నుండి,వసతి, త్రాగునీరు,మరియు స్నాన ఘట్టాల వద్ద, నీటి సౌఖర్యము కల్పించుటకు చర్యలు తీసుకోవలయునని కోరుతూ, నంద్యాల జిల్లా ఆర్ డబ్ల్యు ఎస్ వారికి లేఖ వ్రాయుటపై,దేవస్థానము ఆలయ ముందు భాగాన గల టేకు ధ్వజ స్థంబమునకు,వెండి తొడుగు వేసి,పగుళ్ళు నివారించుటకు, దాతలు మరియు దేవస్థానం సహకారంతో వెండి తొడుగు చేయుటకు పత్రికా ప్రకటన చేయుటపై,శ్రీ మద్దులేటీ నరసింహస్వామి దేవస్థానమునకు, నూతన కార్య నిర్వహణ అధికారి వారి కార్యాలయము మరియు ధర్మ కర్తల మండలి సభ్యుల మీటింగ్ హాల్,చైర్మన్ ఛాంబర్ నిర్మించుట కొరకు అంచనాలు తయారు చేస్తూ, కర్నూలు డిఈఈ వారికి లేఖ వ్రాయుట పై, శ్రీ మద్దులేటీ నరసింహ స్వామి ఆలయం నందు, 11/10/2026 నుండి 21/10/2026 వరకు జరుగు దసరా మహోత్సవముల గురించి చర్చించుట మొదలగు అంశాలపై,ఈ సమావేశంలో ఈఓ.రామాంజనేయులు సమావేశానికి హాజరైన ధర్మ కర్తలమండలి సభ్యుల ప్రధమ, సమావేశం ముందు,చర్చకు పెట్టడం జరిగింది. ఈ సమావేశమునకు హాజరైన దేవస్థానం ఈఓ, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఉన్నం ఎల్ల నాగయ్య,భూపాల్ రెడ్డి,సుబ్రహ్మణ్యం శర్మ,చాట కొండ రజని,జవ్వాజి శ్రీ లక్ష్మి, భజంత్రి తిరుమలమ్మ తదితరులు,అందరూ కలిసి స్వామివారి ఆలయాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ఐక్యంగా కృషి చేస్తామని తెలిపారు.



# మైనారిటీ అభ్యర్థులకు గ్రూప్-1 ఉచిత శిక్షణ దరఖాస్తుకు ఈ నెల 25 వరకు గడువు పెంపులి

## మైనారిటీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి

## మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పిలుపు



**అమరావతి,సెప్టెంబరు 15. నంది పత్రిక:**రాష్ట్రం లో కూటమి ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్-2026ను అనుసరించి గ్రూప్-1 పరీక్షలకు పోటీపడే మైనారిటీ అభ్యర్థులను ఉచిత శిక్షణకు ఎంపిక కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష కు దరఖాస్తు గడువును మరోసారి పెంచినట్లు మైనారిటీ, న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. మైనారిటీ సంక్షేమ శాఖ పరిధిలోని సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్ (సిఈడిఎం ) ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కోసం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్న విషయం తెలిసిందేనని మంత్రి గుర్తు చేశారు. ఈనెల 10వ తేదీ వరకు నిర్దేశించిన గడువు ను 15 వ తేదీ వరకు పొడిగించిన విషయాన్ని మంత్రి ఫరూక్ గుర్తు చేశారు. అయితే ఈ గడువును మరోసారి పెంచి ఈనెల 25వతేది వరకు దరఖాస్తు చేయడానికి పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.ఇప్పటివరకు దరఖాస్తు చేయని అర్హులైన మైనారిటీ అభ్యర్థులు ఈ అదనపు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పొడిగించిన గడువు లోపు దరఖాస్తు చేసుకోవాలని మంత్రి ఫరూక్ పిలుపునిచ్చారు. ఏపీపీఎస్సీ గ్రూప్-1 సివిల్ పరీక్షకు హాజరుకావాలనుకునే మైనారిటీ అభ్యర్థులకు శ్రేష్ఠమైన శిక్షణ, మార్గదర్శకత్వం, సహకారాన్ని అందించడమే ఉచిత శిక్షణా కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు.మరిన్ని వివరాల కోసం సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్ (సిఈడిఎం),మైనారిటీ సంక్షేమ శాఖ,వెబ్‌సైట్: ఫోన్: 08645-297535 / 7386789966. సంప్రదించాలని మంత్రి ఎన్ఎండి ఫరూక్ కోరారు.

# తాసిల్దార్ కు సమ్మె నోటీసు అందజేసిన విలేజ్ సర్వేయర్లు.

**రుద్రవరం ప్రతినిధి సెప్టెంబర్ 15 (నంది పత్రిక):** దీర్ఘకాలిక తమసమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నంద్యాల జిల్లా రుద్రవరం మండలానికి చెందిన గ్రామ సర్వేయర్లు,ఎస్ జి ఎస్ డబ్ల్యు ఉద్యోగులు సమ్మెకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా మంగళవారం వారు రుద్రవరం తహశీల్దార్ నాగవీణకు సమ్మె నోటీసుతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న నిరసనలకు మద్దతుగా, తమ న్యాయమైన హక్కుల సాధన కోసం ఈ ఆందోళన బాట పడుతున్నట్లు వారు స్పష్టం చేశారు. ప్రతి ఎస్ జి ఎస్ డబ్ల్యూ ఉద్యోగికి కనీస మూలవేతనం రూ. 30 వేలు నిర్ధారించాలని, మల్టీ బాసిజం విధానాన్ని రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న రీ-సర్వే, టీఏ/డీఏ బిల్లులను తక్షణమే చెల్లించాలని, అలాగే ప్రతి సర్వేయర్‌కు ల్యాప్‌టాప్ కేటాయించాలని వారు ప్రధానంగా డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరగాలన్నా, నాణ్యమైన భూ రికార్డులు అందించాలన్నా ముందుగా తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రుద్రవరం మండలానికి చెందిన డి. భవిత, ఎ. ఇలియాస్, నిజాముద్దీన్, సుధాంశు, సుప్రియ తదితర విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.



# పంచాయతీరాజ్ ఇంజనీర్ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ ఇంజనీర్స్ దినోత్సవం





**నంద్యాల ప్రతినిధి. సెప్టెంబర్ 15 . (నంది పత్రిక ):**మంగళవారం భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి పురస్కరించుకుని నిర్వహించే జాతీయ ఇంజనీర్ల దినోత్సవం నంద్యాలలో స్థానిక రామకృష్ణ పిజి కళాశాల ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఇంజనీర్స్ అసోసియేషన్ నంద్యాల జిల్లా విభాగం, పంచాయతీరాజ్ డిప్లమా ఇంజనీర్ల జిల్లా సంఘం, సచివాలయ ఇంజనీర్ల జిల్లా సంఘం సంయుక్త నిర్వహణలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నంద్యాల విజయ బ్లడ్ బ్యాంక్ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రఘురామిరెడ్డి, రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, లయన్స్ అంతర్జాతీయ సంస్థ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ ప్రారంభించారు. 30 మంది ఇంజనీర్లు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు.తదుపరి రామకృష్ణ పిజి కళాశాల ఆడిటోరియంలో పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. రఘురామిరెడ్డి అధ్యక్షతన, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఇంజనీర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.వి. సుధాకర్ రెడ్డి, డిప్లమా ఇంజనీర్స్ సంఘం అధ్యక్షుడు శివ శంకర్, సచివాలయ ఇంజనీర్స్ సంఘం అధ్యక్షుడు సంతోష్ రెడ్డి నిర్వహణలో జరిగిన జాతీయ ఇంజనీర్ల దినోత్సవం లో రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, లయన్స్ అంతర్జాతీయ సంస్థ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ అతిథులుగా పాల్గొన్నారు.ముందుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఇంజనీర్ల దినోత్సవాన్ని ప్రారంభించారు.ఇంజనీర్ల దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన క్రికెట్, షటిల్, చెస్ , క్యారమ్స్ క్రీడా పోటీల విజేతలకు బహుమతులను, ప్రశంసా పత్రాలను అందజేశారు.పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలో ఉత్తమ సేవలు అందించిన అసిస్టెంట్ ఇంజనీర్లు ఏడు మంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లలో, మండలానికి ఒకరు చొప్పున 29 మందికి ఉత్తమ సేవ పురస్కారాలు అందజేశారు.నంద్యాల లయన్స్ క్లబ్ తరపున లయన్స్ సీనియర్ సభ్యులు, ఇంజనీర్లు సుధాకర్ రెడ్డి, సుధీర్ కుమార్ రెడ్డి ల సహకారంతో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రఘురామిరెడ్డి, విశ్రాంత ఇంజనీర్లు మురహరి రావు, పి. రాముడు లకు లయన్స్ క్లబ్ జాతీయ ఇంజనీర్ల దినోత్సవం పురస్కారాలు అందించి సన్మానించారు.ఇంజనీర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని నవజీవన్ బదిరుల పాఠశాల కు క్రీడా పరికరాల కొనుగోలుకు 12 వేల రూపాయలు విరాళాలు అందించారు.ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రఘురాం రెడ్డి మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జాతికి చేసిన సేవలను గుర్తుచేసి, వారి స్ఫూర్తితో యువ ఇంజనీర్లు జాతి నిర్మాణంలో పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి రంగంలో ఇంజనీర్ల పాత్ర ప్రముఖంగా ఉంటుందన్నారు. సాంకేతికతను పెంపొందించుకుని ప్రజలకు సేవలు అందించాలని కోరారు.డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ మానవజాతి అభివృద్ధి ప్రతి దశలో ఇంజనీర్ల పాత్ర ఉందని, వైద్యరంగం, వ్యవసాయ రంగం, జాతీయ రక్షణ రంగం ఇలా ప్రతి రంగంలో ఇంజనీర్లు సాధించిన ప్రగతి, పరిశోధనలే ప్రపంచ అభివృద్ధికి కీలకంగా ఉన్నాయని ఇంజనీర్ల సేవలను కొనియాడారు.ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఇంజనీర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ సచివాలయ ఇంజనీర్ల సేవలను ప్రశంసించి వారి కి అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నెరవేర్చాలని అన్నారు.రామకృష్ణ బిజీ కళాశాల డైరెక్టర్ హేమంత్ రెడ్డి మాట్లాడుతూ యువ ఇంజనీర్లు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవడం ద్వారా మెరుగైన సేవలు అందించడానికి అవకాశం ఉంటుందన్నారు.కార్యక్రమాల్లో అతిథులుగా పాల్గొని ఇంజనీర్ల సేవలను కొనియాడిన డాక్టర్ రవి కృష్ణ,డాక్టర్ సహదేవుడు, రామకృష్ణ విద్యా సంస్థలు డైరెక్టర్ హేమంత్ రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు సందీప్ లను మూడు ఇంజనీర్ సంఘాల తరపున సత్కరించారు.కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఇంజనీర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి సచివాలయ ఇంజనీర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, సలహాదారు వంశీధర్, కోశాధికారి కరీముల్లా, పంచాయతీరాజ్ డిఇ లు వహీద్, మన్మథ బాబు, అయాజ్ అహ్మద్, మల్లికార్జున, లక్ష్మీదేవి, నళిని, సుధాకర్ బాబు, రమణ, అసిస్టెంట్ ఇంజనీర్లు శ్రీనివాసులు, సుధీర్ కుమార్ రెడ్డి, వెంకటరాముడు, కమాల్ సాహెబ్, వెంకటరమణ, చెంచయ్య, జయన్న, లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు డాక్టర్ సహదేవుడు,లయన్స్ క్లబ్ అధ్యక్షులు సందీప్ కుమార్, రీజియన్ చైర్మన్ నిజాముద్దీన్, జోనల్ చైర్మన్ నాగరాజు, రవి ప్రకాష్ యూసుఫ్, జనార్ధన్ , జిల్లా నలుమూలల నుండి వచ్చిన సచివాలయ ఇంజనీర్లు పాల్గొన్నారు.



# గ్రామ రెవిన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలి

## - ఈ నెల 18న సీసీఎల్ ఆఫీస్ ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయండి - సిఐటియు



**కొత్తపల్లి - నంది పత్రిక :** రెవెన్యూ సహాయకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఈ నెల 18న మంగళగిరి సీసీఎల్ ఆఫీసు ముందు జరిగే ధర్నాలో గ్రామ రెవెన్యూ సహాయకులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, సలాం డిమాండ్ చేశారు మంగళవారం గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం( సిఐటియు) ఆధ్వర్యంలో తాహాసిల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ బాబు మియా కు వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకులకు గత ఎనిమిది సంవత్సరాలుగా వేతనాలు పెరగలేదని పెరుగుతున్న ధరల కనుగుణంగా వేతనాలు పెంచుతూ వీఆర్ఏలకు ఎస్కే లమాలు చేయాలని, అర్హత ఉన్న వీఆర్ఏలను వన్ టైం సెటిల్మెంట్ ద్వారా వీఆర్వోలుగా ప్రమోషన్ ఇవ్వాలన్నారు రాష్ట్రంలో 19359 మంది గ్రామ రెవెన్యూ సహాయకులు అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారు 2018 లో అప్పటి ముఖ్యమంత్రి 6500 వేతనాన్ని 10500 పెంచారు అప్పటి నుంచి వేతనాలు పెరగలేదు అన్నారు, గత ప్రభుత్వం గ్రామ రెవెన్యూ సహాయకులకు ఇచ్చిన డి ఏ ను కూడా వెనక్కి తీసుకొని రికవరీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పరిష్కారం అవుతాయని ఆశపడిన గ్రామ రెవెన్యూ సహాయకులకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు అయినా ఏ ఒక్క సమస్యను పరిష్కరించక పోగా , నిబంధనలకు విరుద్ధంగా, నైట్ వాచ్మెన్, అటెండర్ డ్యూటీలు వేయడమే కాకుండా రీసర్వేలకు మైళ్ళ కొద్ది దూరంలో డ్యూటీలు వేస్తూ బానిసల్లాగా పని చేయించుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు వీఆర్వో, అటెండర్, మరియు నైట్ వాచ్మెన్ ప్రమోషన్ కోటాను 20 నుండి 70 శాతం పెంచాలన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ సహాయకులు విజయుడు, మియా సావ్, ముర్తుజా, శివ, వెంకటేశ్వర్లు, ఓబులేసు, నాగేష్, ముర్తుజావలి, భూషన్న, నాగన్న, శంకర్ పాల్గొన్నారు

# గణేష్ ఉత్సవాల్లో ఘనంగా నృత్య పోటీలు

## విద్యార్థుల ప్రతిభకు వేదికగా సాంస్కృతిక కార్యక్రమాలు






**డోన్ నంది పత్రిక సెప్టెంబర్ 15** డోన్ పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్న కోట్ల వారి గణేష్ఉత్సవాలు2026లో భాగంగా రెండో రోజు పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల కోసం నృత్య పోటీలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ నృత్య ప్రతిభను ప్రదర్శించడంతో కార్యక్రమ ప్రాంగణం సందడిగా మారింది.ఈ కార్యక్రమానికి గౌరవ డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి, యువ నాయకులు కోట్ల రాఘవేంద్ర రెడ్డి హాజరై విద్యార్థుల నృత్య ప్రదర్శనలను వీక్షించి వారిని అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. గణేష్ ఉత్సవాలను కేవలం భక్తి కార్యక్రమాలకే పరిమితం కాకుండా, విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేలా వివిధ సాంస్కృతిక పోటీలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.విద్యార్థులు తమలోని సృజనా త్మకతను, కళా ప్రతిభను ప్రదర్శించేందుకు కోట్ల వారి గణేష్ ఉత్సవాలు2026 ఒక మంచి వేదికగా నిలుస్తున్నాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులను ప్రోత్సహించే మరిన్ని కార్యక్రమాలను నిర్వహిస్తామని అన్నారు.కాగా, ఈ నృత్య పోటీల్లో దాదాపు 30 పాఠశాలలు, 8 కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని మొత్తం 105 నృత్య ప్రదర్శనలు ఇచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. వివిధ రకాల నృత్య ప్రదర్శనలతో విద్యార్థులు ఆకట్టుకోగా, తల్లిదండ్రులు, ప్రేక్షకులు ఉత్సాహంగా ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీర్ల దినోత్సవ వేడుకలు



**నంద్యాల ప్రతినిధి. సెప్టెంబర్ 15 . (నంది పత్రిక ):**నంద్యాలలోని శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాల (అటానమస్), ప్రఖ్యాత ఇంజనీర్ మరియు రాజనీతిజ్ఞుడు, భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని, 15 సెప్టెంబర్ 2026న ఇంజనీర్ల దినోత్సవాన్ని అత్యంత ఉత్సాహంగా మరియు వైభవంగా జరుపుకుంది. ఈ కార్యక్రమంలో అధ్యాపక వర్గం యొక్క అంకితభావంతో కూడిన కృషి మరియు విజయాలను గుర్తిస్తూ, అధ్యాపకుల ప్రోత్సాహకాల పంపిణీ కార్యక్రమం కూడా జరిగింది.ఈ కార్యక్రమానికి చైర్మన్ డాక్టర్ ఎం. శాంతిరాముడు మరియు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వి. సుబ్రమణ్యం ముఖ్య అతిథిగా హాజరై, అధ్యాపకులకు తమ శుభాకాంక్షలు తెలిపారు మరియు దేశ నిర్మాణంలో ఇంజనీర్లు, విద్యావేత్తల కీలక పాత్రను ప్రముఖంగా ప్రస్తావించారు.ప్రార్థనతో ప్రారంభమైన ఈ వేడుకల అనంతరం, సర్ ఎం. విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, పూలమాల వేశారు. ఇంజనీరింగ్, మౌలిక సదుపాయాల అభివృద్ధి మరియు దేశ ప్రగతికి విశ్వేశ్వరయ్య చేసిన అద్భుతమైన సేవలను ఈ నివాళి గుర్తుచేసింది.సభకు స్వాగతం పలుకుతూ, డీన్ డాక్టర్ జి. సౌమ్య ఆర్ ఇంజనీర్స్ డే ప్రాముఖ్యత గురించి మాట్లాడారు. ఇంజనీరింగ్ అంటే కేవలం సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే కాదని, అది ఆవిష్కరణ, సమస్య పరిష్కారం, సామాజిక బాధ్యత మరియు సమాజానికి సుస్థిరమైన పరిష్కారాలను సృష్టించడం కూడా అని ఆమె నొక్కి చెప్పారు. విద్యార్థులను సమర్థవంతమైన మరియు బాధ్యతాయుతమైన నిపుణులుగా తీర్చిదిద్దడంలో అధ్యాపక బృందం యొక్క సమిష్టి కృషిని ఆమె అభినందించారు.సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వి. సుబ్రమణ్యం, విద్యా నైపుణ్యం, విద్యార్థుల అభివృద్ధి, పరిశోధన, ఆవిష్కరణ మరియు సంస్థాగత అభివృద్ధి పట్ల అధ్యాపక బృందం యొక్క నిబద్ధత మరియు అంకితభావాన్ని అభినందించారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో నిరంతర అభ్యాసం, వృత్తిపరమైన అభివృద్ధి మరియు సమిష్టి కృషి యొక్క ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు.చైర్మన్ డాక్టర్ ఎం. శాంతిరాముడు తన ప్రసంగంలో, ఇంజనీర్స్ డే సందర్భంగా అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు. ఆధునిక సమాజాన్ని తీర్చిదిద్దడంలో ఇంజనీర్ల పరివర్తనాత్మక పాత్రను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు.మరియు భవిష్యత్ ఇంజనీర్లను అభివృద్ధి చేయడంలో అధ్యాపకుల కృషిని అభినందించారు. శ్రేష్ఠత, ఆవిష్కరణ మరియు ప్రభావవంతమైన విద్యను అందించే తమ ప్రయత్నాలను కొనసాగించాలని ఆయన అధ్యాపక బృందాన్ని ప్రోత్సహించారు.ఈ వేడుకలో ఒక ప్రధాన ఘట్టం ఏమిటంటే, 71 మంది అధ్యాపకులు చేసిన విలువైన సేవలు మరియు సాధించిన విజయాలకు గుర్తింపుగా వారికి ప్రోత్సాహకాలను పంపిణీ చేయడం. బోధన, విద్యాపరమైన పనితీరు, పరిశోధన, నూతన



ఆవిష్కరణలు, విద్యార్థులకు మార్గదర్శకత్వం మరియు ఇతర సంస్థాగత బాధ్యతల పట్ల అధ్యాపకుల నిబద్ధతను ఈ ప్రోత్సాహకాలు గుర్తించాయి.అధ్యాపకుల నిరంతర కృషిని ప్రముఖులు అభినందించారు మరియు ఇటువంటి గుర్తింపు వారి వృత్తి జీవితంలో మరిన్ని ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి వారిని ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. అన్ని శాఖల హెచ్ఓడీలు, డీన్‌లు మరియు అధ్యాపకులు ఈ కార్యక్రమానికి హాజరై యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ ప్రోత్సాహకాల పంపిణీ, ప్రశంస, పనితీరు మరియు శ్రేష్ఠత అనే సంస్కృతిని సృష్టించడంలో సంస్థ యొక్క నిబద్ధతను ప్రతిబింబించింది. అధ్యాపక బృందం యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలుపుతూ, సంస్థకు తాము చేసిన కృషికి మరియు అందించిన సేవలకు లభించిన అర్థవంతమైన గుర్తింపుగా ఈ కార్యక్రమాన్ని ప్రశంసించారు.ఈ వేడుకను విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన యాజమాన్యం, ప్రముఖులు, అధ్యాపకులు మరియు అందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ, ధన్యవాదాల సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

# శిల్పా నేచర్ హోమ్స్ లో ఘనంగా గణేష్ ఉత్సవాలు

**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 15 నంది పత్రిక** ఆళ్లగడ్డ పట్టణంలోని శిల్పా నేచర్ హోమ్స్ లో గణేష్ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గణేష్ కార్య నిర్వాహక కమిటీ అధ్యక్షులు డాక్టర్ రామ్ గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇస్కాన్ సంస్థకు చెందిన లోకేశ్వరి మాతాజీ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహించారు. అనంతరం పిల్లలకు క్విజ్ తదితర పోటీలు నిర్వహించి గెలుపొందిన చిన్నారులు ఆరాధ్య, ప్రజ్వల్ లకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగేంద్ర ప్రసాద్, నరసింహ, శేఖర్ రెడ్డి, టెంట్ హౌస్ కుమార్, ఫర్టిలైజర్ లక్ష్మిరెడ్డి, కేవిపి సుబ్బారావు సుధా, మాధురి, ఉష తదితరులు పాల్గొన్నారు.



# బేతంచెర్ల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి.

## సెప్టెంబర్ 18న తహసీల్దార్ కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయండి. ఎపి.రైతుసంఘం బేతంచెర్ల మండల కమిటి.

**బేతంచెర్ల సెప్టెంబర్ 15 ( నంది పత్రిక ).** రాష్ట్ర కూటమి ప్రభుత్వం నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలమును, కరువు మండలంగా ప్రకటించి, పంటల బీమా వర్తింపజేయాలని కోరుతూ,ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం బేతంచెర్ల మండల కార్యదర్శి పి. రామమోహన్ ఆధ్వర్యంలో ఆటో జాతా కార్యక్రమం మంగళవారం నాడు నిర్వహించడమైనది.బేతంచెర్ల మండలం అంబాపురం గ్రామంలోకరువు సమస్యలపై కరపత్రాలపంపిణీ కార్యక్రమం చేయడం జరిగింది.ఈ కార్యక్రమనకు జిల్లా ఉపాధ్యక్షులు వి.సుబ్బరాయుడు హాజరై మాట్లాడుతూఈ సంవత్సరములో ఎలినినో ప్రభావంతో మండలంలో రైతుల వేసిన పంటలు పూర్తిగా ఎండిపోయి, ఉన్న పంటలు ఇప్పుడు వర్షం పడిన దిగుబడులు వచ్చే పరిస్థితి లేదన్నారు.అందువలన ప్రభుత్వం వెంటనే కరువు సహాయక చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులందరూ సెప్టెంబర్ నెల 18వ తేదీన బేతంచెర్ల మండల తహసీల్దార్ కార్యాలయము ముందు జరిగే ధర్నాకు, రైతులు తమ పొలంలో వేసిన పంటల నష్టాన్ని తెలియజేస్తూ, వ్యక్తిగత అర్జీలు తీసుకొని రావాలని పిలుపునిచ్చారు.అలాగే సెప్టెంబరు నెల 21వ తేదీన నంద్యాల జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము దగ్గర జరిగే “నంద్యాల జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి“ అనే ధర్నాలో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.బేతంచెర్ల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, కరువు సహాయక చర్యలు చేపట్టాలి. రైతు, కౌలు రైతుల అన్ని రకాల అప్పులను మాఫీ చేయాలి, పంటల బీమా వర్తింపజేయాలి. దేవాదాయ భూములు కౌలుకు సాగు చేస్తున్న కౌలు రైతులందరికీ, ఒక సంవత్సరం కౌలును రద్దు చేయాలి.మూగ జీవాలకు మేత కొరత లేకుండా,ప్రభుత్వమే గడ్డి కేంద్రాలను ఏర్పాటు చేసి, మేతను ఉచితంగా రైతులకు అందించాలి. బేతంచెర్ల మండలంలో ఒక్క ఎకరానికి కూడా సాగు నీరు లేదు. గూటు పల్లె చెరువును, హంద్రీ నీవా, సుజల స్రవంతి నీటి కాలువ నుండి, గూటుపల్లె చెరువును నీటితో నింపాలి. బేతంచెర్ల మండలంలోని, గూటుపల్లె చెరువును రిజర్వాయర్ గా నిర్మించాలి. రైతులందరికీ పంటల బీమా ఉచితంగా వర్తింప జేసి బీమా పరిహారాన్ని ప్రభుత్వం చెల్లించాలి. గ్రామాలలోని పేదలకు పనులు కల్పించి, కరువు కూపన్లు పంపిణీ చేసి, ఉచితంగా బియ్యం, నిత్యావసరాల సరుకులు ప్రభుత్వమే పంపిణీ చేయాలి.50 సంవత్సరాలు దాటిన ప్రతి రైతు, మహిళా రైతుకు నెలకు 10 వేల రూపాయలు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ, ఈ నెల 18 వతేది శుక్రవారం నాడు,బేతంచెర్ల మండల తహసీల్దార్ కార్యాలయం దగ్గర జరిగే రైతాంగ ధర్నాలో, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ ఆధారిత కార్మికులు, పేదలు అధిక సంఖ్యలో కదలి వచ్చి,ధర్నాలో పాల్గొని ధర్నాను జయ ప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు ఆలకుంట్ల మధు, అంబాపురం గ్రామ రైతులు పి.శివ గంగన్న, దుబ్బ మడుగు మద్దిలేటి,గుమ్మా మదిలేటి,రామ్మోహన్ రెడ్డి,ఎల్ల కేశవులు, అనిల్, మాదన్న తదితర రైతులు పాల్గొన్నారు.



## మహానంది మండలంలో వైభవంగా వినాయకుని ఉత్సవాలు

### గణనాథులకు ఘన స్వాగతం

### ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు



**మహానంది సెప్టెంబర్ 15 (నంది పత్రిక):–** మహానంది మండలంలో వినాయక చవితి పర్వదినం పురస్కరించుకొని గణనాథులకు భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవాలు పురస్కరించుకొని సోమవారం మహానంది మండల కేంద్రమైన తిమ్మాపురం గ్రామంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో భక్తులు లంబోదరుడికి ఘనంగా స్వాగతం పలికారు.డప్పు వాయిద్యాలు, మేళతాళాలు, భక్తుల జయజయధ్వానాల నడుమ వినాయక విగ్రహాలను ప్రతిష్టించారు. వీధులన్నీ రంగురంగుల పూల అలంకరణలు, మైకుల్లో మారుమోగుతున్న భక్తిపాటలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.వినాయక ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు మంగళవారం నాడు వినాయక మండపాలలో కొలువైన గణనాథులకు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు,అభిషేకాలు నిర్వహించారు.వాడవాడలా కొలువైన విఘ్నేశ్వరుడిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుండటంతో గ్రామాలన్నీ ఆధ్యాత్మిక శోభతో అలలారుతున్నాయి. సాయంత్రం వేళల్లో వినాయక మండపాల వద్ద సాంస్కృతిక నృత్యాలు,మహిళల కోలాటం ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

## వినాయక నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి.



**రుద్రవరం ప్రతినిధి సెప్టెంబర్ 15 (నంది పత్రిక):** రుద్రవరం మండలంలో వినాయక నిమజ్జన వేడుకలను మతసామరస్యంతో ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ రాము, ఎస్ఐ జయప్ప సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో తహశీల్దార్ నాగవేణి, విద్యుత్ ఏఈ రాజశేఖర్ తో కలిసి నిర్వహించిన పీస్ సమావేశంలో అధికారులు మాట్లాడుతూ దేవుడి దగ్గర అందరూ సమానమేనని, ఎలాంటి పట్టింపులకు పోకుండా కలిసికట్టుగా వేడుకలు నిర్వహించుకోవాలన్నారు. ఉదయం 10 గంటలకే ఊరేగింపు ప్రారంభించి సాయంత్రం 6 గంటల లోపు ముగించాలని, డీజేలకు ఎలాంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు. పోలీసులు అనుమతించిన రూట్లలోనే ఊరేగింపు జరగాలని, రసాయనాలు లేని సహజ రంగులనే వాడాలని, డ్రైవర్లు ఎట్టి పరిస్థితుల్లో మద్యం సేవించి వాహనాలు నడపరాదని తెలిపారు. భద్రతా దృష్ట్యా నిమజ్జనం వద్దకు చిన్నపిల్లలను తీసుకురావొద్దని, చెరువులు, కాలువలలోకి ఎవరూ లోపలికి దిగకూడదని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, బైండోవర్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని అధికారులు సూచించారు.

## వినాయకుడి ఆశీస్సులతో ప్రతి ఇంట సుఖసంతోషాలు వెల్లివిరయ్యాలి.





**నంది పత్రిక గడివేముల** గడివేముల మండలం పెసరవా యిగ్రామంలో వినాయకుడి ఆశీస్సులతో ప్రతి ఇంట సుఖ సంతోషాలతో విరాజిల్లాలని కమిటీ సభ్యులు అన్నారు. వినాయక చవితి పండుగ సందర్భం కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితి పండగ పురస్కరించుకొని అత్యంత వైభవంగా వినాయకుని విగ్రహాన్ని కొలువు తీర్చి వినాయక విగ్రహానికి టెంకాయలు సమర్పించి కమిటీ అత్యంత వైభవంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు కలిసి మండపంలో ఏర్పాటు చేసిన విగ్నేశ్వరుడికి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణనాథుడి పూజ ఎంతో గొప్ప ఆధ్యాత్మిక అనుభూతినిచ్చి గణపతి వివేకానికి విజయానికి ప్రత్యేకత ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కే.ప్రసాద్ రెడ్డి కైప హరినాథ్ రెడ్డి. కైప వెంకటేష్ రెడ్డి.దూదేకుల పుల్లయ్య. గోపాల్ రెడ్డి. తదితరులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు

## రచయిత బొల్లు రామ్మోహన్ కు ఘన సన్మానం ...

**పోరుమామిళ్ల, సెప్టెంబర్ 15:(నంది పత్రిక )** ఢిల్లీలో జాతీయ విశేష వాగ్దేవి ప్రతిభా పురస్కార గ్రహీత రచయిత ,కవి బొల్లు రామ్మోహన్ కు పలువురు జిల్లా రచయితలు మంగళవారం పోరుమామిళ్లలో రచయిత స్వగృహంలో ఘనంగా సన్మానించారు. సగిలేరు గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న రామ్మోహన్ కడప జిల్లా సాహిత్య కార్యక్రమాలలో విస్తృతంగా పని చేస్తున్నందుకు గాను ఈ పురస్కారానికి ఎన్నికయ్యారు. భవిష్యత్తులో సాహిత్య, సాంస్కృతిక ,రచన కార్యక్రమాలలో మరింత చురుగ్గా పాల్గొంటానని రామ్మోహన్ తెలిపారు.విద్యార్థులలో చిన్ననాటి నుంచే రాయలసీమ చరిత్ర, సాహిత్య , సాంస్కృతిక,రచన ప్రక్రియలలో ఆసక్తిని పెంచేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్, స్టూడెంట్స్ కెరీర్ మెంటార్, బొమ్మిశెట్టి మోహన్, రచయిత ,కవి, అధికార భాష సంఘం పూర్వ సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య రచయిత చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్, తిరుమల శెట్టి సుబ్బారావు, బాలయ్య, సుబ్బరాయుడు , రఘురాం ,వెంకట రామ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## చిన్నటేకూరు వద్ద లారీ క్యాబిన్లో వివాహిత మృతి

### దర్యాప్తు చేస్తున్నామన్న పోలీసులు మృతికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది



**కర్నూల్ సిటీ నందిపత్రిక** కర్నూలు జిల్లా కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన బోయ లక్ష్మీదేవి లారీ క్యాబిన్లో అనుమానాస్పద మృతి చెందింది భర్త బి ఎం మల్లికార్జున తెలిపిన వివరాలు వెంకటగిరి గ్రామం కోడుమూరు మండలం అను ఆమెను ఆమె భర్త శుక్రవారం అనగా 11 సెప్టెంబర్ 2026 వ తారీఖున రాత్రి 11:30 గంటలకు తన ఊరు నుండి తీసుకెళ్లి 14వ తారీఖున మధ్యాహ్నం 3 గంటలకు బోయ మల్లికార్జున బోయ లక్ష్మీదేవి బంధువులకు ఫోన్ చేసి మీ కూతురు లారీలో చనిపోయింది అని ఫోన్ చేసి చెప్పగా దానితో ఆమె బంధువులు చిన్నటేకూరు గ్రామంలోని హై స్కూల్ ముందర గల లారీ వద్దకు వచ్చి చూడగా అక్కడ లారీ క్యాబిన్లో బోయ లక్ష్మీదేవి చనిపోయి ఉండినది ఈ విషయం పైన బోయ లక్ష్మీదేవి అన్న బోయ రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడమైనది.

## మద్యం షాపుల లైసెన్స్ రెన్యువల్‌పై అవగాహన.



**బేతంచెర్ల సెప్టెంబర్ 15 ( నంది పత్రిక ).** నంద్యాల జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎస్. రవికుమార్ ఆదేశాల మేరకు, బేతంచెర్ల మండలంలోని బ్రాందీ షాపుల లైసెన్స్ దారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లైసెన్స్ రెన్యువల్ ప్రక్రియ, ఫీజుల వివరాలను అధికారులు వివరించారు. బేతంచెర్ల పరిధిలో లైసెన్స్ ఫీజు 60లక్షల50 వేల రు పాయలు , రెన్యువల్ ఫీజు రూ.23 లక్షలు, పర్మిట్ రూమ్ ఫీజు రూ.5 లక్షలు, ప్రాసెస్ ఫీజు రూ.5 వేలు ఉంటుందని డోన్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ జఫరుల్లా,ఎస్సై సోమశేఖర్ లు లైసెన్స్ దారులు నిర్ణీత ప్రక్రియ ప్రకారం రెన్యువల్ చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో లైసెన్స్ దారులు మోహన్ రెడ్డి, నాగరాజు,పాల శేఖర్, రూబెన్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో జాతీయ మహిళా కాంగ్రెస్ ఫౌండేషన్ డే వేడుకలు

### మహిళలపై దాడులను సహించం ఎంతవరకైనా పోరాడుతాం

### జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మీసాల సుమలత



**కర్నూలు సిటీ నంది పత్రిక** జాతీయ మహిళా కాంగ్రెస్ ఫౌండేషన్ డే సందర్భంగా కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మీసాల సుమలత ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.ఈ సందర్భంగా మీసాల సుమలత మాట్లాడుతూ, భారత జాతీయ కాంగ్రెస్ పార్టీకి మహిళా కాంగ్రెస్ విభాగం ఎంతో కీలకమైనదని అన్నారు. మహిళల హక్కులు, సాధికారత, సమానత్వం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. దేశంలో మహిళలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో సముచిత ప్రాధాన్యత కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. రాబోయే రోజుల్లో మహిళా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసి, ప్రజా సమస్యలపై మహిళల తరఫున నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మహిళా జిల్లా నాయకురాలు భాగ్యలక్ష్మి, రామేశ్వరీ, శిరీష, లక్ష్మీదేవి, మీనాక్షి, నర్సమ్మ, మద్దమ్మ మొదలగు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## కోటపాడు గ్రామంలో భక్తిశ్రద్ధలతో గణేష్ పూజలు





**సిరివెళ్ల (నంది పత్రిక):** సిరివెళ్ల మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో అత్యంత వైభవంగా ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని మల్లు దామోదర్ రెడ్డి దంపతులు, మనోహర్ రెడ్డి దంపతులు, సుబ్బ నారాయణరెడ్డి దంపతులు, బ్రహ్మానంద రెడ్డి దంపతులు, మహేంద్ర దంపతులు మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి విఘ్నేశ్వరుని ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలిసికట్టుగా సంప్రదాయాలను కాపాడుకుంటూ పండుగలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమని, వినాయక చవితి వేడుకలు గ్రామాల్లో ఐక్యతను, సంతోషాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. పూజా కార్యక్రమాలను తరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తుల అలరణార్థం శివ గౌరీ గణేష్ కోలాటం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం హిందూ ధర్మ ప్రచారక్ నాగమల్లేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో పిల్లలకు ఆటల పోటీలు, భక్తి పాటల పోటీలు నిర్వహించి, విజేతలకు నాగమల్లేశ్వర్ రెడ్డి దంపతులు బహుమతులు అందజేశారు; గ్రామంలో ఆధ్యాత్మిక వైభవాన్ని పెంపొందించేందుకే ఈ పోటీలను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

## బేతంచెర్ల ఎంపీడీఓ కార్యాలయంలో ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితా ప్రదర్శన.

**బేతంచెర్ల సెప్టెంబర్ 15 ( నంది పత్రిక ).** బేతంచెర్ల మండల ఎంపీటీసీ ఎన్నికలకు మరియు జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి బేతంచెర్ల మండలంలో ప్రచురించిన ముసాయిదా పోలింగ్ కేంద్రాల (డ్రాఫ్ట్ ౹ాశీశ్రీశ్రీఱఅస్త్ర స్టేషన్స్ ) జాబితాను ఎంపీడీవో కార్యాలయంలోని నోటీసు బోర్డుపై ప్రదర్శించారు. బేతంచెర్ల మండలంలో మొత్తం 15 ఎంపీటీసీ స్థానాలు, 1 జడ్పీటీసీ స్థానం ఉండగా, ఆయా స్థానాలకు సంబంధించి మొత్తం 50 పోలింగ్ కేంద్రాలను ముసాయిదా జాబితాలో పొందుపరిచారు.ఈ సందర్భంగా బేతంచెర్ల మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి ఎం.ఫజల్ రహమాన్, డిప్యూటీ ఎంపీడీవో మల్లికార్జున, ఎవో ఇద్రుస్ భాషాతో పాటు పంచాయతీ అభివృద్ధి అధికారులు కూడా పాల్గొన్నారు. అధికారులు ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను నోటీసు బోర్డుపై ప్రజల పరిశీలనార్థం ప్రదర్శించారు. ఈ ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పరిశీలించి, పైన పేర్కొన్న విషయం పై ఎవరికైనా, ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే, తమ అభ్యంతరాలను వ్రాత పూర్వకంగా ఎంపీడీఓ కార్యాలయంలో సమర్పించ వలసిందిగా కోరడమైనది.



## పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి




**రుద్రవరం ప్రతినిధి సెప్టెంబర్ 15 (నంది పత్రిక):** మండల పరిధిలోని 21 గ్రామ పంచాయతీల లో ఏర్పాటుచేసిన ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను మంగళవారం అధికారికంగా ప్రచురించినట్లు ఎంపీడీవో తెలిపారు. ప్రచురించిన ఎంపిటిసి జడ్పిటిసి ఎన్నికల ముసాయిదా జాబితా పై ఓటర్లకు గాని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఏవైనా అభ్యంతరాలు సవరణలు లేదా క్లైములు ఉన్నట్లయితే వాటిని బుధవారం (16-09-2026 తేదీ) సాయంత్రం 5 గంటల లోపు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో లిఖితపూర్వకంగా సమర్పించవచ్చునని తెలిపారు. ఈ ముసాయిదా జాబితాను మండల పరిషత్ కార్యాలయము అలాగే సంబంధిత గ్రామ సచివాలయాలలో ప్రజల పరిశీలనార్థం అందుబాటులో ఉంచడం జరిగిందని, ఓటర్లు రాజకీయ పార్టీల ప్రతినిధులు ముసాయిదా జాబితాను గమనించి నిర్దేశిత గడువులోగా క్లైములను తెలియజేయాలని ఎంపీడీవో కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బాలాంజనేయులు, ఏవో సుబ్రహ్మణ్యం, సిబ్బంది ఉన్నారు.

## తక్కువ నీటి వినియోగం గల పంటలు సాగు చూసుకోవాలి.... వ్యవసాయ అధికారి సుమతి.



**రుద్రవరం ప్రతినిధి సెప్టెంబర్ 15 (నంది పత్రిక):** తక్కువ నీటి వినియోగం గల పంటలను రైతులు సాగు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుమతి తెలిపారు. మంగళవారం మండలంలోని శ్రీరంగాపురం గ్రామం లో వ్యవసాయ అధికారి జి సుమతి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వలన వర్షాలు సరైన సమయానికి పడినందువలన బోరు బావులు ఉన్న రైతులు తక్కువ నీటి వినియోగం గల పంటలైన మినుము,పెసర, నువ్వులు కొర్ర ఆముదం వంటి ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని తెలిపారు మొక్కజొన్న పైరుకు నీటి తడులు ఎక్కువ అవసరం ఉన్నందువలన దానికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటి వినియోగం గల పంటలను సాగు చేసుకుని నీటిని పొదుపుగా వాడుకోవాలని రైతులకు తెలియజేశారు. రాబోయే రోజులలో మినుములు 80% సబ్సిడీలో రైతులకు అందజేయడం జరుగుతుందని కావలసిన రైతులు రైతు సేవ కేంద్రాల సిబ్బందిని సంప్రదించాలని రైతులను కోరారు. డ్రిప్ మరియు స్ప్రింక్లర్ పరికరాలు కావలసిన రైతులు రైతు సేవ కేంద్రాల సిబ్బంది సంప్రదించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి రాజు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ రవితేజ గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల నమోదు గడువును సెప్టెంబర్ ఆఖరి వరకు పొడిగించాలి.

### అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలి.

### బి.గిడ్డయ్య.....సిపిఐ జిల్లా కార్యదర్శి



**కర్నూలు సిటీ నంది పత్రిక** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకంలో నూతన పెన్షన్ల నమోదుకు ఇచ్చిన గడువును ఈ నెలాఖరు వరకు పొడిగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ఒక ప్రకటనలో తెలియజేస్తూ, అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు కావస్తున్నదని, లక్షలాదిమంది వృద్ధులు, వితంతువులు, వికలాంగులు,ఒంటరి మహిళలు,పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం నూతన పెన్షన్ల నమోదుకు ఈ నెల 07తేదీ నుండి 16 వరకు గడువు విధించడం వల్ల అర్హులైన అనేక మంది దరఖాస్తు చేసుకునేందుకు సంబంధిత కార్యాలయాలు దగ్గరికి పోతే ఆన్లైన్, సర్వర్ ప్రాబ్లమ్స్ కారణంగా పెన్షన్ నమోదు చేసుకోవడం ఆలస్యం అవుతున్న కారణంగా అనేకమంది అర్హులైనటువంటి ప్రజలు ఇంకా నమోదు చేసుకోవాల్సిన వారు ఉన్నారని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ల నమోదు గడువును సెప్టెంబర్ ఆఖరి వరకు పొడిగించాలని ఆయన కోరారు.ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకంలో నూతనంగా నమోదు చేసుకునే వృద్ధులు, వితంతువులు, చర్మకారులు, డప్పు కళాకారులు తదితర అర్హులైన లబ్ధిదారులు అవసరమైన కుల, ఆదాయ మరియు ఇతర ధ్రువీకరణ పత్రాలను సమకూర్చుకోవడానికి కొంత సమయం పడుతుందని, ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 50 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హుడైన పేదవారికి పెన్షన్ అందించే హామీని అమలు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎటువంటి రాజకీయ జోక్యం లేకుండా పారదర్శకంగా పెన్షన్ ప్రక్రియను అమలు చేయాలని,అవినీతికి తావులేకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## తండ్రి మందలించాడని యువకుడి ఆత్మహత్య: బోయ రేవులలో విషాదం

**వెలుగోడు సెప్టెంబర్ 15 (నంది పత్రిక):**

తండ్రి మందలించాడనే క్షణికావేశంలో ఒక యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషాద సంఘటన వెలుగోడు మండలంలో చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బోయరేవుల గ్రామానికి చెందిన గోరుకంటి మురళి (24 సం.) అనే యువకుడిని ఇంట్లో అతని తండ్రి మందలించాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మురళి కోపంతో ఇంట్లోంచి బయటకు వచ్చేశాడు. వెలుగోడు గ్రామ సరిహద్దులో గల మోడల్ స్కూల్ ఎదురుగా ఉన్న ఫారెస్ట్ ప్రదేశానికి చేరుకుని, క్షణికావేశంలో పురుగుల మందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు.

మృతుడి తండ్రి గోరుకంటి వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ బి సురేష్ తెలిపారు. చేతికి అందిన కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో బోయరేవుల గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

## ఎత్తిపోతల నుంచి చెరువులను నీటితో నింపాలి



**కొత్తపల్లి - నంది పత్రిక :** మండలంలోని సంగమేశ్వరం శివపురం ఎత్తిపోతల పథకాల నుంచి చెరువులను నీటితో నింపాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఏ. రాజశేఖర్ జిల్లా నాయకులు సంజీవ రాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని చిన్న గుమ్మడాపురం గ్రామ శివారులో ఉన్న కల్వకుర్తి నుంచి నంద్యాల జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో పగిలిపోయిన ఎత్తిపోతల పైపులైను రైతులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో పగిలిపోయిన ఎత్తిపోతల పథకం పైప్ లైన్ వల్ల మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న రైతాంగం తీవ్ర ఇబ్బందులకు గురి కావలసిన పరిస్థితి నెలకొంది అన్నారు. అధికారుల ముందు చూపు లేని కారణంగా పైపులైన్ పగిలిపోయి నెల రోజులు కావస్తున్న పట్టించుకోకపోవడంతో రైతులకు సాగునీరు లేక ఉన్న పంటలు కూడా ఎండిపోయాయి అన్నారు. ఎత్తిపోతల నుంచి రైతుల పొలాలకు సాగునీరు అందించాల్సిన ప్రధాన పైపులైన్ పగిలిపోవడం వల్ల రైతులు చాలా ఇబ్బందులకు గురి కావలసిన పరిస్థితి నెలకొంది అన్నారు. ఎత్తిపోతల నుంచి మండలంలోని శివపురం, సింగరాజుపల్లి గ్రామాల్లో ఉన్న చెరువులను నీటితో నింపాలన్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులతో మాట్లాడగా స్పందించిన ఈఈ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎత్తిపోతల పథకం పైప్ లైన్ లీకేజీ పనులను రెండు రోజుల్లో తాత్కాలికంగా మరమ్మతులు చేయిస్తామన్నారు. ఎత్తిపోతల నుంచి మండలంలోని చెరువులన్నీ నీటితో నింపి తాగునీటి కష్టాలు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శేఖర్, రైతులు గంగన్న, సుబ్బరాయుడు, కృష్ణుడు, మా భాష, రామకృష్ణుడు, జ్ఞానసురుడు, స్వాములు, గోపాల్, శ్రీనివాసులు, దాసు, మైనర్ ఇరిగేషన్ అధికారులు ఉన్నారు. ।

## స్థానిక ఎన్నికల పోరుకు సిద్ధంకండి
## కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే



**కోవెలకుంట్ల సెప్టెంబర్ 15నందిపత్రిక** స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులు గెలుపు సాధించేదిశగా కార్యకర్తలు నాయకులు పట్టుదలతో పనిచేయాలని వైసీపీ మాజీ శాసన సభ్యులు కాటసాని రామిరెడ్డి వైసీపీ కార్యకర్తలు నాయకులకు సూచించారు. మంగళవారం కోవెలకుంట్ల పట్టణం వి ఆర్ ఎన్ ఆర్ ఫంక్షన్ హాల్ నందు కోవెలకుంట్ల మండల స్థాయి వైఎస్సార్సీపీ కార్యకర్తల సమావేశము మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వైఎస్సార్సీపీ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తొందరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల పోరుకు సిద్ధం కావాలంటూ వైఎస్సార్సీపీ శ్రేణులకు పిలుపు నిచ్చారు.

**ఎన్నికల్లో ప్రతి చోట గట్టిపోటీ నిద్దాం....** ఈ స్థానిక ఎన్నికల్లో గ్రామ గ్రామంలో ప్రతిచోట పోటీ చేద్దాం మీ కందరికి అండగా నేను పార్టీ ఉంటుంది. అభ్యర్థుల గెలుపుకు ప్రతి కార్యకర్త నాయకులు పనిచేయాలన్నారు.

**కూటమి ప్రభుత్వ హామీల అమలు పై విమర్శలు** కూటమి ప్రభుత్వం 2024 ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని సంపూర్ణంగా నెరవేర్చలేదని విమర్శించారు 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు 1500 హామీ ఏమయింది నిరుద్యోగులకు నెలకు 3000 వేల రూపాయల హామీ ఏమయింది సంవత్సరానికి 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తాను అన్న హామీ ఏమయింది నీవు చెప్పిన హామీలు అన్ని గాలిలోనే ఉన్నాయని కూటమి ప్రభుత్వ అధినేత పై విమర్శలు గుప్పించారు.ప్రస్తుతం శ్రీశైలం రియర్వాయర్ లో 870 అడుగులు పైన నీరు ఉన్నప్పటికీ రైతులకు సాగు నీరు అందించలేని దద్దమ్మ ప్రభుత్వం కూటమి ప్రభుత్వం గతంలో 854 అడుగులకే రైతులకు సాగు నీరు అందించిన ఘనత వైఎస్సార్సీపీ పార్టీ దని అన్నారు. కార్యక్రమం లో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు భూమా కిషోర్ కుమార్ రెడ్డి ,వైఎస్సార్సీపీ నాయకులు కర్రా హర్షవర్ధన్ రెడ్డి ,ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కర్రా గిరిజా హర్షవర్ధన్ రెడ్డి ,కోవెలకుంట్ల మండల వైఎస్సార్సీపీ కన్వీనర్ బీవీ నాగార్జున రెడ్డి , సిద్ధంరెడ్డి రామ్మోహన్ రెడ్డి కానాల రవిరెడ్డి మండల పరిషత్ అధ్యక్షురాలు భీమిరెడ్డి రమాదేవి ,వైస్ ఎంపీపీ షాజహాన్ బేగం ,భీమిరెడ్డి ప్రతాప్ రెడ్డి ,లక్కిరెడ్డి సుధాకర్ రెడ్డి , కలుగొట్ల రాంభూపాల్ రెడ్డి ,అందె శ్రీనివాస రెడ్డి ,చిక్కేపల్లి ప్రసాద్ రెడ్డి ఆమడాల భాస్కర్ రెడ్డి ,సప్తగిరి నాగేశ్వర రెడ్డి ,దిల్క్ బాషా అక్బర్ బాషా ,దశరథ రెడ్డి ,శ్రీనివాస నాయక్ ,దండు మధు ,పెద్దకొప్పెర్ల హుస్సేన్ రెడ్డి ,ఎల్ ఐ సి రామసుబ్బారెడ్డి , అమడాల వెంకటేశ్వర రెడ్డి ,గుల్లదుర్తి నాగార్జున రెడ్డి జోలదొరాశి సుబ్బారాయుడు ,కంపమల్ల లోకేశ్వర్ రెడ్డి ,సౌదరదిన్నె మధు సుధన్ రెడ్డి ,లింగాల డి.వి శేషిరెడ్డి ,ఎరువ శేషి రెడ్డి ,వల్లంపాడు రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి
### గ్రామస్తాయి నుంచి ప్రజా సమస్యలపై పోరాటం మాజీ ఎమ్మెల్యే గంగుల బిజెంద్రా రెడ్డి

**ఆళ్లగడ్డ సెప్టెంబర్ 15, నంది పత్రిక** రాబోయే స్థానిక సంతల ఎన్నికలకు ప్రతి నాయకుడు, కార్యకర్తలు సిద్ధం కావాలని, గ్రామస్తాయి నుండి పార్టీని బలోపేతం చేసి, ప్రజా సమస్యలపై నిరంతరం కలిసి పోరాటం చేద్దామని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజెంద్రా రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కర్నూల్ పార్లమెంట్ పరిశీలకులు గంగుల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు గంగుల బ్రిజేంద్ర రెడ్డి మాట్లాడుతూ నా ఎన్నికలకు మీరు ఏ విధంగా కష్టపడి అండగా నిలబడ్డారో అదే విధంగా నేను మీ ఎన్నికలకు అండగా నిలబడుతానని ప్రతి వైఎస్ఆర్సిపి కార్యకర్తకు భరోసా యిస్తున్నానన్నారు. అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రతి నాయకుడు, కార్యకర్త ఇప్పటి నుంచే సిద్ధం కావాలన్నారు. అలాగే గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతానికి ప్రతోడు ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రజా సమస్యలపై అందరం కలిసి నిరంతరం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆళ్లగడ్డ ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి , విజయ మిల్క్ డైరీ చైర్మన్ ఎస్వీ జగన్ మోహన్ రెడ్డి, మాజీ వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి వైసిపి మైనార్టీ నాయకులు షేక్ బాబూలాల్ సిరివెళ్ల సలాం, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నరసింహారెడ్డి ,మాజీ కౌన్సిలర్ సుధాకర్ రెడ్డి సింగం వెంకటేశ్వర్ రెడ్డి మాదం చెన్నయ్య ఆరు మండలాల వైకాపా నాయకులు పార్టీ కార్యకర్తలు, గంగుల అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## క్యాన్సర్ తో బాధపడుతున్న బాలుడికి బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి యువసేన ఆర్థిక సాయం అందజేత.
### 50 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేసిన వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు గుజ్జుల రమేష్ నాయుడు.



**నందికొట్కూరు /ప్రాతకోట సెప్టెంబర్ 15(నంది పత్రిక )** పాతకోట గ్రామానికి చెందిన రియాజ్బాషా (8) బాలుడికి అదే గ్రామానికి చెందిన బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి యువసేన 50వేల ఆర్థిక సహాయాన్ని మంగళవారం వైసీపీ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గుజ్జుల రమేష్ నాయుడు బాలుడి తల్లిదండ్రులకు అందజేశారు. బాలుడు రియాజ్ భాషా క్యాన్సర్ తో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి యువసేన బాధ్యతగా మానవత దృక్పథంతో వైద్య ఖర్చుల నిమిత్తం 50వేల రూపాయలు సమీకరించి వారి కుటుంబానికి అండగా నిలిచారు. కుటుంబానికి ఆర్థిక సహాయం అందచేసిన అనంతరం గుజ్జుల రమేష్ నాయుడు మాట్లాడుతూ రియాజ్ భాషా త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీతం గడపాలని వారు ఆకాంక్షించారు. బాధిత కుటుంబానికి బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి యువసేన ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వారి భరోసా కల్పించారు. బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి స్ఫూర్తితో సేవా దృక్పథం కలిగి ఆర్థిక సహాయం అందజేసిన యువసేన సభ్యులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి మరియు యువసేన కమిటీ సభ్యులకు బాలుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి యువసేన నాయకులు రమణ, ప్రసాద్, నారాయణ, లింగం గౌడ్, సిలార్ సాహెబ్, నబి సాహెబ్, పుల్లారెడ్డి, కురుమన్న, రహంతుల్లా, హరి ప్రసాద్, కుమ్మరి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## ఐ. ఈ.సీ ప్రచార కరపత్రాలను విడుదల చేసిన ఎమ్మెల్యే గిత్తాజయసూర్య



**నందికొట్కూరు సెప్టెంబర్ 15( నంది పత్రిక)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ మరియు దిశ సమన్వయంతో దిశ లెడ్ పియు ఆధ్వర్యంలో ఐసీసీ ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని పీ-పోర్ కార్యాలయం నందు ఎమ్మెల్యే గిత్త జయసూర్య కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్ నివారణ మరియు తీసుకోవలసిన జాగ్రత్తలు ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆయన సంస్థ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పగిడాల మండల కన్వీనర్ మహేశ్వర్ రెడ్డి,టీడీపీ ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకులు షకీల్ అహ్మద్, ప్రాజెక్టు మేనేజర్ వి నరసింహుడు, ఏఎన్ఎం సంతోషమ్మ, ఓ ఆర్ డబ్ల్యు సరోజ, అరుణ, పద్మావతి మేరీ తదితరులు పాల్గొన్నారు.

## పాత్రికేయుని పరామర్శించిన సామాజికవేత్త గుజ్జుల గౌరీశ్వర్ నాయుడు.



**నందికొట్కూరు సెప్టెంబర్ 15( నంది పత్రిక)** నందికొట్కూరు పట్టణానికి చెందిన పాత్రికేయులు రహంతుల్లా కంటి సర్జ చికిత్స చేయించుకున్న విషయం తెలుసుకున్న సామాజికవేత్త గుజ్జుల గౌరీశ్వర్ నాయుడు మంగళవారం వారి గృహానికి చేరుకుని పరామర్శించారు. ఈ సందర్భంగా పాత్రికేయని ఆరోగ్య పరిస్థితి ఆయన అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సూచనలు తప్పనిసరిగా పాటిస్తూ తగినంత విశ్రాంతి తీసుకోవాలని, త్వరగా కోలుకొని పాత్రికేయ విధి నిర్వహణలో పాల్పంచుకోవాలని వారికి సూచించారు. తమ గృహానికి విచ్చేసి సమాజంలో పాత్రికేయుల పట్ల గౌరవాన్ని చూపిస్తూ పరామర్శించినందుకు సదర్ పాత్రికేయుడు రహంతుల్లా సామాజికవేత్త గుజ్జుల గౌరీశ్వర్ నాయుడి కి ధన్యవాదాలు తెలియజేశారు.

## నిమజ్జనానికి కట్టదుట్టమైన చర్యలు తీసుకోవాలి... జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్
### ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనం జరుపుకోవాలి
### కేసి కెనాల్ వద్ద నిమజ్జన ఏర్పాట్లును జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ పరిశీలన



**జూపాడుబంగ్లా ,సెప్టెంబర్: 15:( నంది పత్రిక)** మండల కేంద్రంలోని వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఆదేశించారు. కేసీ కెనాల్ వద్ద నిమజ్జనం జరిగే ప్రదేశాన్ని పోలీస్ అధికారులతో కలిసి జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నిమజ్జనోత్సవంలో ఏ చిన్న ప్రమాదానికి కూడా ఆస్కారం లేకుండా ముందు జాగ్రత్త చర్యలన్నీ చేపట్టాలని అధికారులకు సూచించారు. నిమజ్జన ఘాట్ వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా భారికేడ్లు, లైటింగ్, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ పోలీస్ బందోబస్తు ఏర్పాటులను పరిశీలించారు. నిమజ్జన సమయంలో ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసు వారి సూచనలు పాటించాలిన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతిష్టమైన భద్రత ఏర్పాట్లను చేయడం జరుగుతుందని అన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం నిర్వహించాలని ఆదేశించారు. నిమజ్జనం సందర్భంగా ఊరేగింపు సమయంలో డీజేలు బాణసంచా కాల్చడం వంటివి నిషేధమని సూచించారు. ఆత్మకూర్ డి.ఎస్.పి రామాంజి నాయక్, నందికొట్కూరు రూలర్ సిఐ సుబ్రహ్మణ్యం, జూపాడుబంగ్లా ఎస్ఐ. కే. మల్లికార్జున పాల్గొన్నారు.

## సిరివెళ్ల మండలంలో బుధవారం జరగబోయే వినాయక నిమజ్జనాలపై అధికారుల సమీక్ష
### వినాయక నిమజ్జన ఊరేగింపులు ప్రశాంతంగా నిర్వహించాలి
### కమిటీ సభ్యులు అధికారులకు సహకరించాలి
### యంఆర్ఓ విజయశ్రీ , సీఐ బి. రాము



**సిరివెళ్ల (నంది పత్రిక)** సిరివెళ్ల మండల కేంద్రంలోని ఎండిఓ కార్యాలయంలో వినాయక నిమజ్జన కార్యక్రమాల నిర్వహణపై అధికారులు సమావేశం నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల నుంచి నిమజ్జన ఊరేగింపులకు తరలించే సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కమిటీ సభ్యులు అధికారులకు పూర్తి సహకారం అందించాలని ఈ సందర్భంగా అధికారులు కోరారు. ఈ సమావేశానికి నంద్యాల జిల్లా విశ్వహిందూ పరిషత్ కమిటీ అధ్యక్షుడు రామయ్య సభ్యులతో పాటు సిరివెళ్ల మండలంలోని పలు గ్రామాలకు చెందిన వినాయక మండపాల కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిరివెళ్ల మండల యంఆర్ఓ విజయ శ్రీ ,సీఐ బి. రాము,ఎస్ఐ మధుసూదన్,ఎండిఓ శివమల్లేశ్వరప్ప మాట్లాడుతూ వినాయక నిమజ్జన ఊరేగింపులను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు.

**కమిటీ సభ్యులకు అధికారుల సూచనలు** నిమజ్జన ఊరేగింపుల సమయంలో ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా కమిటీ సభ్యులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. ఊరేగింపుల సమయంలో అధికారులకు,పోలీసు సిబ్బందికి పూర్తిస్థాయిలో సహకరించాలి.

**నిమజ్జన కార్యక్రమాన్ని శాంతియుతంగా,భక్తిశ్రద్ధలతో నిర్వహించాలి.**

గ్రామాల వారీగా కమిటీ సభ్యులు సమన్వయంతో వ్యవహరించాలని అధికారులు సూచించారు.వినాయక నిమజ్జన కార్యక్రమాలు శాంతియుతంగా,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అధికారులు కోరారు. ఈ సమావేశంలో సిరివెళ్ల మండలానికి చెందిన అధికారులు,విశ్వహిందూ పరిషత్ కమిటీ సభ్యులు, పలు గ్రామాల నుంచి వచ్చిన వినాయక మండపాల కమిటీ సభ్యులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాపై రేపు రాజకీయా పార్టీలతో సమావేశం: ఎంపీడీవో మురారి

**వెలుగోడు సెప్టెంబర్ 15 (నంది పత్రిక):**వెలుగోడు మండల పరిధిలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ కొరకు ప్రతిపాదించిన పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను సెప్టెంబర్ 15న ప్రచురించినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి గంధం మురారి సర్క్యులర్ ద్వారా తెలిపారు. ఈ ముసాయిదా పోలింగ్ స్టేషన్ల జాబితాపై క్లెయిమ్‌లు, అభ్యంతరాలు మరియు సూచనలు స్వీకరించడానికి, అలాగే రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించడానికి సెప్టెంబర్ 16 ఉదయం 11:00 గంటలకు వెలుగోడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు వివరించారు. కావున, మండల పరిధిలోని అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అధ్యక్షులు, కార్యదర్శులు మరియు అధికృత ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరై, పోలింగ్ స్టేషన్ల స్థానం, భవనం అనుకూలత, ఓటర్ల అందుబాటు మొదలైన అంశాలపై తమ అభిప్రాయాలను మరియు అభ్యంతరాలను లిఖితపూర్వకంగా సమర్పించాలని ఎంపీడీవో కోరారు.

## పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా ప్రచురణ - డీప్యూటీ ఎంపీడీఓ కె.పీ.ఆర్ శర్మ



**కొత్తపల్లి - నంది పత్రిక :** మండల ప్రజా పరిషత్ పరిధిలో మండల ప్రజా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గముల(ఎంపీటీసీ) సభ్యుల ఎన్నిక, జిల్లా ప్రజా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం(జెడ్పీటీసీ) సభ్యుని ఎన్నిక కొరకు పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నందు ప్రచురణను డీప్యూటీ ఎంపీడీఓ కె.పీ.ఆర్ శర్మ చేశారు. 1.2 సూచికల యందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల కనుగుణంగా రూపొందించిన పోలింగ్ కేంద్రముల ముసాయిదా జాబితాను ప్రజల సమాచారార్థం ప్రచురించామన్నారు. ప్రచురించబడిన పోలింగ్ కేంద్రాల జాబితాపై ఏవైనా క్లెయిమ్స్. అభ్యంతరాలు ఉంటే వ్రాత మూలకంగా సవివరంగా పేర్కొనుచూ అధికారుల దృష్టికి 16 తేదిన సాయంకాలం 5:00 గంటలలోపు దాఖలు చేసుకోవచ్చునని చెప్పారు.

## సంగమేశ్వర శిఖర భాగానికి ప్రత్యేక పూజలు



**కొత్తపల్లి - నంది పత్రిక:** రోజురోజుకు శ్రీశైలం జలాశయంలో క్రమేపీ నీటి మట్టం తగ్గుముఖం పడుతుంది. దీంతో శ్రీశైలం వెనుకజలాల నుంచి మండలంలోని సంగమేశ్వరం సమీపంలో ప్రాచీన సంగమేశ్వరాలయం కొద్ది కొద్దిగా బయల్పడుతుంది. మంగళవారం ఆలయ పురోహితుడు తెలకపల్లి రఘురామ శర్మ వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ శిఖరభాగం వద్ద శివపార్వతుల విగ్రహాలు ఉంచి వినాయకుడి పూజలతో 43 రోజుల పాటు నిర్వహించే వరుణ పూజలు ప్రారంబించారు. శిఖరభాగానికి కుంకుమార్చన, పుష్పార్చన, కాయ కర్పూరం సమర్పించడం. మంగళహారతీ వంటి విశేష పూజలు చేశారు.

## రైతుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా
### -సాగు నీరు అందించడంలో ప్రభుత్వం విఫలం
### -మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి



**కొత్తపల్లి - నంది పత్రిక :** రైతుల సమస్యలు ప్రభుత్వానికి పట్టావా అని, సాగు నీరు అందించడంలో ప్రభుత్వం విఫలం అయిందని నందికొట్కూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే లబ్బీ వెంకటస్వామి ప్రభుత్వంపై మండి పడ్డారు. మంగళవారం మండలంలోని పెద్దగుమ్మడాపురం పైపులైన్ మరమ్మత్తులను, ముసలిమడుగు గ్రామ పొలిమేరలోని సంగమేశ్వరం, శివపురం గ్రామ శివారుల్లోని ఎత్తిపోతల పథకాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్కనే కృష్ణా నది ఉన్నా మండలం కరువుతో అల్లాడుతుందన్నారు. పంటలకు సాగు నీరు అందించాల్సిన ప్రధాన పైప్లైన్ మరమ్మత్తులకు గురిఅయిన ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఖరీఫ్ సాగుకు నీరు అందించడంలో ప్రభుత్వం విఫలం అయిందన్నారు. రైతులపట్ల కూటమి ప్రభుత్వం చవతి ప్రేమ చూపిస్తుందన్నారు. వెంటనే పైడ్లైన్ మరమ్మత్తులు చేయించి పంటలకు సాగునీరు అందించాలన్నారు.

## ఆర్టీసీ బస్సు స్టషన్ కార్గో పార్సల్ సర్వీస్ దొంగ అరెస్టు

### 5.8 లక్షల సెల్ ఫోన్లు & ఆర్గానిక్ ఫర్టిలైజర్స్ రికవరీ

**కర్నూల్ సిటీ నందిపత్రిక** 2026 ఆగస్టు 18 మరియు 19 తేదీల్లో కర్నూలు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న ఏపీఎస్ఆర్టీసీ కార్గో పార్సెల్ సర్వీస్ నందు 11 ఒప్పో కంపెనీ ఫోన్లు, 1 వివో యస్ 2 ఫోన్లు ఉన్న పార్సిల్ బాక్స్ మరియు ఆర్గానిక్ ఫర్టిలైజర్స్ ఉన్న పార్సిల్ బాక్స్ ఈ రెండిటిని ఎవరో



గుర్తుతెలియని వ్యక్తి దొంగలించినట్లు కార్గో పార్సెల్ సర్వీస్ మేనేజర్ కే మనోజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈనెల 13వ తేదీ ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు. సీఐ విక్రమ్ సింహ పర్యవేక్షణ లో ఎస్సై పోస శ్రీనివాసులు , సిబ్బంది పీసీ లు మురళి సుబ్బరాయుడు, హెచ్ సి జీనస్ ల బృంది తో కేసు నమోదు చేసిన 24 గంటల్లో విచారణ ప్రారంభించి సిసి ఫుటేజ్ లను క్షుణ్ణంగా పరిశీలించగా బూడిదపాడు గ్రామానికి చెందిన తలారి సుధాకర్ తండ్రి పేరు శ్రీరాములు వయస్సు 40 అనే వ్యక్తి దొంగలించినట్లు సీఐ విక్రమ్ సింహ మరియు ఎస్ఐ పోసా శ్రీనివాసులు గుర్తించి అతనిని అదుపులోకి తీసుకొని, అరెస్ట్ చేసి అతని వద్ద నుండి 5.8 లక్షల విలువైన 12 సెల్ఫోన్లు మరియు ఆర్గానిక్ ఫర్టిలైజర్స్ రికవరీ చేయడమైనది.

## అభివృద్ధి పనులకు సంబంధించిన జీఎస్టీ రిటర్న్స్‌ను నెలాఖరులోగా దాఖలు చేయాలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 15 నంది పత్రిక** జీఎస్టీ చెల్లించని డీలర్లకు నోటీసులు జారీ చేయాలిప్రభుత్వ శాఖలు, మున్సిపల్ సంస్థల్లో వృత్తి పన్ను చెల్లింపులపై ప్రత్యేక దృష్టి. జిల్లాలో ప్రభుత్వ శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన జీఎస్టీ రిటర్న్లను ప్రతి నెలా క్రమం తప్పకుండా దాఖలు చేయడంతో పాటు, ప్రస్తుత రిటర్న్లను నెలాఖరులోగా దాఖలు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుంచి జీఎస్టీ చెల్లింపులపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో జీఎస్టీ చెల్లించని డీలర్లను గుర్తించి, వారికి నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వానికి జీఎస్టీ చెల్లించిన డీలర్ల వివరాలతో జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలో పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ తదితర శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన జీఎస్టీ రిటర్న్లను ప్రతి నెలా తప్పనిసరిగా దాఖలు చేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఆయా పనులకు సంబంధించిన రికార్డులను వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. ప్రభుత్వ శాఖలు, మున్సిపల్ సంస్థల్లో ఉద్యోగుల ఎస్టాబ్లిష్మెంట్ కి సంబంధించిన వృత్తి పన్ను చెల్లింపులు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వివిధ ప్రభుత్వ శాఖలు, మున్సిపల్ సంస్థలతో సమన్వయం చేసుకుంటూ పన్నుల చెల్లింపులకు సంబంధించిన వివరాలను సక్రమంగా సేకరించి, ఎటువంటి బకాయిలు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ నాగార్జునరావు, డిప్యూటీ కమిషనర్ శైలజశ్రీ, అసిస్టెంట్ కమిషనర్లు సాంబశివరావు, కె.వి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటనలో ఇచ్చిన హామీలపై నివేదికలు సిద్ధం చేయాలి:

### రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్




**భీమవరం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 15 నంది పత్రిక** అమరావతి నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ మంగళవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాల పర్యటనలో ఇచ్చిన హామీలకు సంబంధించిన వివరాలతో పాటు, వాటి అమలుకు అవసరమైన అంచనా వ్యయ వివరాలతో సమగ్ర నివేదికలను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. భీమవరంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.



## 'గోషామహల్‌లో బంగారం, వజ్రాలతో గణేశుడు'.. స్పందించిన పోలీసులు!

హైదరాబాద్‌లోని గోషామహల్‌లో ప్రతిష్ఠించిన 'లాల్‌బాగ్‌చా రాజా గణేశ్-2026' విగ్రహంపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పోలీసులు స్పష్టం చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో వస్తున్న పుకార్లను ప్రజలు నమ్మవద్దని వారు విజ్ఞప్తి చేశారు. గోషామహల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన ఓ గణేశుడి విగ్రహం గురించి గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతోంది. ఈ విగ్రహాన్ని పంచలోహాలతో తయారు చేశారని, 48 కిలోల బరువుతో పాటు 24 క్యారెట్ల బంగారు తాపడం చేశారని, అలాగే 3,83,800 కృత్రిమ వజ్రాలతో అలంకరించారని కొన్ని పోస్టులు వైరల్ అయ్యాయి. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సైతం నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. ఈ ప్రచారంపై గోషామహల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్ కుమార్ స్పందించారు. సోషల్ మీడియాలో పేర్కొంటున్నట్లుగా ఈ విగ్రహాన్ని పంచలోహాలతోగానీ, బంగారంతోగానీ తయారు చేయలేదని ఆయన తేల్చిచెప్పారు. సదరు ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు. ఇటువంటి నిరాధారమైన వదంతులను నమ్మవద్దని, సోషల్ మీడియాలో వచ్చే సమాచారాన్ని ఇతరులకు చేరవేసే ముందు దాని నిజానిజాలను నిర్ధారించుకోవాలని పోలీసులు ప్రజలకు సూచించారు.

## వై.ఎస్. సత్యానంద రెడ్డి మృతి పట్ల కాంగ్రెస్ నేత బండి జకరయ్య సంతాపం



కడప అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ లిశ్రీ బండి జకరయ్యలి మాజీ ఎమ్మెల్యే, దివంగత లిశ్రీ వై.ఎస్. పురుషోత్తం రెడ్డిలి గారి కుమారుడు లి వై.ఎస్. సత్యానంద రెడ్డిలి గారు ఈరోజు (15-09-2026) మృతి చెందడం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.వై.ఎస్. సత్యానంద రెడ్డి గారి మరణం వారి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని బండి జకరయ్య పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని కోరారు.

## పేకాట రాయుళ్ల అరెస్ట్

### భారీగా నగదుస్వాధీనం ఎస్సై కే.మల్లికార్జున



**జూపాడుబంగ్లా, సెప్టెంబర్: 15 :(నంది పత్రిక)**మండల పరిధిలోని మండ్లేము గ్రామ శివారులో ఉన్న ఆశ్రయ ట్రస్ట్ వెనుక పొలాల్లో బహిరంగ ప్రదేశంలో ఆర్గనైజింగ్ అందర్- బహార్ జూదమును ఆడుతుండగా జూపాడు బంగ్లా ఎస్ ఐ, కే. మల్లికార్జున తన సిబ్బందితో వెళ్లి అత్యంత చాకచక్యంగా జూదమునుఆడుతున్న1. కాటేపోగు దేవదాస్ తండ్రి నాగశేషులు, ఇందిరా నగర్, నందికొట్కూరు టౌన్ 2. చంద్ర మండ్లేము గ్రామం, జూపాడుబంగ్లా మండలం, 3. శ్రీను, కోళ్ల బాపురం గ్రామం, నందికొట్కూరు మండలం, 4. బొల్లెద్దుల ప్రసాద్, తండ్రి నాగరాజు, ఏబీఎన్ పాలెం నందికొట్కూరు టౌన్ వారిని పట్టుకున్నారు. వారి నుండి ఒక లక్ష 25 వేల రూపాయల నగదు 52 పేక ముక్కలు7 మోటార్ సైకిల్ 8 మొబైల్స్ స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నందికొట్కూరు ఏబీఎం పాలెం చెందిన అనంతబాబు, వెలుగోడు ఆర్ఎంపీ డాక్టర్ సంఘటనా స్థలం నుండి పారిపోయారని వారిని త్వరలోనే అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరుస్తామన్నారు.

## దిగువ అహోబిలంలో ఘనంగా స్వాతి సుదర్శన హోమం

### స్వాతి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డి



**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 15 నంది పత్రిక** , ఆళ్లగడ్డ: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్ర మైన అహోబిలంలో మంగళవారం లక్ష్మీ నరసింహ స్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులు ప్రహ్లాద వరద స్వామి , శ్రీదేవి, భూదేవి, మూర్తులకు జ్యేష్టాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు, కిడాంబి వేణు గోపాలన్ స్వామి ఆధ్వర్యంలో సుదర్శన హోమం, పూర్ణాహుతి, కార్యక్రమం నిర్వహించారు. స్వాతి వేడుకలను సీఈవో మాధవన్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డి, వైసిపి నాయకులు కొంకర కృష్ణారెడ్డి, నాసారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని స్వాతి వేడుకల్లో పాల్గొన్నారు.

## గణపతి బప్ప విగ్రహ పూజలో పాల్గొన్న ఎంఎల్ఎ కోట్ల తనయుడు.



**బేతంచెర్ల సెప్టెంబర్ 15 ( నంది పత్రిక ).** వినాయక చవితి పురస్కరించుకొని డోన్ ఎంఎల్ఎ కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి తనయుడు యువ నాయకులు కోట్ల రాఘవేంద్ర రెడ్డి మంగళవారం బేతంచర్ల పట్టణంలో ఏర్పాటు చేసిన విగ్రహ మండపమును సందర్శించారు. మండపంలో గణపతి బప్పా విగ్రహాన్ని దర్శించుకొని, పూజా కార్యక్రమం నిర్వహించి, విగ్రహ పూజారితో ఆశీర్వాదాలు పొందారు.

## పాఠశాలల విద్యా కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్.



**మహానంది సెప్టెంబర్ 15 (నంది పత్రిక):-** పాఠశాలల విద్యా కమిటీ ఎన్నికలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎంఈవో రామ సుబ్బయ్య తెలిపారు.ఆయన మాట్లాడుతూ ఈనెల 18న ఓటర్ల జాబితా విడుదల, 25న ఓటర్ల జాబితా పై అభ్యంతరాలు స్వీకరణ అదే రోజు ఫైనల్ ఓటర్ల జాబితా విడుదల ఉంటుందన్నారు. 29 మంగళవారం చైర్మన్ మరియు వైస్ చైర్మన్ ఎన్నికలతో పాటు ఎస్ఎంసి మీటింగ్ ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. 100 లోపు మంది విద్యార్థిని విద్యార్థులు ఉంటే 12 నుండి 15 మంది, 100 నుండి 500 మంది విద్యార్థినీ విద్యార్థులు ఉంటే 15 నుండి 20 మంది 500 నుండి ఆ పైన ఉంటే 20 నుండి 25 మంది సభ్యులను ఎన్నుకోవడం జరుగుతుందని తెలియజేశారు.75 శాతం ఆ పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు ఉంటారని మిగతా 25 శాతం గ్రామ లేదా మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వార్డు సభ్యులు ఏఎన్ఎం , ఏ డబ్ల్యు డబ్ల్యు, ఆశ, ఉపాధ్యాయులు, పూర్వపు విద్యార్థులు సభ్యులుగా ఉంటారన్నారు. 50% మహిళలు తప్పనిసరిగా సభ్యులుగా ఉండాలని నియమం ఉందన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ రిజర్వేషన్లు వర్తిస్తాయన్నారు.ఎన్నికైన సభ్యులు చైర్మన్ వైస్ చైర్మన్ ల పదవి కాలం రెండు సంవత్సరాలు ఉంటుందన్నారు.

## చిన్నారి వైద్యానికి రూ.13.34 లక్షల ఎల్‌వోసీ మంజూరు - ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్

**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 15 నంది పత్రిక** లింగపాలెం మండలం కె.గోకవరం గ్రామానికి చెందిన నక్క దివ్యవాణి కుమార్తె అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వైద్య ఖర్చులకు ఆర్థిక స్తోమత లేక కుటుంబ సభ్యులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు.విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ వెంటనే స్పందించి, చిన్నారికి మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.13,34,500/- విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్( ఎల్ ఓ సి) మంజూరు అయ్యేలా చర్యలు తీసుకున్నారు. అత్యవసర సమయంలో ఆదుకున్న ఎమ్మెల్యే కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.



# నిరుద్యోగుల అవకాశాలపై సాక్షి విషం చిమ్ముతోంది

**- ఐదేళ్లు ఒక్క వెటర్నరీ డాక్టర్ పోస్టూ భర్తీ చేయని వైసీపీకి ఇప్పుడు నిరుద్యోగులపై ప్రేమ పుట్టిందా?**

**- 160 ఉద్యోగాలు ఇస్తుంటే ఓర్వలేక తప్పుడు కథనాలతో అడ్డుకునే కుట్ర**

**- అభ్యర్థులు కోరిన విధానాన్నే అమలు చేస్తే అక్రమమా?**

**- కనీసం డైరెక్టర్ ఎవరో తెలుసుకోకుండా కథనం రాస్తారా? ఇదేనా 'సాక్షి' జర్నలిజం?**

**- ఉద్యోగాలు ఇవ్వడం మా విధానం.. ఉద్యోగాలకు అడ్డుపడటం వైసీపీ విధానం: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**అమరావతి, బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 15నంది పత్రిక** నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు వస్తుంటే చూసి ఓర్వలేక, వారి అవకాశాలపై కూడా విషం చిమ్మే స్థాయికి వైసీపీ, దాని కరపత్రం 'సాక్షి' దిగజారాయని రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క వెటర్నరీ డాక్టర్ పోస్టును కూడా భర్తీ చేయకుండా నిరుద్యోగులను రోడ్లపై తిప్పిన వారు, కూటమి ప్రభుత్వం 160 పోస్టుల భర్తీకి ముందుకొస్తే ఇప్పుడు నీతులు చెబుతున్నారని ధ్వజమెత్తారు. ఉద్యోగం ఇవ్వరు... ఇచ్చేవారిని ఇవ్వనివ్వరు... నియామకాలు చేపడితే అనుమానాలు సృష్టిస్తారు... ఇదే వైసీపీ, సాక్షి మార్కు నిరుద్యోగ వ్యతిరేక రాజకీయం అని మంత్రి వ్యాఖ్యానించారు.

**ఐదేళ్లు ఏం చేశారు? ఒక్క పోస్టయినా భర్తీ చేశారా?**

గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు అధికారంలో ఉండి ఒక్క వెటర్నరీ డాక్టర్ పోస్టును కూడా భర్తీ చేయలేదని అచ్చెన్నాయుడు గుర్తుచేశారు. ప్రస్తుతం సుమారు 300 పోస్టులు ఖాళీగా ఉంటే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి విడతలోనే 160 వెటర్నరీ డాక్టర్ పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చిందని తెలిపారు. ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఉద్యోగాలు ఇవ్వాలనే ఆలోచన రాలేదు. ఇప్పుడు మేం ఉద్యోగాలు ఇస్తుంటే 'మరో రిక్రూట్‌మెంట్‌పై అనుమానాలు' అంటూ విషపు రాతలు రాస్తున్నారు. మీ బాధ ఉద్యోగాలు రావడం గురించా? లేక ఆ ఉద్యోగాలు కూటమి ప్రభుత్వంలో వస్తున్నాయన్నదా? నిరుద్యోగులకు వైసీపీ, సాక్షి సమాధానం చెప్పాలి అని మంత్రి ప్రశ్నించారు.

**చరిత్ర తెలుసుకోకుండా రాతలు రాస్తే అది వార్త కాదు.. విషప్రచారం**

స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి వెటర్నరీ డాక్టర్ల నియామకాలను పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ ద్వారానే నిర్వహిస్తున్న విషయాన్ని 'సాక్షి' ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టిందని మంత్రి తెలిపారు. 28.10.2016న జారీ చేసిన +.ా.వీం.చీశీ.52 ప్రకారం మొత్తం 100 మార్కులతో మెరిట్ నిర్ణయించే స్పష్టమైన విధానం ఉందన్నారు. బి వి ఎస్ సి మార్కులకు 60 మార్కులు, ఎం వి ఎస్ సి 10 మార్కులు, ప్రభుత్వ/కేంద్రరాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్లు లేదా స్థానిక సంస్థల్లో కాంట్రాక్ట్ సేవకు 10 మార్కులు, గ్రాడ్యుయేషన్ పూర్తయినప్పటి నుంచి సీనియారిటీకి సంవత్సరానికి నాలుగు మార్కుల చొప్పున గరిష్ఠంగా 20 మార్కులు కేటాయించే విధానం అమల్లో ఉందన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో డాక్టర్ల నియామకాలు కూడా ఇదే తరహా వెయిటేజీ విధానంలో జరుగుతున్నాయని స్పష్టం చేశారు.

**అభ్యర్థులే కోరారు.. ప్రభుత్వం మానవీయంగా స్పందించింది**

జాబ్ క్యాలెండర్‌లో భాగంగా +.ా.వీం.చీశీ.21 ద్వారా ఈ పోస్టులను ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని ప్రభుత్వం తొలుత నిర్ణయించిందని మంత్రి వివరించారు. అయితే గత ఎనిమిదేళ్లుగా నియామకాలు జరగలేదని, ఇప్పుడు అకస్మాత్తుగా పరీక్షా విధానం తీసుకొస్తే ఇన్నేళ్లుగా ఎదురుచూస్తున్న అభ్యర్థులు నష్టపోతారని వెటర్నరీ నిరుద్యోగుల సంఘమే ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిందన్నారు. కనీసం ఈ ఒక్కసారికి పాత వెయిటేజీ విధానాన్ని కొనసాగించాలని వారు కోరారని తెలిపారు. నిరుద్యోగుల విజ్ఞప్తిని వినడం తప్పా? ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్న అభ్యర్థులకు న్యాయం చేయడం నేరమా? వారు కోరిన విధానాన్ని పరిశీలించి అవకాశం కల్పిస్తే అందులో కూడా కుట్ర కనిపిస్తోందంటే 'సాక్షి' కళ్లకు రాజకీయ కళ్లద్దాలు ఎంత బలంగా అతుక్కుపోయాయో అర్థమవుతోంది అని అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. ఇది అత్యంత సాంకేతిక రంగం కావడం, వైద్య ఆరోగ్య శాఖలోనూ వెయిటేజీ విధానం అమలులో ఉండటం, అభ్యర్థుల విజ్ఞప్తిలో న్యాయం ఉండటంతో ప్రభుత్వం అన్ని అంశాలను పరిశీలించి +.ా.వీం.చీశీ.52 ప్రకారం పరీక్ష లేకుండా మెరిట్, వెయిటేజీ ఆధారంగా నియామకాలు నిర్వహించాలని ఏ పి పి ఎస్ సి కోరిందని మంత్రి తెలిపారు. అయితే ప్రస్తుత పని ఒత్తిడి, పరీక్ష లేకుండా వెయిటేజీ విధానంలో నియామకాలు చేపట్టేందుకు అవసరమైన సమయం లేకపోవడంతో ఈ ప్రక్రియను నిర్వహించలేమని ఏపీపీఎస్సీ తెలియజేసిందన్నారు. అందుకే +.ా.వీం.చీశీ.22 ద్వారా ఈ ఒక్కసారికి మాత్రమే పాత విధానంలో పశుసంవర్ధక శాఖ ద్వారా నియామకాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని స్పష్టం చేశారు. ఇక్కడ దాచింది ఏముంది? రహస్యం ఏముంది? ప్రభుత్వం జారీ చేసిన జీవోలోనే 'ఈ ఒక్కసారికి మాత్రమే' అని స్పష్టంగా ఉంది. భవిష్యత్ నియామ కాలను ఏ పి పి ఎస్ సి ద్వారా పరీక్షా విధానంలో నిర్వహిస్తామని కూడా స్పష్టంగా పేర్కొన్నాం. అయినా అనుమానాలంటూ పొగ సృష్టించి అందులో రాజకీయ చలి కాచుకోవడం సాక్షికే చెల్లింది అని మంత్రి ఎద్దేవా చేశారు.

**డైరెక్టర్ ఎవరో కూడా తెలియదా? ఇదేనా మీ విశ్వసనీయత?**

'సాక్షి' కథనంలో ప్రస్తుతం పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌గా దామోదర్ నాయుడు ఉన్నట్లు పేర్కొనడాన్ని మంత్రి తప్పుబట్టారు. ప్రస్తుతం ఆయన డైరెక్టర్‌గా లేరని, ఒక మహిళా అధికారి ఇన్‌చార్జి డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారని స్పష్టం చేశారు. ఒక శాఖకు ప్రస్తుతం డైరెక్టర్ ఎవరో తెలుసుకోవడానికి కూడా కనీస ప్రయత్నం చేయకుండా కథనం రాసి, ప్రభుత్వంపై బురద చల్లితే దాన్ని జర్నలిజం అంటారా? హోంవర్క్ సున్నా.. ఆరోపణలు వంద. వాస్తవాలు సున్నా.. విషప్రచారం వంద. ఇదే ఇప్పుడు సాక్షి పరిస్థితి అని అచ్చెన్నాయుడు తీవ్రంగా విమర్శించారు. ఎనిమిదేళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు చివరిసారిగా పాత విధానంలో అవకాశం కల్పిస్తున్నాం. తర్వాత నుంచి ఏపీపీఎస్సీ పరీక్షా విధానమే ఉంటుందని ముందుగానే స్పష్టం చేస్తున్నాం. ఇందులో అక్రమం ఎక్కడుంది? అనుమానం ఎక్కడుంది? ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువకుడి చేతిలో అపాయింట్‌మెంట్ ఆర్డర్ చూడాలని మేం కోరుకుంటున్నాం. ఆ అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఆపి రాజకీయ లబ్ధి పొందాలని వైసీపీ కోరుకుంటోంది. ఇదే మాకూ వాళ్లకూ ఉన్న తేడా అని మంత్రి అన్నారు.

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేసిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేస్తుంటే తన అనుకూల మీడియాతో అనుమానాలు సృష్టించి నియామక ప్రక్రియను వివాదాస్పదం చేయడానికి ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. యువత భవిష్యత్తుపై రాజకీయ విషం చిమ్మడం మానుకోండి. మీ రాజకీయ కక్షలకు నిరుద్యోగులను బలి చేయొద్దు. వాస్తవాలను వక్రీకరించి ఎన్ని కథనాలు రాసినా నిజాన్ని దాచలేరు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం అవకాశాలు కల్పిస్తుంది. వైసీపీసాక్షి ఎన్ని అడ్డంకులు సృష్టించినా యువతకు న్యాయం చేసే విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.



# మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే విధంగా బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలి

## పారిశ్రామిక, విద్య, గృహ నిర్మాణ రంగాలకు నిర్ణీత గడువులో రుణాలు మంజూరు చేయాలి

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 15 నంది పత్రిక** మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేలా నూతన మహిళా పారిశ్రామికవేత్తలకు బ్యాంకర్లు రుణ సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం భీమవరం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లాస్థాయి సమీక్ష కమిటీ సమావేశం సమావేశం (డి ఎల్ ఆర్ సి) మరియు జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశాలను నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ యం వి జాన్ మార్టిన్, కన్వీనర్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ బి. వీరభద్రరావు, ఆర్‌బిఐ అధికారి రోహిత్ అగర్వాల్, జిల్లా అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ రుణాలు, స్వయం ఉపాధి పథకాలు, మహిళా సంఘాల రుణాలు, విద్యా రుణాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, బ్యాంకింగ్ సేవల విస్తరణ, ప్రజలకు అందుతున్న ఆర్థిక సహాయ కార్యక్రమాల పురోగతి తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లా సమగ్ర అభివృద్ధి, ఆర్థిక పురోగతిలో భాగంగా పారిశ్రామిక, విద్య, గృహ నిర్మాణ, స్వయం ఉపాధి రంగాలకు సంబంధించిన రుణాలను నిర్ణీత గడువులోగా మంజూరు చేయాలని బ్యాంకు అధికారులకు సూచించారు. డిజిటల్ బ్యాంకింగ్ పై గ్రామీణ ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. జిల్లాలో నూతన ఔత్సాహిక మహిళ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించే విధంగా బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలని అన్నారు. మహిళా ఆర్థిక స్వావలంబన సాధించేలా తమ వంతు కృషి చేయాలని తెలిపారు. చిన్న, సన్న కారు మత్స్య, ఆక్వా రైతులకు కేసిసి కార్డులను జారీచేసి రుణాలను మంజూరు చేయవలసినదిగా తెలిపారు. వివిధ రంగాలకు చెందిన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్న రుణాలను బ్యాంకు వారు చిన్న చిన్న కారణాల వలన తిరస్కరించడం సబబు కాదని తెలిపారు. బ్యాంకులలో పెండింగ్ లో ఉన్న పారిశ్రామికవేత్తల రుణాలకు సంబంధించి దరఖాస్తులను వెంటనే పరిశీలించి నిబంధనల ప్రకారం సకాలంలో మంజూరు చేయాలని తెలిపారు. డి ఆర్ డి ఏ, మెప్మా ద్వారా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు రుణాల దరఖాస్తులను బ్యాంకులు ఎక్కువగా పెండింగ్లో పెడుతున్నారని అన్నారు. ఇండస్ట్రియల్ స్థాపనలో జిల్లా వెనుకబడి ఉన్నందున, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించవలసిన ఆవశ్యకత ఉందని అన్నారు. జిల్లాలో రైతులు, మహిళలు, యువతకు బ్యాంకింగ్ సేవలు మరింత సులభతరంగా అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో బ్యాంకులు సంబంధిత శాఖలతో సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.




పెండింగ్‌లో ఉన్న రుణ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలని పేర్కొన్నారు. ప్రజలకు పారదర్శకమైన, సమయపాలనతో కూడిన సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. జిల్లాలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు పురోగతిని జిల్లా కలెక్టర్ వివరించారు. 2026-27 సంవత్సరంలో వ్యవసాయ రంగానికి సంబంధించి జిల్లాలో 57,397 మంది కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రం (సిసిఆర్ సి) కార్డులను మంజూరు చేయడం జరిగిందని అన్నారు. వీరిలో 17,480 మంది కౌలు రైతులకు ఇప్పటివరకు సుమారు 152 కోట్ల రూపాయలు రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డు పథకం కింద అర్హులైన పాడి రైతులకు రుణాలు మంజూరు చేయాలని బ్యాంక్ అధికారులకు తెలిపారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద ముఖ్యంగా సముద్ర తీర ప్రాంత రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేయాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాల బలోపేతానికి జిల్లాలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన 1862 సహాయక సంఘాలకు రూ. 276 కోట్లు రుణాల మంజూరు లక్ష్యం కాగా, ఇప్పటివరకు 945 సంఘాలకు సుమారు రూ.199 కోట్ల రుణాలను మంజూరు చేయడం జరిగిందన్నారు.

పట్టణ ప్రాంతాలకు చెందిన 281 సహాయ సంఘాలకు రూ. 272 కోట్లు రుణాలు మంజూరు లక్ష్యం కాగా, ఇప్పటివరకు 235 సంఘాలకు సుమారు 41 కోట్ల రూపాయలు రుణాల మంజూరు చేయడం జరిగిందని అన్నారు.జిల్లాలోని పట్టణ ప్రాంతాల పరిధిలో చిరు వ్యాపారులకు పీఎం స్వనిధి పథకం కింద 4,222 మందికి రుణాలు మంజూరు లక్ష్యం గాక దీనిలో 3,68 మంది లబ్ధిదారులకు సుమారు రూ.8 కోట్ల రుణాలు మంజూరుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఇంకా 554 మంది లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాల్సి ఉందన్నారు. చిరు వ్యాపారులను పదే పదే బ్యాంకులకు తప్పకుండా పెద్ద ఎత్తున రుణాలను మంజూరు చేయాలని సూచించారు. పీఎం ఈజీపీ( పి ఎం ఈ జి పి) పథకం కింద 318 దరఖాస్తులు సమర్పించగా, వాటిలో 120 దరఖాస్తులు బ్యాంకులు మంజూరు చేయబడ్డాయని తెలిపారు. ఇంకా 212 దరఖాస్తులు పరిశీలనలో ఉండగా, 76 దరఖాస్తులు తిరస్కరించడం జరిగిందని తెలిపారు. పెండింగ్ దరఖాస్తులను త్వరగా క్లియర్ చేయాలని ఆదేశించారు. పీఎం ఎఫ్.ఎంఇ పథకం కింద ఇప్పటి వరకు 21 దరఖాస్తులు సమర్పించగా, 12 దరఖాస్తులు మంజూరు చేయడం జరిగిందని, ఇంకను 8 దరఖాస్తులు పరిశీలనకు సిద్ధంగా ఉన్నాయని, 1 దరఖాస్తు తిరస్కరించడం జరిగిందని అన్నారు.పీఎం విశ్వకర్మ పథకం కింద 4381 దరఖాస్తులు రుణాలు మంజూరుకు పంపగా, వాటిలో 2297 దరఖాస్తులు రుణాల మంజూరుకు సిద్ధంగా ఉన్నాయని, 593 దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. 2026-27 విద్యా రుణాల మంజూరుకు విద్యాలక్ష్మి పోర్టల్ ద్వారా 155 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోగా, సుమారు రూ. 12 కోట్ల రుణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. వీరిలో 71 మంది బాలికలకు సుమారు మూడు కోట్ల రూపాయలు విద్యా రుణాలు అందజేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ వివరించారు. విద్యా రుణాల మంజూరు పై అన్ని ప్రభుత్వ ప్రైవేటు కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, అవసరమైన వారు విద్య రుణాలు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి బ్యాంకు ప్రతినిధి తమ బ్యాంకు ద్వారా మంజూరు చేసిన రుణాలు, పథకాల వారీగా లబ్ధిదారుల వివరాలు, పెండింగ్ దరఖాస్తుల వివరాలను ప్రతినెలా సమగ్ర నివేదిక రూపంలో సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. బ్యాంకు సౌకర్యం లేని గ్రామీణ ప్రాంతాలలో బ్యాంకుల ఏర్పాటుకు గత సమావేశంలో ప్రతిపాదనలు తెలుపగా, 7 బ్యాంకులను మంజూరు చేసినట్లు బ్యాంకు అధికారులు తెలియజేశారు. వీటిలో ఆచంట-వేమవరం లో 1, బేతపూడి లో ఇండియన్ బ్యాంక్, చిట్టవరం, వేములదీవి లో ఎస్.బిఐ, సేరిపాలెం, కొమ్మురాడ లో కెనరా బ్యాంకు, కుమ్మరి పురుగు పాలెం లో యు బి ఐ బ్యాంకులను ఏర్పాటు చేయనున్నట్లు బ్యాంక్ అధికారులు తెలిపారు.కేంద్ర ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందించడంలో అధికారులు, బ్యాంకర్లు విరివిగా కృషి చేయాలని సూచించారు. చిరు వ్యాపారులకు అర్హత మేరకు రుణాలు మంజూరు చేసేందుకు బ్యాంకర్లు చొరవ చూపాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ యం వి జాన్ మార్టిన్, కన్వీనర్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ బి. వీరభద్రరావు, ఆర్‌బిఐ అధికారి రోహిత్ అగర్వాల్, జిల్లా అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి



## 14 మంది అర్జీదారులతో చరవాణిలో నేరుగా మాట్లాడి పరిష్కారాలపై ఆరా తీసిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

## సమస్యలు పరిష్కారం కావడంతో సంతృప్తి వ్యక్తం చేసిన అర్జీదారులు

**భీమవరం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 15 నంది పత్రిక** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపించడంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రత్యేక చొరవ చూపుతున్నారు. అర్జీదారుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తూ, సమస్యల పరిష్కారం అనంతరం అర్జీదారులతో స్వయంగా చరవాణిలో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. ప్రజలకు మరింత చేరువగా ప్రభుత్వ సేవలు అందిస్తూ, ప్రతి అర్జీకి సత్వర పరిష్కారం చూపించేందుకు ఆమె ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.ముఖ్యమంత్రి కార్యాలయానికి అర్జీలు సమర్పించిన వారిలో జిల్లాకు చెందిన 14 మంది అర్జీదారులతో మంగళవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చరవాణి ద్వారా నేరుగా మాట్లాడి, వారి సమస్యల పరిష్కారంపై వివరాలు తెలుసుకున్నారు. అర్జీలపై తీసుకున్న చర్యలు, సమస్యల పరిష్కారం తీరును అర్జీదారులను అడిగి తెలుసుకున్నారు. తమ సమస్యలు పరిష్కారం కావడంతో అర్జీదారులు జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ సంతోషం, సంతృప్తి వ్యక్తం చేశారు. భీమవరం మండలం గొల్లవానితిప్ప గ్రామానికి చెందిన వర్ధనపు సుబ్బలక్ష్మి భూ వివాదానికి సంబంధించి కక్షిదారులు బెదిరింపులకు పాల్పడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, చర్యలు తీసుకుని రక్షణ కల్పించాలని ముఖ్యమంత్రి కార్యాలయానికి అర్జీ సమర్పించారు. దీనిపై జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా స్పందించి సమస్యను పరిష్కరించడంతో పాటు అర్జీదారుకు రక్షణ కల్పించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కక్షిదారులపై కేసు నమోదు చేసి బైండోవర్ చేయడంతో సమస్య పరిష్కారమైంది. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ స్వయంగా చరవాణిలో సుబ్బలక్ష్మితో మాట్లాడి వివరాలు తెలుసుకోగా, ఆమె సంతోషం, సంతృప్తి వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.భీమవరం 1వ వార్డుకు చెందిన మలపాక శరత్‌చంద్ర కోవిడ్ సమయంలో పొందిన వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం అందించాలని ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఆయనకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.1.10 లక్షలు మంజూరు కావడంతో జిల్లా కలెక్టర్‌తో చరవాణిలో మాట్లాడి కృతజ్ఞతలు తెలిపారు.వీరవాసరం మండలం నవుదూరు గ్రామానికి చెందిన పి. విఘ్నేశ్వరరావు భూ వివాదంలో కక్షిదారుల నుంచి బెదిరింపులు ఎదుర్కొంటున్నారని, రక్షణ కల్పించి తగిన చర్యలు తీసుకోవాలని అర్జీ సమర్పించారు. దీనిపై అధికారులు స్పందించి అర్జీదారుకు రక్షణ కల్పించడంతో పాటు కక్షిదారులపై కేసు నమోదు చేసి బైండోవర్ చేశారు. సమస్య పరిష్కారం కావడంతో విఘ్నేశ్వరరావు జిల్లా కలెక్టర్‌తో చరవాణిలో మాట్లాడుతూ కృతజ్ఞతలు తెలియజేసి సంతృప్తి వ్యక్తం చేశారు.వీరవాసరం గ్రామానికి చెందిన పీతల కాంతరత్నం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గతంలో ఉన్న ప్రదేశంలోనే కొనసాగించాలని ముఖ్యమంత్రి కార్యాలయానికి అర్జీ సమర్పించారు. అర్జీపై జిల్లా కలెక్టర్ నాగరాణి స్పందించి పాఠశాలను యథాస్థానంలోనే కొనసాగించేలా చర్యలు చేపట్టారు. దీంతో కాంతరత్నం సంతోషం, సంతృప్తి వ్యక్తం చేశారు. భీమవరం 1వ వార్డుకు చెందిన సిహెచ్. రాజాకుమార్ సర్వశిక్ష అభియాన్‌లో ఒకేషనల్ ఇన్స్ట్రక్టర్ విద్యా బోధకుడిగా పనిచేస్తున్న తనను విధుల నుంచి తొలగించారని, తిరిగి విధుల్లో కొనసాగించాలని ముఖ్యమంత్రి కార్యాలయానికి అర్జీ సమర్పించారు. దీనిపై స్పందించి, ఆయనను తిరిగి విధుల్లో కొనసాగించేందుకు అనుమతుల కోసం సర్వశిక్ష అభియాన్‌కు నివేదిక పంపారు. ఈ చర్యపై రాజాకుమార్ జిల్లా కలెక్టర్‌తో చరవాణిలో మాట్లాడుతూ సంతోషం, సంతృప్తి వ్యక్తం చేశారు.ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని బాధ్యతగా స్వీకరించి, దాని పరిష్కారం జరిగే వరకు పర్యవేక్షిస్తూ జిల్లా కలెక్టర్ నాగరాణి పనిచేస్తున్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం ద్వారా వచ్చిన అర్జీలను కూడా ప్రత్యేకంగా పరిశీలిస్తూ సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. సమస్య పరిష్కారం అనంతరం అర్జీదారులతో స్వయంగా చరవాణిలో మాట్లాడి వారి సంతృప్తిని తెలుసుకోవడం ద్వారా ప్రజల పట్ల తన బాధ్యతాయుతమైన విధానాన్ని చాటుతున్నారు.ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి సమర్థవంతమైన పరిష్కారం చూపించడమే ప్రజల సమస్యల పరిష్కార వేదిక ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ నాగరాణి తెలిపారు. అర్జీల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రతి అర్జీదారుడికి సమస్య పరిష్కారమయ్యేలా బాధ్యతతో పనిచేయాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పి.జి.ఆర్.ఎస్ నోడల్ అధికారి వై. దోసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు



# ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ సక్రమముగా చేపట్టాలి

## జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ.



**భీమవరం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 15 నంది పత్రిక** రాష్ట్ర ప్రభుత్వం పేద కుటుంబాలకు అందిస్తున్న ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలులో భాగంగా సిలిండర్ల బుకింగ్, డెలివరీ, నగదు జమ తదితర ప్రక్రియలను సంబంధిత అధికారులు మరియు గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు సమన్వయంతో సక్రమముగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ ఆదేశించారు.మంగళవారం, భీమవరం జిల్లా కలెక్టరేట్‌లోని పి.జి.ఆర్.ఎస్. సమావేశ మందిరంలో ఉచిత గ్యాస్ సిలిండర్ల బుకింగ్, పంపిణీ మరియు సబ్సిడీ నగదు లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు జమ మొదలైన అంశములపై సంబంధిత అధికారులు మరియు గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులతో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలు, లబ్ధిదారులకు ఎదురవుతున్న సమస్యలు, బుకింగ్ మరియు డెలివరీ ప్రక్రియ తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ మాట్లాడారు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులు, గ్యాస్ ఏజెన్సీలపై ఉందన్నారు. పథకానికి సంబంధించిన నిబంధనలు, అర్హతలు, బుకింగ్ విధానం, డెలివరీ ప్రక్రియపై ఏజెన్సీల సిబ్బందికి మరియు అధికారులకు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ఉచిత గ్యాస్ సిలిండర్ల ను పొందుటలో వినియోగదారులకు ఏవైనా సమస్యలు ఎదురైతే అనగా ఆధార్ నంబరు యాక్టివ్ గా లేకపోవుట, ఈకేవైసీ పూర్తి చేయుట ఎన్ పి సి ఐ మ్యాపింగ్ మొదలైన వాటిని గ్యాస్ ఏజెన్సీలు వెంటనే సంబంధిత వినియోగదారులకు తెలియచేసి పూర్తిచేసుకొనేవిధముగా వారికి సహాయ పడాలని, అన్ని సక్రమముగా ఉన్న వినియోగదారుల విషయములో వారికి ఏ బ్యాంక్ అక్కౌంట్లో సబ్సిడీ నగదు జమ అయినది వారికి డెలివరీ బాయ్స్ ద్వారా తెలియచేయాలని తెలిపారు. అదే విధముగా సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దార్లు, ఆర్‌ఐలు వారి మండల పరిధిలో గల గ్యాస్ ఏజన్సీ నుండి వినియోగదారులకు పంపిణీ చేసిన బిల్లులను పొంది యాదృచ్ఛికంగా తనిఖీ చేసి, చేయవలెనని తెలియచేసినారు. గ్యాస్ డీలర్లు లబ్ధిదారులకు సిలిండర్ అందిన అనంతరం ప్రభుత్వం ద్వారా అందవలసిన నగదు వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్న అంశాన్ని డెలివరీ బాయ్స్ లబ్ధిదారులకు తెలియచేయవలసినదిగా సూచనలు ఇవ్వవలసినదిగా గ్యాస్ డీలర్లకు జాయింట్ కలెక్టర్ గారు సూచించారు. నగదు జమలో ఏవైనా సమస్యలు ఉంటే వాటిని గుర్తించి సంబంధిత అధికారులకు తెలియజేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. గ్యాస్ ఏజెన్సీ డీలర్లు తమ పరిధిలోని డెలివరీ బాయ్స్ దీపం-2.0 పథకానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలియజేసి, లబ్ధిదారులకు సరైన సమాచారం అందించేలా చూడాలని అన్నారు. ముఖ్యంగా వినియోగదారులతో మాట్లాడే సమయంలో మర్యాదపూర్వకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, వృద్ధులు, మహిళలు, పేద కుటుంబాలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించాలని సూచించారు.ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ ప్రక్రియలో జాప్యం, అనవసర ఇబ్బందులు, తప్పుదారి పట్టించే సమాచారం వంటి వాటికి తావులేకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. పథకం ప్రయోజనాలు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సకాలంలో అందేలా అధికారులు మరియు గ్యాస్ ఏజెన్సీలు సమన్వయంతో పనిచేయాలని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీ ఎస్ ఓ ఎన్ సరోజ, సి ఎస్ డీ టీ లు, ఆర్ ఐ లు, జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది..

# రైతాంగానికి ఎన్డీఏ ప్రభుత్వం అండ

## ప్రత్యామ్నాయ పంటల విత్తనాలపై 80% సబ్సిడీ

## పంట నష్టపోతే ఎకరాకు రూ. 20,000 బీమా పరిహారం

## 2027 నాటికి పోలవరం పూర్తి, గ్రావిటీ ద్వారా కృష్ణా డెల్టాకు సాగునీరు

## చందోలు వద్ద కొత్త ఎత్తిపోతల పథకానికి ప్రతిపాదనలు:

## బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు

**గుంటూరు బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 15 నంది పత్రిక** బాపట్ల నియోజకవర్గం, పిట్టలవానిపాలెం మండల పరిధిలోని చందోలు, నారాకోడూరు, సంగుపాలెం, కోమలి, రెడ్డిపాలెం తదితర గ్రామాల్లో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు మంగళవారం విస్తృత పర్యటన చేశారు. జిల్లా, మండల స్థాయి వ్యవసాయ, నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి స్వయంగా వ్యవసాయ పొలాలను పరిశీలించారు. ఎల్-నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖాముఖిగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

**ఎమ్మెల్యే ప్రస్తావించిన ముఖ్య అంశాలు:** వాతావరణ శాఖ నివేదికల ప్రకారం రాబోయే రెండు మూడు నెలలు వర్షాలు ఆశాజనకంగా లేనందున, కొత్తగా నీటి ఆధారిత పంటలు వేయవద్దని రైతులను కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో త్రాగునీరు, పశువుల మేతకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కాబట్టి రైతులు మినుము, పెసర, సజ్జలు, రాగులు, కందులు, కొర్రలు, నువ్వులు తదితర ప్రత్యామ్నాయ/ఆరుతడి పంటల వైపు మళ్లాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 80% సబ్సిడీపై విత్తనాలను అందిస్తోందని తెలిపారు. వెయ్యి రూపాయల విత్తనాలకు రైతులు కేవలం రూ. 200 చెల్లిస్తే సరిపోతుందని, మిగతా భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. బోరుబావుల సదుపాయం ఉన్న రైతులు వేరుశనగ కూడా సాగు చేసుకోవచ్చని తెలిపారు.విత్తనాలు వేసిన తర్వాత వర్షాలు పడక మొలక రాకపోయినా, లేదా పంట ఎండిపోయినా రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కేవలం రూ. 600 నుండి రూ. 800 నామమాత్రపు ప్రీమియం చెల్లించి ఈ-కేవైసీ చేసుకుంటే, పంట నష్టపోయిన పక్షంలో ఎకరాకు రూ. 20,000 చొప్పున ఇన్సూరెన్స్ ద్వారా నష్టపరిహారం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. కృష్ణా డెల్టా పరిధిలోని నిజాంపట్నం, కొమ్మమూరు కాలువలకు రోజుకు 7000 క్యూసెక్కుల నీరు అవసరం కాగా, వర్షాలు లేకపోవడం వల్ల ప్రస్తుతం పట్టిసీమ ద్వారా సగం నీరు మాత్రమే వస్తుందని వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పోలవరం ప్రాజెక్టును ప్రతి సోమవారం సమీక్షిస్తున్నారని, 2027 మార్చి - ఏప్రిల్ నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి గ్రావిటీ ద్వారా కృష్ణా నదికి నీరు అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. దీని ద్వారా భవిష్యత్తులో సాగునీటి డోకా ఉండదన్నారు.పొన్నూరు మున్సిపాలిటీ వారు నీటిని ఆపివేయడం వల్ల దిగువన ఉన్న కోమలి గ్రామ రైతులకు జరుగుతున్న నష్టాన్ని నీటిపారుదల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దామాషా పద్ధతిలో అందరికీ నీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే కోమలి గ్రామంలో త్రాగునీటి చెరువు (వేసవిలో నింపుదల) సమస్యను కూడా శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. ఈ ప్రాంత రైతుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం చందోలు పెట్రోల్ బంక్ సమీపంలో సుమారు 1,000 నుంచి 1,200 ఎకరాలకు సాగునీరు అందించేలా ఒక ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేయడానికి అంచనాలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణతో పాటు, చందోలు కొత్త ప్రాజెక్టు కోసం జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తో, జిల్లా కలెక్టర్ గారితో చర్చించి నిధులు మంజూరు చేయిస్తానని రైతులకు హామీ ఇచ్చారు.క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకొని, రైతులకు తక్షణమే సమాధానాలు, భరోసా ఇవ్వాలనే ఉద్దేశ్యంతోనే అధికారులందరినీ వెంటబెట్టుకుని ఈ పర్యటన చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వం సూచించిన విధంగా సరైన నీటి లభ్యత ఉంటేనే కొత్త పంటలు వేయాలని, రైతులు ఎవరూ తొందరపడి పెట్టుబడులు పెట్టి నష్టపోవద్దని బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ మరియు ఇరిగేషన్ శాఖ అధికారులు, రైతులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## పండుగలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న కూటమి ప్రభుత్వం

### వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ సరఫరా

### నియోజకవర్గంలో జరిగిన వినాయక చవితి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గద్దె రామమోహన్



**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 15 నంది పత్రిక**మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు అయిన పండుగలకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. తూర్పు నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో సోమవారం జరిగిన వినాయక చవితి వేడుకల్లో ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పాల్గొని పూజలు చేశారు. శాసనసభ్యులతోపాటు మాజీ కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సంద్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ వినాయక చవితి పండుగ సందర్భంగా భక్తులు ఏర్పాటు చేసుకునే వినాయక మండపాలకు, పందిళ్ళకు విద్యుత్‌ను తమ కూటమి ప్రభుత్వం ఉచితంగా అందచేస్తోందని తెలిపారు.. ఈ విధంగా వినాయక మండపాలకు విద్యుత్‌ను ఉచితంగా అందచేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బిజేపీ ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం హిందూ పండుగలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. గత వెఎస్సార్‌సీపీ ప్రభుత్వం వినాయక మండపాల నిర్వాహకుల నుంచి భారీగా కరెంట్ బిల్లులను వేసిందని, ఇబ్బందులకు గురిచేసిందని చెబుతూ, కూటమి ప్రభుత్వం భక్తుల మనోభావాలను గౌరవిస్తూ మండపాల ఏర్పాటుకు అవసరమైన అనుమతులను కూడా చాలా సులభంగా జారీ చేయడమే కాకుండా విద్యుత్‌ను కూడా ఉచితంగా అందిస్తోందని వివరించారు. ముమ్మనేని ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పండుగల నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.

## యనమలకుదురులో కొండకు ఆనుకుని అక్రమ నిర్మాణం

### కొండ పోరంబోకు స్థలంతో సహా

### కొండ చర్యలు పడితే దారుణమే

### సక్రమ కట్టడమే అవకతవకలతో ఉంటే దీనికి తోడు

### అక్రమంగా అదనపు అంతస్తు


### టౌన్ ప్లానింగ్ అధికారులకు ఇవేమీ కనపడవా?

### స్థానిక వార్డు ప్లానర్ పర్యవేక్షణ శూన్యమే!



**కృష్ణాజిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 15 నంది పత్రిక :** ఈ మధ్యకాలంలో ఎక్కడ చూసినా సక్రమ కట్టడాల కంటే అక్రమ కట్టడాలే అత్యధికంగా కనబడుతున్నాయి. గతంలో ఏదో మారుమూల స్థలంలో అక్రమ నిర్మాణం వెలిస్తే ప్రస్తుతం ఇక్కడ అక్కడ అనే తేడా లేకుండా ఎక్కడబడితే అక్కడే అక్రమ నిర్మాణాలు స్వాగతం పలుకుతున్నాయి. దీనికి కారణం చేతి చమురు బాగోతమే ప్రధానమైనదిగా తెలుస్తుంది. తిలాపాపం తలా కొంచెం చందానా పై స్థాయి నుంచి కింది వరకు లంచం మత్తులో మొద్దు నిద్ర నటిస్తున్నారనే చెప్పాలి. ఇటీవల యనమలకుదురు ప్రధాన రహదారి పక్కన శివాలయం కొండ కు ఆనుకుని మరి కొండ వెనుక భాగాన అక్రమ నిర్మాణం వెలిసింది. దీనికి తోడు నిర్మాణ స్థలం సగానికి పైగా కొండ పోరంబోకు దే అని తెలుస్తుంది. ఇది ఇలా ఉంటే వర్షాకాలం ప్రాణాలు అరిచేతిలో పెట్టుకొని నివాసితులు ఉండక తప్పదన్నట్లు అక్కడ పరిస్థితి అర్థం పడుతుంది. ఏ చిన్న కొండ రాయి దొర్లిన ఈ నిర్మాణంలోని ఫ్లాట్ల ల్లోకి సరాసరి వచ్చే ప్రమాదం చాలా స్పష్టంగా కనబడుతుంది. అయినా అధికారులకు ఇవేమీ పట్టవు, జరగాల్సిన నష్టం జరిగితే గాని అధికారులు కళ్ళు తెరిచి మొద్దు నిద్ర నుండి బయటపడే పరిస్థితి లేదని చెప్పాలి. భవన నిర్మాణానికి కనీసం 33 అడుగుల రోడ్డు ఉండాలనే నిబంధన ఉన్నప్పటికీ 20 అడుగుల రోడ్డు కూడా లేని స్థలంలో ఈ అక్రమ నిర్మాణం సాగింది అంటే డబ్బు ఏ స్థాయిలో చేతులు మారిందో అర్థం చేసుకోవచ్చు. భవన నిర్మాణం కూడా ప్రమాద నివారణ చర్యలకు లోబడి ఎంత మాత్రం జరగలేదు. ఏ విధమైన అనుమతులు లేవనే మాటే వినబడుతుంది. అగ్ని ప్రమాద నివారణకు గాని, ఇతర ముందస్తు జాగ్రత్తగా తీసుకోవలసిన నిబంధనలు పాటించని ఈ నిర్మాణానికి అనుమతులు ఎలా ఇచ్చారో ఆ రామలింగేశ్వర స్వామికే తెలుసు. తాడిగడప మున్సిపాలిటీలో యనమలకుదురు అక్రమ నిర్మాణాలకు చిరునామాగా నిలిస్తే ఈ నిర్మాణం మొదటి స్థానంలో ఉందని చూపరులు కోడై కూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మొద్దు నిద్ర నటించకుండా ఇలాంటి అక్రమ నిర్మాణాలపై కొరడా ఝులిపించి ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం నివారణకు చర్యలు తీసుకోవాలని పబ్లిక్ టాక్ వినబడుతుంది.

## వైసిపి మాజీ కార్పొరేటర్ రామిరెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారులు లాలూచీ




**విజయవాడ, ప్రతినిధి సెప్టెంబర్ 15, నంది పత్రిక,**విజయవాడ తూర్పు నియోజకవర్గం 17వ డివిజన్, రాణి గారి తోట లో గుడ్ మార్నింగ్ హోటల్ రోడ్డు శాంపిల్ బిల్డింగ్ ఎదురుగా కడుతున్న అక్రమ కట్టడం, మాజీ కార్పొరేటర్, రామిరెడ్డి హవా, అధికారం కోల్పోయి, ఆరు నెలలు అవుతున్న అతనిదే హవా, కార్పొరేషన్ అనుమతులు లేకుండా భారీ భవంతులు కడుతున్న ఏమి పట్టి పట్టనట్లు చూస్తూ ఉంటున్న వివెంసి అధికారులు, కూటమి ప్రభుత్వం వచ్చి 27 నెలలు అవుతున్న ఈ కార్పొరేటర్ కి పదవి కాలం అయిపోయి ఆరు నెలలు అవుతున్న డివిజన్ లో పెత్తనం చాలా ఇస్తున్నాడు, ఏ అధికారి వచ్చి అక్రమ నిర్మాణాన్ని అడ్డుకునే నాధుడు లేడు టౌన్ ప్లానింగ్ అధికారులు చేతులు తడిపితే చాలు, ఏది ఏమైతే మాకు ఏమిటి మాది మాకు వచ్చింది కదా అని చందనంగా ఉన్నారు, అక్రమ కట్టడాలపై విజయవాడ కార్పొరేషన్ కమిషనర్ వీటిపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు, ఈ కార్పొరేటర్ కి డివిజన్ లో హద్దు అదుపు లేకుండా పోతున్నాయి పైకి నేను మంచి బాలుడిని అని చెప్పుకుంటున్నాడు అధికారం పోయిన, అధికారులపై పెత్తనం చాలా ఇస్తున్నాడు టౌన్ ప్లానింగ్ అధికారులు ఇప్పటికైనా వీటిపై చర్య తీసుకోవాలని ప్రజల కోరుకుంటున్నాను,

## పారిశ్రామిక టౌన్ షిప్ ల నిర్మాణం

కేంద్ర సహకారంతో వివిధ ప్రాంతాల్లో పారిశ్రామిక టౌన్ షిప్ లను నిర్మించే అంశంపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి గృహ నిర్మాణ శాఖను ఆదేశించారు.

## ట్రామాడోల్ దుర్వినియోగంపై రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు

రాష్ట్రవ్యాప్తంగా 100 మందుల దుకాణాల్లో నిర్వహించిన తనిఖీల్లో 55 చోట్ల నిబంధనల ఉల్లంఘనలు బయటపడ్డాయి. ట్రామాడోల్, ఇతర కఠిన నిబంధనలున్న మందుల కొనుగోలు, విక్రయాల్లో ఈ అక్రమాలు గుర్తించారు. వీటిలో 53 చిన్నస్థాయి ఉల్లంఘనలు కాగా, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో రెండు చోట్ల పెద్ద మొత్తంలో మందుల కొనుగోలు, విక్రయాలు జరిగినా సంబంధిత బిల్లులు చూపించలేదు. అధికారులు కొనుగోలు పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.ప్రభుత్వానికి అందిన సమాచారం మేరకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలతో ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ డైరెక్టర్ జనరల్ అరుణ్‌బాబు ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో గుర్తించిన అంశాలతో అధికారులు మంత్రి సత్యకుమార్‌కు నివేదిక అందజేశారు.

**జంగారెడ్డిగూడెం నుంచి వెలుగులోకి..** ఈ రాష్ట్రవ్యాప్త తనిఖీలకు దారితీసిన ఘటన జంగారెడ్డిగూడెంలో వెలుగుచూసింది. జీలుగుమిల్లి గ్రామంలోని ఆయిల్‌పామ్ తోటలో పెద్ద సంఖ్యలో ఖాళీ, పగిలిన ఇంజెక్షన్ సీసాలు, వాడిన సిరంజీలు కనిపించడంతో జంగారెడ్డిగూడెం డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ పి.మల్లికార్జున్ అక్కడికి వెళ్లి పరిశీలించారు. అవి ట్రామాడెక్స్, ట్రామెక్ పేర్లతో ఉన్న ట్రామాడోల్ ఇంజెక్షన్లుగా గుర్తించారు.ట్రామాడోల్‌ను తీవ్రమైన నొప్పిని తగ్గించేందుకు వైద్యపరంగా ఉపయోగిస్తారు. అయితే మత్తు కలిగించే ప్రభావం ఉండటంతో కొందరు దీనిని మాదకద్రవ్యాలకు ప్రత్యామ్నాయంగా దుర్వినియోగం చేస్తున్నారు. అందువల్ల వైద్యుల సూచన మేరకు, నిబంధనల ప్రకారం మాత్రమే ఈ మందును విక్రయించాలి. అయితే కొందరు మందుల దుకాణాల నిర్వాహకులు మధ్యవర్తులతో కలిసి సరైన బిల్లులు, రికార్డులు లేకుండా విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

**భారీగా ఇంజెక్షన్ల కొనుగోలు..** దీంతో ట్రామాడోల్ తయారీ సంస్థల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పంపిణీ వివరాలను అధికారులు సేకరించి పరిశీలించారు. జంగారెడ్డిగూడెం ప్రాంతంలోని కొన్ని మందుల దుకాణాలు పెద్ద మొత్తంలో ట్రామాడోల్ ఇంజెక్షన్లు కొనుగోలు చేసినట్లు గుర్తించారు. దీంతో శ్రీ లక్ష్మి శ్రీనివాస మెడికల్ ఏజెన్సీ, డి.రూప పెద్దింటి మెడికల్ ఏజెన్సీల్లో తనిఖీలు నిర్వహించారు.శ్రీ లక్ష్మి శ్రీనివాస మెడికల్ ఏజెన్సీ ఈ ఏడాది రెండు బిల్లుల ద్వారా 20 వేల ట్రామాడోల్ ఇంజెక్షన్లు కొనుగోలు చేసినట్లు అధికారులు గుర్తించారు. అయితే వాటి విక్రయ బిల్లులు, నిల్వ వివరాలను చూపించలేదు. విచారణలో నాలుగు పెట్టెల ట్రామాడెక్స్ ఇంజెక్షన్లను స్నేహితుడి చెక్కపనుల దుకాణంలో దాచినట్లు బయటపడింది. అక్కడ తనిఖీ చేయగా 7,550 ఇంజెక్షన్లు లభించడంతో అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఇంజెక్షన్లను జంగారెడ్డిగూడెం, మేద్యానపు వరిగూడెం, వేగవరం, కుక్కునూరు తదితర ప్రాంతాల్లోని దుకాణాలు, వ్యక్తులకు సరఫరా చేసినట్లు విచారణలో వెల్లడైంది.

**నకిలీ బిల్లులతో మరో వ్యవహారం..** మరోవైపు డి.రూప పెద్దింటి మెడికల్ ఏజెన్సీ గత రెండేళ్లలో 5,200 ట్రామెక్ ఇంజెక్షన్లు కొనుగోలు చేసినట్లు తేలింది. వీటిలో 3,930 ఇంజెక్షన్లను తెలంగాణలోని ఓ మందుల దుకాణానికి విక్రయించినట్లు బిల్లులు చూపించారు. అయితే తెలంగాణ అధికారులు ఆ లావాదేవీ నకిలీదని గుర్తించారు.నకిలీ బిల్లులు తయారు చేసి, వాస్తవానికి ఆ మందులను ఇతర దుకాణాలకు బిల్లులు లేకుండా సరఫరా చేసినట్లు విచారణలో బయటపడింది. ఈ వ్యవహారంపై డ్రగ్స్ నియంత్రణ శాఖ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో జంగారెడ్డిగూడెం పోలీసులు ఐదుగురిని అరెస్టు చేసి జైలుకు పంపారు. అరెస్టయిన వారిలో మందుల దుకాణాల యజమానులు, ఒక ఉద్యోగి ఉన్నారు.

**అక్రమ లావాదేవీలపై చర్యలు** జంగారెడ్డిగూడెం ఘటనతో పాటు రాష్ట్రవ్యాప్తంగా జరిగిన తనిఖీల్లో వెలుగుచూసిన అక్రమాలపై ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ తదుపరి చర్యలకు సిద్ధమైంది. పెద్ద మొత్తంలో అక్రమ లావాదేవీలు చేసిన మందుల దుకాణాల లైసెన్సులు రద్దు చేసేందుకు చర్యలు చేపడుతోంది.ట్రామాడోల్ లేదా ఇతర కఠిన నిబంధనలున్న మందులను అక్రమంగా తరలించడం, అనుమతి లేకుండా నిల్వ చేయడం, సరైన రికార్డులు లేకుండా విక్రయించడం వంటి చర్యలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. పోలీసులతో, ఇతర అమలు సంస్థలతో కలిసి దర్యాప్తు కొనసాగిస్తూ, రికార్డుల పరిశీలన ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ డైరెక్టర్ జనరల్ శ్రీ అరుణ్‌బాబు పేర్కొన్నారు.

## హౌసింగ్ ఫర్ ఆల్ లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళిక

రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి 2029 నాటికి సురక్షితమైన, శాశ్వతమైన ఇల్లు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం హౌసింగ్ ఫర్ ఆల్ కార్యక్రమాన్ని సంతృప్తి స్థాయిలో అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. 2027 మార్చి నాటికి 5.52 లక్షల ఇళ్లను పూర్తి చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. గృహ నిర్మాణ శాఖపై క్యాంపు కార్యాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్, పీఎం జన్ మన్ సహా వివిధ పథకాల కింద చేపట్టాల్సిన ఇళ్ల నిర్మాణాన్ని వచ్చే నెలలోగా గ్రౌండింగ్ చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 1.5 లక్షల ఇళ్లను పట్టణ ప్రాంతాల్లోనూ నిర్మాణం చేయాలని సీఎం సూచించారు. డిసెంబరు 2026 నాటికల్లా 2.05 లక్షల ఇళ్లు, 2027 మార్చి నాటికి మరో 2.74 లక్షల ఇళ్లు పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. పీఎంఏవై 1.0, పీఎంఏవై 2.0, పీఎం జన్ మన్ పథకాల కింద రాష్ట్రంలో 18.72 లక్షల ఇళ్ల మంజూరు కాగా.. ఇప్పటి వరకూ 13.20 లక్షల ఇళ్లు పూర్తి అయ్యాయని అధికారులు వివరించారు. ఏపీ హౌసింగ్ కార్పోరేషన్ పరిధిలో మొత్తం 16.11 లక్షల ఇళ్లకు గానూ ఇప్పటికే 11.31 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి అయిందన్నారు. ఏపీ టిడ్కో పరిధిలో 2.61 లక్షల ఇళ్లకు గానూ 1.88 లక్షల ఇళ్లు పూర్తి అయ్యాయని సీఎంకు వివరించారు. 2027 డిసెంబరు నాటికి 75 వేల కొత్త గృహాలను మంజూరు అయ్యేలా చూడటంతో పాటు 1.5 లక్షల ఇళ్లను పైప్ లైన్ లోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి సూచించారు. దీనికి సంబంధించి కేంద్ర గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి శాఖలతో సమన్వయం చేసుకుని అవసరమైన కేటాయింపులు పొందాలని సీఎం స్పష్టం చేశారు.

**ఉచిత ఇళ్ల స్థలాలపై ప్రత్యేక కార్యాచరణ** ఇంటి స్థలాలు లేని కుటుంబాల వాస్తవ డిమాండ్‌ను గుర్తించేందుకు ఆర్టీజీఎస్ సహా ఆవాస్ ప్లస్, హౌసింగ్, రెవెన్యూ శాఖల నుంచి డేటాను అనుసంధానం చేసుకుని డూప్లికేషన్ లేకుండా అర్హులను గుర్తించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో ప్రాథమిక లబ్ధిదారుల జాబితాలను ప్రచురించి అభ్యంతరాలను స్వీకరించి పారదర్శకంగా పరిష్కరించిన అనంతరం తుది జాబితాలను ఖరారు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే ఉన్న లే అవుట్లలో నిర్మాణాలు చేపట్టని భూమిని అవసరానికి అనుగుణంగా 2 లేదా 3 సెంట్ల ప్లాట్లుగా పునర్వ్యవస్థీకరించాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఖాళీ స్థలాల గుర్తింపు, అర్హులైన లబ్ధిదారులకు మ్యాపింగ్, నిర్మాణం పూర్తయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సీఎం సూచించారు. కుప్పం నియోజకవర్గంలోనూ సాచురేషన్ విధానంలో గృహ నిర్మాణం చేపట్టాలన్నారు. 2029 నాటికి రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి సురక్షితమైన, శాశ్వతమైన ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. శాఖల మధ్య సమన్వయంతో అందరికీ ఇళ్లు లక్ష్యాన్ని పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు.

## టీడీపీ ఎమ్మెల్యే మారువేషం.. ఎక్కడంటే..!

పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సామాన్యుడిలా మారువేషంలో వెళ్లి ఓ ప్రభుత్వ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏలూరు జిల్లా బుట్టాయగూడెం తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా ఆసక్తిని రేకెత్తించింది. కార్యాలయ సిబ్బంది పనితీరును, ప్రజలకు అందుతున్న సేవల నాణ్యతను స్వయంగా పరిశీలించేందుకే ఆయన ఈ తనిఖీ చేపట్టారు. ఎమ్మెల్యే బాలరాజు మంగళవారం ఉదయం 11:30 గంటల సమయంలో గళ్ల లుంగీ, టీ-షర్ట్ ధరించి, ముఖానికి మాస్క్ పెట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. సుమారు గంటపాటు అక్కడే ఉండి, కార్యాలయ కార్యకలాపాలను, సిబ్బంది ప్రవర్తనను నిశితంగా గమనించారు. మారువేషంలో ఉండటంతో అక్కడ ఉన్నవారెవరూ ఆయన్ను గుర్తుపట్టలేకపోయారు. అదే సమయంలో, తన స్థల వివాదం పరిష్కారం కావడం లేదంటూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న మాధవరావు అనే విశ్రాంత ఉపాధ్యాయుడు, సామాన్యుడిగా ఉన్న ఎమ్మెల్యే వద్ద తన గోడు వెళ్లబోసుకున్నారు. వెంటనే స్పందించిన బాలరాజు తన అసలు గుర్తింపును వెల్లడించి, కార్యాలయ సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. చిత్తశుద్ధితో బాధ్యతలు నిర్వర్తించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే చేపట్టిన ఈ ఆకస్మిక తనిఖీ ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

## అనంతపురం జిల్లా ప్రజాప్రతినిధులకు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఆత్మీయ విందు

### జిల్లా అభివృద్ధికి ప్రజాప్రతినిధుల సమన్వయం ఎంతో కీలకం





**అనంతపురం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 15 నంది పత్రిక** అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ జిల్లా ప్రజాప్రతినిధులకు ఆత్మీయ విందు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించిన అభివృద్ధి అంశాలు, ప్రజా సమస్యలు, స్థానిక సంస్థల ఎన్నికలు తదితర అంశాలపై ప్రజాప్రతినిధులతో ఆత్మీయంగా చర్చించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి టి.జి. భరత్ , ప్రభుత్వ విప్ రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు, స్థానిక సంస్థల ఎన్నికల అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జ్ ఏరాసు ప్రతాప్ రెడ్డి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పూల నాగరాజు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, తాడిపత్రి ఎమ్మెల్యే జేసీఅస్మిత్ రెడ్డి , సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి తదితరులు హాజరయ్యారు.ఈ ఆత్మీయ విందు కార్యక్రమం ప్రజాప్రతినిధుల మధ్య స్నేహపూర్వక వాతావరణంలో సాగింది.స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరంపై కూడా కార్యక్రమంలో చర్చ జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం, ప్రభుత్వ అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపై నాయకులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. జిల్లా ప్రజాప్రతినిధుల మధ్య ఆత్మీయత, పరస్పర సహకారం, సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే విధంగా ఈ కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగింది. అనంతపురం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు.

## ఆళ్ల నాని మృతి పట్ల ఎంపీ పుట్టా మహేష్ కుమార్ దిగ్భ్రాంతి.



**ఏలూరు, బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 15 నంది పత్రిక:** ఏలూరు మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి, ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ (నాని) ఆకస్మిక మృతి పట్ల ఎంపీ పుట్టా మహేష్ కుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు మీడియాకు ఎంపీ ఒక ప్రకటన విడుదల చేశారు. ఆళ్ల నాని మృతి ఏలూరు ప్రజలకు తీరని లోటు అన్న ఎంపీ, నాని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. 2004 లో మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి రెండు దశాబ్దాలకు పైగా ఏలూరుతో పాటు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రాజకీయాల్లో, ప్రజాసేవలో ఆళ్ల నాని తనదైన ముద్ర వేశారని చెప్పారు. ఈ క్లిష్ట సమయంలో వారి కుటుంబ సభ్యులకు ధైర్యం, మనోబలం కలగాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆకాంక్షించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు ఎంపీ తెలిపారు.

## టీటీడీకి కూరగాయల అందచేయడం అభినందనీయం

### టీటీడీకి కూరగాయల లారీకి జెండా ఊపిన ఎమ్మెల్యే గద్దె రామమోహన్



**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 15 నంది పత్రిక** తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగే నిత్య అన్నదానానికి కూరగాయలన పంపడం చాలా ఆనందంగా ఉందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. సోమవారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని సిద్ధార్థ కళాశాల సమీపంలోని భారత్ పెట్రోల్ బంకు దగ్గర నుంచి తిరుమల తిరుపతికి వెళుతున్న కూరగాయల లారీకి ఎమ్మెల్యే గద్దె రామమోహన్ జెండా చూపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ తిరుమల తిరుపతిలో 1984 సంవత్సరంలో నిత్య అన్నదానాన్ని ఆనాటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు ప్రారంభించారన్నారు. విజయవాడ నగరం నుంచి తిరుపతిలో జరిగే నిత్య అన్నదానానికి కూరగాయలను మండవ కుటుంబరావు ప్రారంభించారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని గద్దె శ్రీనివాసరావు తదితరులు ఇప్పుడు పది టన్నుల కూరగాయలను పంపుతున్నారని చెప్పారు. అన్నదానం చాలా గొప్పదని పేర్కొన్నారు. కోట్ల రూపాయలు సహాయం చేసే కంటే తోటి వారి ఆకలిని తీర్చడం చాలా గొప్ప విషయమని అన్నారు. 4వ సారి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు అయిన తర్వాత టీటీడీలో నాణ్యమైన భోజనాలను ఏర్పాటు చేయడం, కొండపై పరిశుభ్రతను పాటించడం లాంటి చేస్తున్నారని చెప్పారు. చెన్నుపాటి ఉషారాణి మాట్లాడుతూ నిత్య అన్నదానానికి కూరగాయలను పంపించడం అభినందనీయమని అన్నారు. ధన, వస్తు, కూరగాయాల రూపంలో టీటీడీకి సహాయం చేయడం సంతోషంగా ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కంటే ఇప్పుడు భోజనాలు చాలా బాగున్నాయని భక్తులు చెబుతున్నారన్నారు. ఈ కార్యక్రమములో ఎమ్మెల్యేతోపాటు స్థానికులు, వేంకటేశ్వర స్విమివారి భక్తులు పాల్గొన్నారు.

## స్టేట్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ లో సత్తా చాటిన చిన్నారి శ్రీకర లాస్య

### లాస్యను అభినందించిన ఎమ్మెల్యే గద్దె రామమోహన్

**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 15 నంది పత్రిక** క్రీడాకారులను అన్ని రకాలుగా ప్రోత్సహించడానికి తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. పతకాలు సాధించిన టైటిల్‌ను సొంతం చేసుకున్న లాస్యను ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మంగళవారం అభినందించారు. మంగళవారంనాడు 12వ డివజన్ లోని శాసనసభ్యుని కార్యాలయంలో తనను కలిసిన లాస్య, ఆమె తల్లిదండ్రులు, కోచ్ లతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ కాకినాడలో జరిగిన స్టేట్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్లో విజయవాడకు చెందిన చిన్నారి శ్రీకర లాస్య అద్భుత ప్రతిభ కనబరిచి మొత్తం 5 పతకాలను సొంతం చేసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. చిన్న వయసులోనే రాష్ట్ర స్థాయి టైటిల్ ను లాస్య సొంతం చేసుకుని, మొత్తం 4 గోల్డ్, ఒక రజత పతకాన్ని సొంతం చేసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే ఇంతటి ప్రతిభ కనబరచడం గర్వకారణమని, లాస్య భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి తెలుగు రాష్ట్రాలకు, విజయవాడకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించడానికి అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. లాస్య తల్లిదండ్రులను, కోచ్ ను శాసనసభ్యులు ప్రత్యేకంగా అభినందించారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com